నవశక్తి

Vol. 1, no. 43

(Oct. 19, 1938)

బెజవాడ, 1938

Record no. 682

Navaśakti

Vol. 1, no. 43

(Oct. 19, 1938)

Bejavāḍa, 1938

Record no. 682

జిల్లా బోర్డు ఎన్నికలు

M. 3824

నవశక్తి

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పత్రిక

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రా

సంపుటం 1 | బుధవారము 19–10–38 బెజవాడ | సంచిక 43

లెనిన్



వీరి నాయకత్వాన రష్యాలో స్థాపింపబడిన సోవియట్ ప్రభుత్వ 21 వ వార్షికోత్సవం నవంబరు 7 వ తేదీని ప్రపంచ మంతటా జరుప బడుతుంది.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధసంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

* * *

చందాదారులను చేర్పించాలి!

సెప్టెంబరులో ఈ క్రింది విధంగా చేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"లు పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం.

ముఖ్యంగా పార్టీ సభ్యులు తీవ్రంగా పనిచేసి 'కోటా' పూర్తి చేస్తారని నమ్ముతున్నాం.

అక్టోబరు నెల రెండు వారాలలో

	కోటా	చేర్పించినది
[illegible]ణము	10	0
[illegible] గోదావరి	50	0
[illegible] గోదావరి	70	5
కృష్ణా జిల్లా	80	12
గుంటూరు	40	12
నెల్లూరు	35	1
రాయలసీమ	10	2
ఇతరస్థలాలు	5	1
	300	33

కాంగ్రెసు ఎన్నికలు — అతివాదుల కర్తవ్యం

సుభాషు బోసునే తిరిగి ఎన్నుకోవాలి.

కాంగ్రెసులో సభ్యులను చేర్పించే గడువు యీనెలాఖరుతో పూర్తిఅవుతోంది. క్రిందటి సంవత్సరంలో చేరినంతమంది యీసంవత్సరం చేరేటట్లు తోస్తోంది. కాంగ్రెసు నాయకులలో జరుగుతున్న సమాధాన పడాలనే కోరిక స్పష్టంగా కనబడుతోంది. ఇందువల్ల, కాంగ్రెసుయెడల వైఖరిలో గల ఉత్సాహం సన్నగిలుతుంది. ఫెడరేషన్ సమస్యపై స్పష్టమైన కార్యక్రమం యిచ్చి నడపలేకపోవడం వల్లను, సామ్రాజ్యవాదులపై తిరుగుబాటు చేయడానికి బదులు అతివాదులపై తిరుగుబాటు చేయడానికి చేసేబెదరింపుల వల్లను, సాధారణప్రజల్లో గందరగోళం పుట్టుతోంది. కాంగ్రెసుసంస్థయొక్క బలాన్ని వృద్ధిచేయ ఉత్సాహం నశిస్తోంది. అనుమానాలు భయాలు ఎక్కువౌతున్నాయి. కాంగ్రెస్ అంటే మన ప్రధాన జాతీయసంస్థ, ఈసంస్థయెడల ముఖం చాటు చేసుకోవడం చేతగానితనం. దానిఅభివృద్ధే మనఅభివృద్ధి: దానిపతనమే మనపతనం. మనలోఉన్న శక్తినంతటినీ ధారపోసి, మనకు దానియెడల ఎంతభక్తి ఉన్నదో అంత భక్తితోను కాంగ్రెస్ సభ్యులను చేర్పించి, కాంగ్రెస్‌యొక్క బలాన్ని వృద్ధి చేయాలి. అప్పుడే మనబలంకూడా ఎక్కువౌతుంది. గతసంవత్సరం చేరినంతమందినే కాకుండా అంతకన్న యెక్కువమందిని కాంగ్రెస్ సభ్యులుగా ఈయేడు చేర్చాలి.

కార్యక్రమం

పావలాసభ్యులను చేర్పించినంతమాత్రాన సరిపోదు. కాంగ్రెస్ సభ్యత్వం అంటే, ప్రతి భారతీయుడు గర్వించదగిన ఒక బిరుదుగా ఎంచుకొనేటట్లు చేయాలి. చందాదార్లను చేర్పించడం ఒకరాజకీయ ప్రచారంగాచేయాలి. ఈ క్రిందికార్యక్రమాన్ని ప్రజలలో విరివిగాప్రచారం గావించాలి. ఏసమస్యలపై భారతీయులందరియొక్కశక్తి కేంద్రీకరింపబడాలో, ఏసమస్యలను గురించి కాంగ్రెస్ మహాసభ యిదివరకే నిశ్చితాభిప్రాయాలను యిచ్చిందో ఆ సమస్యలు యీ కార్యక్రమములో యిమిడి ఉన్నాయి. వాటిని వెంటనే, నేడు, ఆచరణలోపెట్టవలసిన అగత్యం ఉన్నది.

1. సామ్రాజ్యవాద యుద్ధాలను ప్రతిఘటించడం క్రియారూపం దాల్చాలి. యుద్ధాలవల్ల మనకుకలిగే ప్రమాదాన్నిగురించి హరిపూర్ కాంగ్రెస్‌లో ఆమోదించబడిన తీర్మానాన్ని ప్రజలలో వెంటనే విరివిగా ప్రచారం చేయాలి. సామ్రాజ్యవాద దేశమైన గ్రేట్‌బ్రిటన్‌కు ఒక్క మనిషిగాని, రూపాయిగాని పంపకూడదు.

2. ఫెడరేషన్ అమలు జరుపబడకుండా నిరంతరము వ్యతిరేకించాలి. మన ప్రజలు నిత్యమూ చేసే వైనందిన పోరాటాలను ఫెడరేషన్ ప్రతిఘటనకు కావలసిన పెద్ద జాతీయ పోరాటానికి దారితీసేలాగున అభివృద్ధిచేయాలి. యుక్త వయస్సు వచ్చిన ప్రతి భారతీయునిచేత ఎన్నుకోబడు ప్రజాప్రతినిధులసభ (Constituent Assembly) ను సమావేశపరచాలి. స్వాతంత్ర్యంతో కూడిన ప్రజాస్వామిక ప్రభుత్వ (Free democratic Republic) న్ని స్థాపించాలి.

3. ఎన్నికల ప్రణాళికలో ఉన్న రైతు-కార్మికుల కోర్కెలను ధైర్యంగా అమలుపరచాలి. జాతీయ ప్రతికూలురైన ధనికవర్గాలతో రాజీలు పనికిరావు. జాతీయ విద్రోహుల ప్రతికూలోద్యమాన్ని పడగొట్టటానికై మంత్రుల వెనుక ప్రజాసామాన్యపు బలాన్ని కేంద్రీకరించాలి.

4. ప్రజల పౌరసత్వపు హక్కులు వృద్ధి కావాలి; అరికట్టబడకూడదు. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి. నిరంకుశ శాసనాలన్నిటినీ రద్దు చేయాలి. సమ్మెలలో 144-వ సెక్షన్ అమలు జరుపకూడదు. కార్మిక ప్రచారకుల మీద, రైతు సేవకులమీద సెక్యూరిటీ కేసులు పెట్టకూడదు.

5. సంస్థాన ప్రజల కోర్కెలకు సంపూర్ణమైన సహాయం; తటస్థ విధానం విడిచిపెట్టాలి.

6. కాంగ్రెస్ నియమావళిలో ప్రజాతంత్ర సూత్రాలను ప్రవేశపెట్టాలి.

వైషమ్యాలు ఏర్పడకూడదు.

చందాదార్లను చేర్పించడం పూర్తి అయాక కాంగ్రెస్ కమిటీ యెన్నికలువస్తాయి. కాంగ్రెసువాదులలో చీలిక లేర్పడేటందుకు కాకుండా, ఐకమత్యాన్ని పెంపొందించడానికి ఈ యెన్నికలు ఉపయోగపడాలి. ఈ యెన్నికలద్వారా సోషలిష్టులకు, సోషలిష్టులుకాని కాంగ్రెసువాదులకు మధ్య వైషమ్యాలు ఏర్పడకుండా చూడాలి. ఉన్నవారిలో ఉత్తమ కాంగ్రెసువాదులు ఎన్నుకొనబడేటట్లు చూడాలి. ప్రతి సోషలిష్టు ఆదర్శప్రాయమైన కాంగ్రెసువాదిగా ఉండాలి. అందరూ సోషలిష్టులు కాకుండా, ఇతరులుకూడా ఉండే జాబితాను సోషలిష్టులే తయారుచేసి, దానిని సూచించాలి. కాంగ్రెసువాదులందరిచేత సాధారణంగా అంగీకరించబడే అభ్యర్థులను ఆజాబితాలో జేర్చాలి. ఈపద్ధతివల్ల కాంగ్రెస్ కమిటీలలో ఐక్యత ఏర్పడుతుంది. పనికూడా చక్కగా సాగుతుంది.

వచ్చేయేటికి కూడా సుభాష్‌బోసే ప్రెసిడెంటు

నేడుక్లిష్టమైన పరిస్థితుల్లో మనం ఉన్నాం. మనప్రజలకు నాయకుడైన, కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రజలందరినీ ఏకముఖానికి చేర్చవలసియున్నది; అంతేకాదు. దేశానికి శత్రువైన బ్రిటీషుప్రభుత్వంతో ఢీకొనడానికి ప్రజలను తయారుచేయాలి. కాంగ్రెసువాదుల దృక్పథానికి ఆధునిక వైఖరిని కలిగించడంలో, ఇతర నాయకులకంటే జవహర్లాల్‌నెహ్రూ, సుభాష్‌బోసుగారలు ఎంతోసహాయపడ్డారు. జాతీయోద్యమాన్ని వీరు పూర్వంకంటె తీవ్రమైన దానినిగాచేసి, మనప్రధాన సమస్యలను పరిష్కరించు కోవడంలో అనుకూలమైన పరిస్థితులు కల్పించారు. ఈమధ్య ఫెడరేషన్‌సమస్యపై బోసుచేసిన ప్రకటనవల్ల, భూలాభాయిలు సత్యమూర్తులు యెవరిస్థానాలకువారు తగ్గారు. ఫెడరేషన్‌ను మనపై నిర్బంధంగా రుద్దుటకు ఆలోచిస్తున్న బ్రిటీష్ సామ్రాజ్యవాదులకతడు ప్రబలమైన శత్రువు. మన ఉద్యమంలో ఐక్యత అత్యవసరమైన రోజులివి. కాని కాంగ్రెసులో అంతఃకలహాన్ని కల్పించడానికి కొంతమంది నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్లిష్టసమయంలో సుభాష్‌బోస్ మనఉద్యమము యొక్క ఈ రెండుశాఖలమధ్య ఐక్యతను సమకూర్చేవ్యక్తి. వచ్చే సంవత్సరంలో కూడా సుభాష్‌బోసు కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకొనబడేలాగున తీవ్రంగా మనం ప్రచారం సాగించాలి.

ఎట్టివారిని ఎన్నుకోవాలి?

కాంగ్రెస్ సాధారణ సభ్యుల అభిప్రాయాలను, కోరికలను నేటి నాయకులు పూర్తిగా ప్రతిబింబింప చేయడంలేదు. రోజు రోజుకూ వృద్ధి చెందుతూన్న ప్రజా ఉద్యమానికి దూరమవుతున్నారు. ఇందువల్ల, మన జాతీయోద్యమం వృద్ధి చెందడం గాని, ఎక్కువ కావడంగాని జరగదు. కాబట్టి, వర్కింగ్ కమిటీని నామినేట్ చేసే పద్ధతి పోయి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుల చేత ఎన్నుకొనబడాలని మనం తీవ్రమైన ఆందోళన సాగించాలి. ప్రాథమిక కాంగ్రెసు కమిటీలకు, రాష్ట్ర కమిటీలకు, అఖిల భారత కాంగ్రెసు కమిటీకి మనం ఎట్టి సభ్యులను ఎన్నుకోవాలంటే, పైన సూచించిన కార్యక్రమాన్ని వారు అంగీకరించేవారై యుండాలి. అంటే, వారు యితర కాంగ్రెసు వాదుల కంటె ఎక్కువ రాజకీయ చైతన్యము కలిగినవారై యుండాలి: కాంగ్రెసు సంస్థలో ప్రజాతంత్ర సూత్రాలు ప్రవేశపెట్టబడే వరకూ యిప్పుడున్న కాంగ్రెసు కమిటీలు అట్టి సూత్రాల ప్రకారం పని చేసేటట్లు మనం చూడాలి. మనం బలపరచే అభ్యర్థులు పై కార్యక్రమాన్ని మాటలతో అంగీకరించడం కాక, క్రియారూపేణ వారి వారి కాంగ్రెస్ కమిటీలలో తీవ్రంగా పని చేసేవారుగా ఉండాలి; ప్రజల కోర్కెలకై పనిచేసే ప్రజాయత్త సంస్థలుగా చేయడానికి కృషి చేసేవారుగా ఉండాలి; ఏ కార్యక్రమం కొరకు కాంగ్రెసు పని చేయవలసియుందో, ఆ కార్యక్రమాన్ని ఇంకా ఎక్కువగా ఆచరణలో పెట్టడానికి ఇతర ప్రజా సంస్థలతో చేయికలిపి పని చేసేవారుగా ఉండాలి.

తీవ్ర కృషి అవసరం!

దీనిలో కొత్త విషయం ఏమీలేదు. కాంగ్రెసు యొక్క 'నేటి కార్యక్రమంలో యీ అంశాలన్నీ ఉండనే ఉన్నాయి. కాని, ఉత్సాహంతో వాటిని నేడు ఆచరణలో పెట్టడానికి తీవ్రమైన కృషి అవసరం. కాంగ్రెస్ కమిటీ ఎన్నికలు యిందుకు చక్కని అవకాశాన్ని యిస్తాయి. ఎందువల్లనంటే, యీ పనికై ప్రతి కాంగ్రెసువాదీ ఏకమై, కలిసి పని చేయవచ్చు. మన కర్తవ్యాన్ని నెరవేర్చుటకై నమ్మకమైన నాయకులను ఎన్నుకోవడానికి కాంగ్రెస్ ఎన్నికలే సరియైన అదను.

అతివాదుల కర్తవ్యం.

కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టులు, రాయిస్టులు, అతివాద కాంగ్రెసువారు ఒక అతివాద పక్షంగా చేరి, కలసి పని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో అతివాదులకు తగిన బలాన్ని చేకూర్చాలి; కాంగ్రెసు వాదులలో వీరికి పలుకుబడిని సంపాదించాలి. నేటి పరిస్థితులలో, అతివాదులే కాంగ్రెస్ కార్యక్రమానికి ఎక్కువ బద్ధులై యున్నారు. వీరంతా కలసి మితవాదుల మీద విరుచుకు పడకూడదు. కాంగ్రెస్ సంస్థలో ఐక్యతను పెంపొందించే వారు వీరేనని నిరూపించాలి: చీలికలు కలుగ జేయాలని ప్రయత్నించే వారి ప్రయత్నాలను భగ్నంగావించేవారు కాంగ్రెస్ సంస్థకే హానికలిగేటట్లు, ఆత్మ వినాశకరమైన పద్ధతులతో పనిచేసేవారి యత్నాలను అరికట్ట గలిగేవారు, ఈ అతివాదులేనని నిరూపించాలి.

—నేషనల్ ఫ్రంటునుండి

సుభాష్‌బోసును వచ్చే [illegible] అధ్యక్షునిగా ఎన్నుకోవలసినదని ఈ క్రింది[illegible] విజ్ఞప్తిచేయుచున్నారు:

సజ్జద్ జహీర్, డాక్టరు అహమ్మద్, ([illegible] కాం. కమిటీ సభ్యుడు) సోషన్‌సింగ్ [illegible] యం. యల్. ఎ., (అ. భా. కాం. [illegible] సభ్యుడు) భగత్‌సింగ్ బిల్గా, (అ. [illegible] కమిటీ సభ్యుడు) నృపేంద్ర చక్రవర్తి, [illegible] ముఖర్జీ, (బెంగాల్ కాంగ్రెస్ సోషలిష్టు [illegible] కార్యదర్శులు) బి. సి. పాణిగ్రహి ([illegible] కాంగ్రెస్ సోషలిష్టుపార్టీ కార్యదర్శు[illegible] జీవానందం (తమిళనాడు కాం. సో. [illegible] కార్యదర్శులు) పి. రామమూర్తి, ([illegible] కాం. కమిటీ సభ్యుడు), పి. సుంద[illegible] (ఆం. రా. కాం. సో. పార్టీ కార్యద[illegible]) అల్లూరి సత్యనారాయణ, అన్నాప్రగడ [illegible]శ్వరరావు, (అ. భా. కాం. కమిటీ సభ్యు[illegible]) ఇ. యం. ఎస్. నంబూద్రిపాద్ (కేరళ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి).

బొంబాయి రాష్ట్రంలో జనరల్ స్ట్రయికు

నవంబరు 7 వ తేదీ

బొంబాయి కార్మిక నాయకుల ప్రకటన

యస్. ఎ. మిరాజకర్, కె. యన్. జోగ్లేకర్, ఎ. టి. రణదేవ్, యస్. వి. దాంగే, కె. బఖాలే, యస్. జి. పాట్కర్, ఎస్. వి. ఘాటే, డి. యస్. వైద్య, ఆర్. ఆర్. భక్లే, జి. యస్. మహమ్మద్ కాన్, గార్లు ఈక్రింది ప్రకటన గావించిరి.

బొంబాయి కార్మిక తగాదా బిల్లుపట్ల తమ అసమ్మతిని బొంబాయి రాష్ట్రమందున్న కార్మికులందరు నవంబరు 7 వ తేదీన ఒక రోజు జనరల్ స్ట్రయిక్ చేసి ప్రదర్శనములు చేయవలసినదని బొంబాయి ట్రేడుయూనియన్ కాంగ్రెసు ప్రకటించినది. మేము యీ నిర్ణయానికి వచ్చేముందు, కాంగ్రెసు సభ్యులమైన మేము కాంగ్రెసుపట్లను కార్మికవర్గముపట్లను మేము నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని పూర్తిగా గమనించియే నిశ్చయించితిమి. ఈ బిల్లు కాంగ్రెసుమంత్రులను వలపన్నెట్టునదై కాంగ్రెసుకు వ్యతిరేకమైనదని చెప్పెడివారి వాదన వక్రమైనది. కాంగ్రెసుమంత్రులు తమ వాగ్దానాలను సక్రమముగా నెరవేర్చుకొనుటకు వీలగునట్లు, యీ బిల్లులోని లోపాలను కార్మికవర్గముయొక్క అవసరాలను విపులముగా కాంగ్రెసుమంత్రులకు తెలియజెప్పుటకు యీబిల్లుయొక్క మొదటి ముసాయిదా ప్రకటితమైననాటినుండియు, మేము సర్వప్రయత్నములను చేసియుంటిమి.

బొంబాయి గవర్నమెంటు కార్మికుల విషయమై నిర్వహించదలచిన కార్యక్రమము మొదట ప్రకటితం కాగానే కాంగ్రెసు మంత్రివర్గము కార్మికులకు సమ్మెహక్కు, నిర్మాణ హక్కు మొదలగు హక్కులను నిలుపుతూ శాసనాలను చేయుచున్నదని మేము వాటినాహ్వానించితిమి. ఈ బిల్లుయొక్క మొదటి ముసాయిదా ప్రకటితమైనది. కార్మిక తగాదా పరిష్కారం విషయమై ప్రభుత్వము అవలంబించదలచుకొనిన "రాజీ" విధానమునందలి సూత్రాన్ని ఆమోదించాము. కాని, కార్మికసంఘాలు సరిగా పనిచేయుటకును, వాటిని యజమానులచే గుర్తింపచేయుటకును తగు ఏర్పాటు చేయకున్నచో ఏవిధమయిన పరిష్కార యంత్రము కూడ నిష్ప్రయోజనము అని మేము స్పష్టముగ తెలియజేసియున్నాము. అంతేగాదు నిర్బంధ మధ్యవర్తిత్వము, కంపెనీ యూనియనుల ప్రోత్సాహము కల్పించే భాగాలనుకూడ మేము నిరశించియుంటిమి. నిరశించుటతోడనే యూరుకొనలేదు. స్పష్టమైన యీ మార్పులను కూడ మేము సూచించి యుంటిమి.

కొంతకాలమయిన పిదప మొదటి బిల్లులోని ఆక్షేపణీయ అంశాలన్నిటిని కలిగియున్న రెండవ ముసాయిదా సంకోచదానిని బొంబాయి ప్రభుత్వం తెచ్చినది. యీ బిల్లును యీ శాసనసభాసమావేశములో హడావిడిగా తెమిల్చివేద్దామని తలంచినది. యీబిల్లును ఒక సెలెక్టు కమిటీకి పంపుటకు బొంబాయి మంత్రివర్గము నిరాకరించుటచేత, ఈ కార్మికులలో గర్వింతగా యేమీ సమూహాలకు భగ్నమగుచున్నవి. తమ సలహాలు త్రోసివేయబడినవి. అందుచే శాసనసభలలో తమ ప్రతినిధులద్వారా యీ బిల్లును సవరించుటకు పోరాటమును ప్రారంభించిరి. సహోద్యోగమైన ఒకటి రెండు సవరణలు తప్ప తమ సలహాలు అంగీకరించబడలేదు. బిల్లు అంచెలంచెలుగా శాసనసభలో ప్రవేశపెట్టబడి బొంబాయి ప్రభుత్వం అంగీకరించలేదు.

ఈ బిల్లులోని హానికరాంశాలన్నిటిని కార్మికులు కార్మిక సంఘాలు ఆమోదించినవనియు, బొంబాయి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు బొంబాయి కార్మిక వర్గము యొక్క అభిప్రాయాలను వెలిబుచ్చటం లేదనియు, అపవాదులను ప్రారంభించిరి - ఇది సరికాదు. కార్మికులలోవెను కార్మికుల పోరాటములోను ఏనాడైనా సంబంధముగల వారందరికి మాకు కార్మికులు బిల్లును సహించరని తెలియును. దానికి వ్యతిరేకముగా పోరాటము సిద్ధముగానే యున్నారనియు పూర్తిగా తెలియును. ఈ బిల్లు వలన యజమానులకు ప్రత్యేకముగా తమ యొక్క శక్తిని పోగొట్టు కొనుచున్నారు, యజమానుల వృద్ధి నిరుపయుక్త కాంగ్రెసువారు మెట్టు పెట్టుచున్నారు. ఇది వారికి పోరాటానికి తీరని నష్టమని కార్మికులకు తెలియును.

మేము కార్మికుల ప్రతినిధులము కామనియు, కార్మికులు మమ్ము అనుసరించరనియు కాంగ్రెసు మంత్రులు మమ్ము తూలనాడుచున్నారు.

బొంబాయి రాష్ట్రమందున్న కార్మిక వర్గమంతయు తన అసమ్మతిని "ఒకదినపు సమ్మె" ద్వారా కాంగ్రెసు మంత్రివర్గమునకు ప్రదర్శింపదలచినది. దీనిని సామి మంత్రి వర్గమువారు నిర్లక్ష్యము చేయవలదంటిరి.

ఈ బిల్లు కార్మికుల సంఘ స్వాతంత్ర్యమునే గాక, స్వాతంత్ర్య పోరాటమును గూడ భగ్నము చేయుచుండుటచే కార్మికవర్గము ఈ బిల్లును వ్యతిరేకించు చున్నది. రాజకీయ సమ్మెలను, రాజకీయ హర్తాళలను యీ బిల్లు భగ్నము చేయుచున్నది. పారిశ్రామిక వర్గము ఏకము కాకుండా చీల్చుచున్నది. ఇందువలన తమ కర్తవ్యమును సరిగా అర్థము చేసుకుంటే, జాతీయ ఐక్య సంఘటనలో పాల్గొని, జాతీయ పోరాటమును విశ్వజయము గావించుటకు ముఖ్యముగ రావలసిన శ్రామిక వర్గము యొక్క బలము, శక్తి, నిస్సారము గావింపబడు చున్నవి. యీనాడు హడావిడిగా తేల్చివేయబడుచున్న బిల్లు యొక్క ప్రస్తుత స్వరూపము, జాతీయ ఐక్యతకును కాంగ్రెసుకు కూడ హానికరమైనది.

యీబిల్లు వలన తమ హక్కులన్నియు నశించుచుండుటచే కాంగ్రెసు నాయకత్వముపై కార్మికులు విశ్వాసము విడనాడుదురు. భారతజాతీయపోరాటములో కాంగ్రెసుతోపోరాడి, కాంగ్రెసుకు వ్యతిరేకముగా పనిచేసిన మిల్లు యజమానులెందరో ఈ బిల్లును బలపరచుచున్నారు. తన విరోధులను మెప్పించుటకు కాంగ్రెసు తన అనుచరులను మిత్రులను విడనాడుచున్నది.

విదేశీయ ప్రభుత్వాన్ని పారద్రోలుటకై శ్రామికజాతీయెక్కువను వినియోగించాలని కోరెడి ప్రతికాంగ్రెసువాదియు, కష్టజీవుల ప్రజాతంత్ర హక్కులను, నిలబెట్టి కష్టజీవులకు న్యాయం చేకూర్చవలెనని తలచే ప్రతిజాతీయవాదియుకూడా యీబిల్లును ఆపుచేయవలయును అను కార్మికుల న్యాయమైన హక్కుపట్ల నిర్లక్ష్యముగా నుండజాలడు. కార్మికుల అసమ్మతి ప్రదర్శనమునుండి మారకముగా నిలువమి వారిసమ్మెను నాయకులను. కాంగ్రెసుయొక్క ఎన్నిక ప్రణాళికను పాలించుటకు యీ బిల్లును ఆపు చేయవలసినదని స్థానిక కాంగ్రెసుద్వారా ఒత్తిడిని గొనివచ్చి కార్మికుల పక్షమున కాంగ్రెసు నునునిలుపుటకు పనిచేసితీరును.

ఆర్. ఆర్. బఖ్లేగారి ప్రకటన.

అఖిలభారత ట్రేడు యూనియను కాంగ్రెసు కార్యదర్శి బఖ్లేగారీ క్రింద ప్రకటన గావించారు:—

ట్రేడు యూనియను కాంగ్రెసు సమావేశమై ప్రతి సంవత్సరము అక్టోబరు 30 వ తారీఖును, ట్రేడు యూనియను దినముగా పరిగణించవలసినదిగ తీర్మానించింది. 1920 సం॥న అక్టోబరు 30 వ తారీఖునే ట్రేడు యూనియన్ కాంగ్రెసు స్థాపించ బడింది. అందుచే ట్రేడు యూనియను కాంగ్రెసుకు చెందిన యూనియను లన్నీ ఆదినాన్ని జయప్రదంగా ఊరేగింపుల నేర్పాటుచేసి, సభలుచేసి, జరుపవలసినదిగా కోరుచున్నాను. ట్రేడు యూనియను కాన్స్టిట్యూషనులో చెప్పబడిన కార్మిక వర్గంయొక్క ప్రధాన హక్కులను కల్గిస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చెయవలసినదిగా కోరవలెను. అట్టి చట్టాలను వెంటనే అమలులోకి తీసుకురావలెను. కొన్ని ప్రభుత్వాలు కార్మిక వర్గంయొక్క హక్కులను సంకుచిత పరచుచూ చేస్తూవున్న ప్రయత్నాలను తీవ్రంగా నిరసించ వలెను. ట్రేడు యూనియను దినము మొదటి పర్యాయము జరపడము కాన జయప్రదంగా జరుపుటకు సకల ప్రయత్నాలు చేయవలసినదిగా కోరుచున్నాను.

బొంబాయి కార్మిక తగాదా బిల్లు పట్ల అసమ్మతిని వెలిబుచ్చుచూ నవంబరు 7వ తేదీని బొంబాయి రాష్ట్రములో ఒక రోజు జనరల్ స్ట్రయిక్ చేయవలసినదిగా బొంబాయి రా. ట్రే. యూ. కాంగ్రెసు తీర్మానించినది. భారత దేశమందలి కార్మిక వర్గమంతయు, వీరి పోరాటానికి సానుభూతిని చూపవలసి యున్నది. ఈ బిల్లును యిప్పుడు అశ్రద్ధతో చూచినచో దేశమందన్ని రాష్ట్రములలోనూ కూడా ఇది సిద్ధమవ వచ్చును. యీ ఆపత్తునుండి తప్పించుకొనుటకు భారత దేశమందలి కార్మికులందరు ఏకమై పోరాడాలి. అందుచే అక్టోబరు 30 వ తేదీ (అ. భా. కార్మిక దినోత్సవమునాటి) కార్మికులందరూ సభలు, ప్రదర్శనాలు జరిపి అ. భా. ట్రే. యూ. కాంగ్రెసు తీర్మానం ఆమోదించి బొంబాయి కార్మికులకు బలము చేకూర్చ వలసినదిగా కోరుచున్నాను.

[ఆంధ్రరాష్ట్రమంతా యీ దినోత్సవమును జరుపవలసినదిగా కోరుచున్నాను.]

—పు. సుందరయ్య.

వార్తా లహరి



నెహ్రూ
ఇండియాకు మరలి వస్తున్నారు.

నోబుల్ బహుమానం ఎవరికి?

గాంధి జయంతి ఉత్సవాన్ని ఫ్రెండ్సు ఆఫ్ ఇండియా సంఘంవారు లండన్‌లో జరుపుతూ ఒక సభలో, ఈ సంవత్సరం నోబుల్ శాంతి బహుమానం గాంధి మహాత్మునికి ఇవ్వవలెనని కోరుతూ తీర్మానించారు.

జకోస్లోవేకియా సమస్యను శాంతియుతంగా పరిష్కరించి నందుకు, ఆ బహుమానం బ్రిటిష్ ప్రధాని నెవిల్లీ ఛాంబర్లేనుగారి కియ్యాలని ఒక హంగేరీ వార్తా పత్రిక కోరుతూంది.

బర్మాలో మతల అల్లరులా?

ఇదివరలో జరిగిన బర్మా అల్లరుల విచారణ ఇంకా పూర్తికాలేదు. మతల అల్లరులు చెలరేగు చున్నట్లు తెలుస్తోంది. మాండలేలో ముస్లిములు, బర్మనులు రెండు సార్లు కొట్లాడు కున్నారు. ఇద్దరు ముస్లిములు మరణించారు. పలువురు, వారూ వీరూ కూడా గాయపడ్డారు.

భూకంపం

కలకత్తాకు 2,800 మైళ్ళ దూరములో భూకంపం కలిగిందని ఆలిపూర్‌లోని సిస్మోగ్రాఫ్ యంత్రం తెల్పింది. బహుశా సెలిబిస్ దీవులలో కలిగియుండ వచ్చునని శాస్త్రజ్ఞుల ఊహ.

ఇంగ్లండుకు భారత పటాలాలు

భారత దేశాన్నుండి నాలుగు పటాలాలను ఇంగ్లండుకుపంపబడతాయని, వాటికయ్యేఖర్చులు బ్రిటిష్ ప్రభుత్వమే భరిస్తుందని క్రిందటి నెలలో ప్రకటింపబడింది. ఆ ప్రకారం ఇదివర కప్పుడే మూడు పటాలాలు పంపబడ్డాయి. నాల్గవ పటాలం పెషావరునుండి త్వరలోనే పంపబడునని తెలుస్తోంది.

స్త్రీలకు కసరత్తు

నాగపూరులో "న్యూ ఎడ్యుకేషన్ సొసైటీ" వారు స్త్రీలకు వ్యాయామ శిక్షాశాల నొకదానిని స్థాపిస్తారట. ఇందులో ఆడవారికి డ్రిల్లు, ఈత, కారు డ్రైవింగు, ప్రథమ చికిత్స, ఆత్మరక్షణ కొరకు కావలసిన ఇతర విధములైన ఉపాయములు నేర్పుతారట.

ముసలివాని సాహసం

అహమ్మదాబాదు ప్రాంతంలో నథూజీ అనే 80 సం॥ ముసలివానికిని, అతని ఇంటిప్రక్కనే వున్న వనాజీ అను వానికిని భూమి ఆక్రమణ విషయంలో తగాదా వచ్చింది. ఆ తగాదాలో కోర్టువారు వనాజీ పక్షాన తీర్పుచెప్పారు. అతను గెలుపొందాడనే కోపంతో నథూజీ, వనాజీని ఏలాగైనా చంపాలని 500 తోటాలు, 2 రివాల్వర్లు సంపాదించి, కిటికీలోనుంచి గురిచూచి ప్రక్కయింటి వనాజీని కాల్చి చంపివేశాడు. ఈ సంగతి పోలీసు వారికి తెలిసి నథూజీ ఇంటిని ముట్టడించారు. నథూజీని లొంగి పొమ్మని చెప్పారు. లాభం లేకపోయింది. నథూజీ ఇంటిలో నుండి పోలీసులపై తుపాకి పేల్చటం ప్రారంభించాడు. ఒక పోలీసు మరణించాడు. ఇంకొకనికి తీవ్రమైన గాయం తగిలింది. ఈ విధంగా 5 గంటలసేపు హోరాహోరీ తుపాకులు పేలుస్తూ పోరాడారు. ఇక లాభంలేదని మేజస్ట్రేటు ఇంటికి నిప్పు పెట్టించాడు. నథూజీతోసహా ఇల్లు భస్మమైపోయింది.

మద్యనిషేధం

బొంబాయి

బొంబాయి నగరంలో: పరిశీలన చేయడానికిగాను 3 వ సారి మద్యపానం 48 గంటల కాలం నిషేధించారు. దుకాణాలన్నీ మూయించివేశారు. ఈ ఎక్స్పెరిమెంటు పూర్తి అయ్యేలోగా దొంగతనంగా కల్లు తెచ్చిన వారిని 35 మందిని అరెస్టు చేయవలసి వచ్చింది.

మద్రాసు

మొన్న 15 వ తేదీని జరిగిన మద్రాస్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంలో మద్రాసు నగరంలోని కల్లు దుకాణాలను 14, 15 తేదీలు రెండు రోజులూ మూయించవలసినదిగా కార్పొరేషన్‌వారు ప్రభుత్వాన్ని కోరగా ఆ ప్రకారం మూసివేయించారు.

మంత్రుల సంచారం

మద్రాసు మంత్రులైన మునిస్వామిపిళ్ళె, రామనాధన్, పార్లమెంటరీ కార్యదర్శి వరదాచారి మొదలగువారు, మద్యపాన నిషేధ ప్రచారాన్ని కడప జిల్లాలో ప్రారంభించారు. ఆ జిల్లా పూర్తి చేసుకొని చిత్తూరు జిల్లాలో ఇదివరకు మిగిలినది కూడ ప్రచారం చేస్తారట.

బళ్ళారిలో కరవు

మద్రాస్ రెవిన్యూ మంత్రిగారగు శ్రీ టంగుటూరి ప్రకాశంగారు బళ్ళారి జిల్లాలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్షామ నివారణ ఎట్లున్నదో పరిశీలించడానికి సంచారం చేస్తూన్నారు. ఈ క్షామ నివారణ కార్యక్రమాన్ని డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించ వలసినదిగా ప్రజలు వారిని కోరారు, ప్రయత్నిస్తామని మంత్రిగారు అభయమిచ్చారు.

తుంగభద్రకు ఆనకట్ట కట్టవలసిన స్థలమును కూడ (హాస్పేట) పరిశీలించారు.

ఆ జిల్లాలో కరవువలన బాధపడుచున్న వారి సంఖ్య గతవారం నాటికి 56,776.

బొంబాయిలో మోటారు ఫ్యాక్టరీ

మోటారుకారులో 2000 భాగాలున్నాయి. ఇది చేయడానికి చాలా యంత్రాలు కావాలి. కాని ప్రయత్నిస్తే మన దేశంలో చాల చౌకగా మోటారు కార్లను తయారు చేయవచ్చును. ఈ విషయం మొన్న పారిశ్రామిక మంత్రుల సమావేశంలో బైట పడింది. ఆ పరిశ్రమను స్థాపించడాన్ని గురించి ఆలోచించారు.

1937 లో మన దేశానికి 29,082 కార్లు దిగుమతి అయినాయి. వీటి ఖరీదు 8 కోట్లకు పైగా వుంటుంది. అంతడబ్బు పరదేశాలకు పోసివ్వడం ఎందుకని వారి పట్టుదల.

బొంబాయిలో మోటారు ఫ్యాక్టరీ నిర్మించాలని మూడేండ్ల నుండి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దానిని నిర్మించడానికి 2 ఏండ్లు పడుతుంది. మూడేండ్లు నిండే సరికి 12000 కార్లు తయారు చేసే శక్తి వస్తుందని అంచనా వేయబడింది. అయితే ఇప్పుడది ప్రారంభించడానికి 150 లక్షల పెట్టుబడి కావాలి. అది పోగు చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.

జిల్లాబోర్డు ఎన్నికలు

నవంబరు నెలలో మన రాష్ట్రంలో, పశ్చిమ గోదావరి, గుంటూరు, కర్నూలు, అనంతపూరు, కడప, చిత్తూరు జిల్లాలలో జిల్లా బోర్డు ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇప్పటి కప్పుడే కర్నూలు జిల్లాలో 52 కి 32 స్థానాలు, అనంతపూరులో 52 కి 37 న్ను, పశ్చిమ గోదావరిలో 43కి 13న్ను కాంగ్రెసు అభ్యర్థులు పోటీలేకుండా ఎన్నుకోబడ్డారు. "ఆజిల్లాలలో రాబోవు ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులకే ఓటు ఇవ్వండి, కాంగ్రెసు విజయమే ప్రజా విజయం." అని సుబాస్‌బోసు గారు సందేశం పంపారు.



రాబోవు కాంగ్రెసు

రాబోవు అఖిల భారత కాంగ్రెసు మహాసభ 1939 ఫిబ్రవరి నెలలో త్రిపురిలో (మహాకోసల) జరుపుటకు నగర నిర్మాణపు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. సేవా దళాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.

రైల్వేలైను చెడింది

వరదలవలన బెంగాల్ నాగపూరు రైల్వే లైను చికాకోల్, ఉర్లాం స్టేషనులమధ్య నాల్గు మైళ్ళ పొడవున చెడిపోయింది. రైళ్ళు ఆగి పోయినవి.

కొత్త వ్యాధి

మెనింగిటిస్ అనే కొత్త వ్యాధి ఒకటి మద్రాసులో బయలుదేరింది. అది ఒక రకమైన అంటువ్యాధి కూడాను. అకస్మాత్తుగా శిరో వేదన, జ్వరం, మెడలు బిగుసుకు పోవడం, సంధి కలగడం, మరణించడం అన్నీ [illegible] సేపట్లో జరిగిపోతాయట. [illegible] చాలమందికి వస్తోంది.

కొత్త భాష

జపానులో టోకియో లైబ్రరీలో పనిచేసే గోరో అకిమోకా అనే ఆయన కొత్త [illegible] నొకదానిని కనిపెట్టాడు. ఇందులో 50 [illegible] లుంటాయి. జపాను, కొరియా, మంగోలి[illegible] మంచూకో భాషలు మాట్లాడే వార[illegible] ఆ భాష సులభముగా అర్థమయ్యే [illegible] దిట. ఇది కనిపెట్టడానికి 10 సంవ[illegible] పట్టింది.

అడుగు పెట్టకూడదు

జాన్ స్ట్రాచీ అనే ఆంగ్ల కవి ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేయడానికి, ఆహ్వానంమీద అమెరికాకు ప్రయాణమయాడు. ఈయన అతివాది. వెళ్ళేటప్పుడు ఎవరూ ఆయనను అడ్డు పెట్టలేదు. ఓడ అమెరికాకు చేరగానే, దిగి క్రింద కాలు పెట్టడానికి వీలులేదని ప్రభుత్వం ఆజ్ఞాపించింది.

వీరెందుకు వచ్చారు?

లండనులో ఇండియా అండర్ సెక్రటరీగా పనిచేసే ఎ. జె. మూర్‌హెడ్‌గారు ఇండియా వచ్చారు. ఆయన ఇదివరకెన్నడూ మన [illegible] చూడలేదట. చూచిపోవడానికిదే మంచి [illegible] మని ఆయనకు తోచిందట. [illegible] అన్ని రాష్ట్రాలలోను సంచారం [illegible] కీయ నాయకులను [illegible] కాని వారు ఏ ప్రత్యేక [illegible] రాలేదని పత్రిక[illegible]

పాఠకులకు

రష్యా విప్లవ సంచికను నవంబరు 7 వ తారీఖునకు 100 పుటలతో ప్రకటించ దలచుకోబట్టి, ఈ నెల 26 వ తారీఖున నవశక్తి పత్రిక వెలువడదు.

చందాదారుల కందరకు నవంబరు సంచికను మేము ప్రత్యేక శ్రద్ధతీసుకొని పోస్టు చేస్తాము. కాపీలు వారికి రానిచో పోస్టలు అధికారుల మీద తగు చర్యతీసుకో వాలె గాని ఆఫీసు ఏ మాత్రము బాధ్యత వహింపజాలదు.

—మేనేజరు.

19—10—38 బుధవారం

జిల్లా బోర్డు ఎన్నికలు

ఆంధ్రరాష్ట్రములో ఆరు జిల్లాలలో జిల్లాబోర్డులకు ఎన్నికలు జరుగబోతూ ఉన్నాయి. అన్నిటిలోను కాంగ్రెసు పోటీ చేస్తూ ఉంది. కాంగ్రెసు అభ్యర్థులు చాల మంది పోటీ లేకనే ఎన్నుకోబడ్డారని నేటి వార్తలు. మిగిలిన కాంగ్రెసు అభ్యర్థు లకు అఖండ విజయము కలుగాలి. అట్టి విజయము సంపాదించడానికి దేశములోని ప్రతి వ్యక్తి—బ్రిటిష్ప్రభుత్వపు దాస్యమునుండి స్వాతంత్ర్యము కావాలనెడి ప్రతి వ్యక్తి—కృషి చేయాలి.

రాష్ట్ర కాంగ్రెసు వర్కింగు కమిటీ, ఈ ఆరు జిల్లాలు తిరిగి అభ్యర్థులను నిలబెట్టింది. కొన్ని జిల్లా సివిక్‌బోర్డు గావించిన అపకాశికలను కొంతవరకు సరి చేసింది. గుంటూరు జిల్లా కాంగ్రెసు సంఘము, జిల్లాబోర్డు ఎన్నికలలో పాల్గొన కూడదనే నిర్ణయానికి వచ్చింది. కాని ఆ నిర్ణయాన్ని నిరాకరిస్తూ, గుంటూరులో ఎన్నికల సన్నాహము చేయించింది రాష్ట్ర కాంగ్రెసు వర్కింగు కమిటీ. ఈ పను లన్నిటికీ సెబాస్‌అనక తప్పదు. కొన్నిస్థలాలలో ప్రజాభిప్రాయాన్ని, గ్రామ తాలూకా కాంగ్రెసు సంఘాల అభిప్రాయాలను గుర్తించకపోవడము కూడ తప్పే.

గుంటూరు జిల్లా కాంగ్రెసు యొక్క నిర్ణయము చాల ప్రమాదకరమైనది. ఇంతవరకు జిల్లాబోర్డులలో కాంగ్రెసువారు గావించిన పనిలో ప్రత్యేకత లేదు. అంతకు మునుపు ఉండినవారికన్న కాంగ్రెసువారు ఘనకార్యాలేమీ చేయలేదు. కేవ లము ఆఫీసు పనితో, **(Routine work)** కాలము గడిపారు. అనేక స్థలాలలో, కాంగ్రెసు ప్రతిష్టకు కూడ భంగము కలిగేటట్లు చేశారు. కాంగ్రెసులో కూడ, అనేక చీలికలు, గ్రూపులు, జిల్లాబోర్డు వ్యవహారముల పురస్కరించుకొని బయల్వెడలాయి. ఈ పరిస్థితులలో, ఈ నానాగొడవ పడడానికన్న దూరముగా ఉండడము మంచిదని గుంటూరు జిల్లా కాంగ్రెసు భావించి యుంటుంది. స్వలాభాపేక్షులు కొందరు కాం గ్రెసు బురఖాను తగిలించుకొని, జిల్లాబోర్డు పదవులకై ప్రాకులాటడముకూడ, వారి అభిప్రాయాన్ని మరింత బలపరచి ఉండవచ్చును.

ఈ లోపాలన్నీ ఉన్నాయి. అయితే దీనిని సవరణ గావించి స్థానిక సంస్థ లన్నిటిని, ప్రజోపకరములై, ప్రజల స్వపరిపాలనకు కేంద్రాలుగ ఉండునట్లు చేయ వలసిన బాధ్యత, అవసరత కాంగ్రెసు మీద ఉంది.

ఈ లోపాలకు కారణాలు ముఖ్యంగా రెండు. ఒకటి, ఈ స్థానిక సంస్థలకు నిజమైన అధికారాలేమీ లేకపోవడము. ఉన్న కొద్ది అధికారాలనుకూడ వినియో గించే సభ్యులనే ఎన్నుకొనే హక్కు ప్రజలలో చాల తక్కువమందికి మాత్రమే ఉంది. అంతేగాక ఒకపర్యాయము ఎన్నుకొన్న సభ్యుడు ఎంత అక్రమముగా ప్రవర్తించినా, ప్రజలకు ఎంత హాని కల్గించినా అతనిని తొలగించడానికి ఎన్నుకొన్నవారికి హక్కు లేదు. అందుచే సభ్యులు బాధ్యతారహితంగా ప్రవర్తించడానికి అవకాశ మేర్పడుతూ ఉంది. వారు సరిగా పనిచేయలేదనే కారణాన్ని అవకాశమును తీసుకొని బోర్డుల అధి కారాలను మరింత సంకుచితపర్చడానికి ప్రభుత్వము పూనుకుంటూ ఉంది. కాంగ్రెసు మంత్రులుకూడ ఇట్టి చర్యలవైపుకే మొగ్గడం చాల విచారకరము. విద్యావిధానాన్ని, జిల్లాబోర్డులనుండి ప్రభుత్వమే కైవశము చేసుకొనజూడడములోనూ, జిల్లాబోర్డులనే ఎత్తివేయజూడడములోనూ అర్థము లేదు. ఈరోజు స్థానిక సంస్థకులేని హక్కులను గవర్నమెంటు కలిగించాలి.


జిల్లాబోర్డులకు, మ్యునిసిపాలిటీలకు, పంచాయతీబోర్డులకు వానివాని ప్రాంత ములందు ఈక్రింది హక్కులన్నీ ఉండేటట్లు ప్రభుత్వము చట్టము చేయాలి. పన్నులు వసూలు చేయుట, నిర్బంధ ప్రాథమిక విద్య, సెకండరీ స్కూల్సును నడపడము, రాకపోకల సౌకర్యాలను నెలకొల్పడము, నీటి పారుదల వసతులను ఏర్పాటు చేయ డము, మంచినీటి సదుపాయము కల్గించడము, విద్యుచ్ఛక్తి, ట్రామ్వే, ఇంకను ఇతర ప్రజోపకరములగు పరిశ్రమలను నెలకొల్పే అధికారము మరెవరికీ లేకుండా చేయ డము. ఇంతేగాదు, పోలీసులుకూడ ఈ స్థానిక సంస్థలకు లోబడియే పని చేయాలి. ఒక పోలీసులే గాదు, గవర్నమెంటు డిపార్టుమెంటు లెన్ని ఒక గ్రామములో గాని, ఒక పట్టణములో గాని, ఒక జిల్లాలో గాని ఉంటాయో, అవి అన్నీ స్థానిక సంస్థల యాజమాన్యాన పని చేయవలసినదే. రెవిన్యూ ఉద్యోగస్థులు, పి. డబ్ల్యు ఉద్యో గస్థులు, ఇంజనీరులు, పోలీసులు, కడకు కలెక్టరులుకూడ, ఆ యా స్థానిక సంస్థల నిర్ణయాల ప్రకారమే నడిచేటట్లు చేయాలి.

ఈవిధంగా చేయడము, ప్రతి గ్రామాన, ప్రతి పట్టణాన, మన స్వాతంత్ర్య పోరాటానికి కావలసిన సన్నాహము చేసుకోవడమే. దీని వలన ఉద్యోగస్థులు, పై అధికారుల ఆజ్ఞలను పురస్కరించుకొని ప్రజాపోరాటాని కెదురీదజాలరు. ఇప్పటి నుండి స్థానిక సంస్థల ఆజ్ఞల ననుసరించి పనిచేయడానికి నేర్చుకుంటారు. ఆచర ణలో ప్రజా స్వపరిపాలనను నేడుకూడ సంపాదించడానికి, మార్గమిది ఒక్కటే.

జిల్లాబోర్డులను, స్థానిక సంస్థలను స్వాతంత్ర్య పోరాటానికి వినియోగపర్చక కాంగ్రెసు ప్రతిష్టకు కూడ నష్టము కలిగించేటట్లు, జిల్లాబోర్డులలోని కాంగ్రెసు సభ్యులు ఈవరకు వ్యవహరించడానికి అవకాశము కల్గించిన రెండవ కారణము; రాష్ట్ర కాంగ్రెసు కమిటీ జిల్లాబోర్డుల కెట్టి అధికారాలు, హక్కు లుండాలో తెలియ జేసి ఆందోళన చేయకపోవడము. అంతకన్న ముఖ్యమైనది ప్రస్తుతము చాల పరి మిత అధికారాలు గల బోర్డులలో, ప్రజోపకరములగు ఎట్టికార్యములను చేయుటకు వీలుండునో పరిశీలించి, అట్టి కార్యక్రమమును ప్రకటించకపోవడము.

ఒక నిర్దిష్టకార్యక్రమము లేకపోవడమువలన, బోర్డులలోని కాంగ్రెసుసభ్యులు ఎవరి కిష్టము వచ్చినట్లు వారు ప్రవర్తించడానికి అవకాశము కల్గింది. అంతే కాక, బోర్డులలో కాంగ్రెసు తరపున వెళ్ళినవారందరూ, ఈవరకు కాంగ్రెసులో ఉండి స్వాతంత్ర్య పోరాటములో, ధక్కా మొక్కీలు తిని ఆరితేరినవారు కారు. అనేకమంది నూతనముగ కాంగ్రెసులో చేరినవారు. వీరందరూ కాంగ్రెసులో ఏ ఉద్దేశముతో చేరినా వీరి నందరిని, స్వాతంత్ర్య పోరాటము అభివృద్ధి చెందేలాగున ఉపయోగించ డము కాంగ్రెసుకు తప్పనిసరియగుతూ ఉంది. అందుచే వీరందరికి తగిన పనులనివ్వ వలసి ఉంటుంది. కాంగ్రెసుకు ఈవరకు పనిచేయకపోయినను, కాంగ్రెసుకు వ్యతిరే కంగా పనిచేయక ఉండినట్లయిన, అట్టికొత్తవారిని కొంతమందిని జిల్లాబోర్డులకు నిలుప వచ్చును. కాని వీరు కాంగ్రెసుకు ద్రోహము చేయకుండడానికి, ఒక నిర్దిష్ట కార్య క్రమాన్ని జిల్లాబోర్డులకు కాంగ్రెసు కమిటీ సూచించవలసి యుంటుంది. ఆ కార్యక్ర మానికి వ్యతిరేకంగా, కాంగ్రెసు శిక్షణనుకూడ ఉల్లంఘించి ఎవడు పోసాహసించునో, అట్టివానిని తొలగించి ప్రజలు వెంటనే మరియొకనిని అతనిస్థానానికి ఎన్నుకోవాలి. కనీసం అట్టి హక్కు ప్రజలకుండేటట్లు, యుక్తవయస్సు వచ్చిన ప్రజ లందరికీ ఓటు హక్కు ఉండేటట్లు వెంటనే కాంగ్రెసుమంత్రివర్గము లోకల్‌బోర్డు ఆక్టును సవరించాలి.

రాష్ట్ర కాంగ్రెసు కమిటీ వెంటనే ఒక కార్యక్రమాన్ని ప్రకటిస్తుందనీ, దానికి వేరొకచో ప్రకటించబడిన గుంటూరుజిల్లా సోషలిస్టుపార్టీచే సూచించబడిన కార్యక్ర మము ఉపయోగించుననియు తలచెదము.



ఇటలీ—ఇంగ్లడు రాయబారాల రహస్యం

మధ్యయూరప్

హంగేరియాకు, జెకోస్లోవేకియాకు రాయ బారాలు సాగాయి. హంగేరియా, డాన్యూబ్ నది ఒడ్డున హంగేరియాజాతి (మాగీర్లు) ఉండే ప్రాంతాన్నేగాక, రుథేనియనులుండే ప్రాంతాన్నికూడా కోరింది. జెకోస్లోవేకియా నిరాకరించింది. రుథేనియనులుకూడ జెకోస్లో వేకియాతోనే కలసి, ఫెడరేషనులో స్వతంత్ర భాగంగా ఉండడానికి ఒప్పుకోబట్టి హంగే రియా ఆటలు సాగలేదు. జర్మనీ, ఇటలీలు సహాయము చేస్తాయేమో, అని సైన్యమును ప్రోగుచేసుకొని కత్తిని ఝళిపించింది. తిరిగి హంగేరియాతో జెకోస్లోవేకియా రాయబారాలు సాగిస్తుంది.

జర్మనీతో వర్తకపుటొడంబడిక చేసుకో డానికి, ఇకముందు స్నేహంగా ఉండడానికి జెకోస్లోవేకియా యొక్క విదేశాంగమంత్రి చవ ల్కోవస్కీ హిట్లరుతో కలసి మాట్లాడాడు. హిట్లరు హంగేరియాతో త్వరగా రాజీపడమ నిసలహా ఇచ్చాడు.

జెకోస్లోవేకియాను నాశనముగావించినందున ప్రజాభిప్రాయాన్ని కొంతమంచిచేసు కోడానికి జెకోస్లోవేకియాలోని పెట్టుబడిదారులు పూర్తిగా జర్మనీకి లోబడిపోకుండాను ఇంగ్లండు ఒక కోటి పౌనులు అప్పుయిచ్చింది. కాని ఆత్మ రక్షణకు ఎట్టిసరిహద్దులు లేని జెకోస్లోవేకి యాఇకముందు జర్మనీ చెప్పినట్లు ఆడక తప్పదు. జెకోస్లోవేకియాకు వెళ్ళిదాగుకొన్న సూడెటను జర్మను సోషలిస్టులను, ప్రజా తంత్రవాదులను జర్మనీకి పట్టి ఇవ్వాలని, జెకో స్లోవేకియాను హిట్లరు కోరాడు. ఇంకను జెకోస్లోవేకియా స్వతంత్రరాజ్యమనడం పిచ్చి వాని ప్రేలాపనలుగాక మరేమీకావు.

జర్మనీ, జెకోస్లోవేకియాను ఆక్రమించు కొనిన వెంటనే, టర్కీతో, బల్గేరియాలతో వర్తకపు టొడంబడికలు చేసుకరమ్మని హెర్ ఫంకును పంపించింది. కొంతవరకు జయము పొందాడు. ఈవరకే జర్మనీ పెర్షియాలో స్థానము సంపాదించుకోడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటవనీ, పెర్షియా నుండి, సోవియటు పెట్రోలు పరిశ్రమకు కేంద్రమైన బకు పట్ట ణముపై దాడి వెడలడానికి వీలవుతుందనీ నవశక్తి పత్రికా పాఠకులకు తెలియజేశాము. టర్కీ సోవియటు యూనియనుతో స్నేహ ముగ ఉన్నంతకాలము, రష్యా దక్షిణ భాగము పైగాని, ఈ బకు ప్రాంతముపై గాని పూర్తిగా యుద్ధము సాగించడానికి అవకాశము లేదు. టర్కీ జర్మనీతో కలిస్తే, ఇటలీ డార్డెనల్సు జలసంధి ద్వారా, ఇటలీ నావికాదళము వెళ్ళి రష్యాలోని ఒడెస్సా మీదను, బకు రాష్ట్రము పైనను యుద్ధము సాగించడానికి వీలవుతుంది. డార్డెనల్సు జలసంధిని అడ్డగించినచో నల్ల సముద్రములోని సోవియట్ నౌకాదళమును ఎందుకూ పనికిరానట్లు చేయవచ్చు.

జర్మనీ రష్యాపై యుద్ధ సన్నాహాలు యీ విధంగా సాగిస్తూ ఉంది. ఫ్రాన్సు దేశములో [illegible]తర్యుద్ధము తీసుక రావడానికి ప్రయత్నిస్తూ [illegible]. అలేసులో రేయిను ప్రాంతాలలోని కోటీ [illegible] జర్మనీతో కలసి సఖ్యత పడవలసినదని ఫ్రెంచి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూవున్నారు. బ్రిటను జర్మనీతో కలసి రష్యాపై యుద్ధము చేయడానికి, జర్మనీ నుండి గత యుద్ధ ఫలి తముగా తీసుకొనిన కాలనీలను గాకపోయి ననూ, ఆఫ్రికాలో మరికొన్ని ప్రాంతాలను జర్మనీకి ఇవ్వడానికి ఛాంబర్లేను అంగీకరించి నట్లు వదంతులు బయలుదేరాయి. హిట్లరు కాలనీలు కావాలనీ తిరిగి మరియొక పర్యాయం ఉపన్యసించాడు. అంతేగాక ఛాంబర్లేనే ప్రధా నిగా ఉండాలనీ, ఈడెను, చర్చిహిల్ ప్రధాను లయితే బ్రిటనుతో సఖ్యము పోయి యుద్ధము కూడవస్తుందని బెదరించాడు. బ్రిటనులో పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టాలని కూడ కోరాడు.

స్పెయిను

ఈ పరిస్థితులలో స్పెయిను స్వాతంత్ర్య పోరాటము చాల ప్రాముఖ్యత వహిస్తుంది. స్పెయినులో ఫాసిస్టుల, హిట్లరు ముసోలినీల ఆటలను సాగకపోతే, వారి యుద్ధ ప్రయత్నా లకు తీరని నష్టం కలుగుతుంది. ప్రపంచ ప్రజా భిప్రాయాన్ని స్పెయిను ప్రభుత్వము తనకు మరింత అనుకూలము చేసుకోడానికి, ఇంటర్నే షనల్ బ్రిగేడును రద్దుపరచి, ఆ వాలంటీర్ల నందరిని వారి వారి దేశాలకు పంపించివేసింది. దీనితో స్పెయిను ప్రజలకు ఫ్రాంకో విదేశీ యుల సైన్య సహాయముతోనే యుద్ధము చేస్తు న్నాడనే విషయము మరింత స్పష్టంగా తెలు స్తోంది. వారు ఫ్రాంకోను దేశ ద్రోహిగా తలవ డానికి సులభసాధ్య మవుతుంది.

జర్మనీ ఇటలీలు స్పెయినును వదల దలచు కోలేదు. జర్మనీ బిల్బోవా పట్టణములోనూ, ఫ్రెంచి సరిహద్దులైన పెరినీస్ పర్వత ప్రాంత మునకు మకాముచేసి సైనిక శిబిరాలను నెల కొల్పుతూ ఉంది. బిల్బోవా రాష్ట్రములోని ఇనుము, రాగి గనుల నుండి తనకు కావలసిన లోహమును తీసుకొని పోతూ ఉంది. ఆఫ్రికా ఖండము పడమటి తీరాన ఉన్న కానరీ ద్వీపా లను పోర్నాండుపో ద్వీపాలను జర్మనీ ఆక్ర మించుకొని కదలనంటూ ఉంది. ఈ ద్వీపా లలో గొప్ప నౌకాశ్రయాలను ఏర్పరుస్తూ ఉంది. ఈ ద్వీపాలు జర్మనీ చేతులలో ఉండ డము వల్ల బ్రిటను యొక్క అట్లాంటిక్ నౌకా మార్గాలకు కూడ ప్రమాదము. అయితే మాత్ర మేమి బ్రిటిషు ప్రభుత్వము, సోవియటు పగతో కండ్లు మూసుకొని హిట్లరు ముసోలినీలతో సంధికి పరుగెత్తుతూ ఉంది.

స్పెయిను ప్రభుత్వ సైనికులలో సదభిప్రా యము కలిగించాలనీ ప్రభుత్వమువైపు దెబ్బ లాడక ఫ్రాంకోవైపుకు రప్పించాలనీ, ఇటలీ దేశపు విమానాలు రొట్టెలను, సిగరెట్టులను విసరాయి అని గతవారము చూచాము. ఆ ప్ర యత్నాలేమీ నెరవేరలేదు. ఈబ్రోనదీ తీరాన ప్రభుత్వము ఆక్రమించిన ప్రాంతాన్ని గత నాల్గు మాసాలుగ ఫ్రాంకో సైన్యము యుద్ధము చేస్తు న్నప్పటికీ ఆక్రమించలేక పోయింది. మాడ్రి డ్‌పై రెండు గంటలు బాంబుల వర్షము కురిపిం చించారు, కాని, చనిపోయినవారు కేవలము 4-గురు మాత్రమే. ఇటలీ, జర్మనీ, విమానా లకు ఎక్కువగా బ్రిటిషు స్టీమర్లే గురియవుతూ వున్నవి. ఆహారాన్ని రానివ్వకుండాచేసి, స్పె యిను ప్రభుత్వాన్ని లొంగదీయాలనే ప్రయ త్నాలే విపరీతంగా సాగిస్తున్నారు.

ఇటలీ, ఇంగ్లండుతో రాయబారాలు మొదలు పెట్టింది. తనకు బాలరిక్ ద్వీపాలు వదలి వెయ్యాలనీ, మధ్యధరాసముద్రములో, ఇంగ్లీషు వారిమార్గాలకు నష్టము కలిగించమనీ ఈ రాయ బారాల సారాంశము. ఆంగ్లో ఇటాలియన్ ఒడంబడికను ఆచరణలో పెట్టడానికి ఒప్పుకోమని ఇటలీ, ఇంగ్లండును ఒత్తిడిచేస్తూవుంది. దీని వలన స్పెయినులో ఇరుపక్షాలవారు సమాన ప్రతిపత్తి కలవారగుదురు. అంటే ఫ్రాంకో, ఇటలీ నౌకల సాయమున మహాసముద్రముననే ఇప్పటివలె తీరానికి మూడు మైళ్ళలో గాక, సముద్రమార్గాలలో ఎచ్చటనైనాసరే, స్పెయిను ప్రభుత్వానికి ఆహారము తీసుకొనివచ్చే పడవ లను ముంచివేయవచ్చును. ముంచివేస్తున్నా, బ్రిటిషుప్రభుత్వము ఆపడవల సాయానికి వెళ్ళ నవసరములేదు. ఇప్పుడైతే తీరానికి మూడు మైళ్ళ దూరములో, అంటే స్పెయినుకు పూర్తి అధికారము గల సముద్రతీరములో తప్ప మిగి లిన స్థలాలలో తమదేశపు నౌకలను బ్రిటిషు ప్రభుత్వం రక్షించాలని వుంటుంది. మూడు మైళ్ల స్పెయిను ప్రభుత్వం తనకు సామగ్రిని తెచ్చు నౌకలకు ఎట్టినష్టము కలుగకుండా తీరమందలి మరఫిరంగులచే రక్షించుకో గలదు. అందుకే ఇటలీ, బ్రిటిషు ప్రభుత్వమును ఆంగ్లో ఇటాలి యను ఒడింబడికను ఆచరణలోపెట్టమని ఒత్తిడి చేస్తుంది.

ఇటలీకి అబిసీనియాను లొంగదీయడానికి కావలసిన ఆహారపదార్థము, లారీలు, మొద లగు సామగ్రినంతను కెన్యాగుండాను, ఆఫ్రి కాలోని సూడానుగుండాను పోనివ్వడానికి బ్రిటీ షుప్రభుత్వము ఇనుమతి ఇచ్చింది. ఇంగ్లో ఇటాలియను ఒడంబడికతో పాటు, ఇటలీకి రుణముగూడ ఇవ్వడానికి బ్రిటను పూనుకుం టూఉంది. ఈవిధంగా ఫాసిస్టు దేశాల ఆర్థిక చిక్కులనుకూడ బ్రిటను తీర్చి వానికి సాయం చేస్తూఉంది.

పాలెస్టయిను

చిన్న చిన్న అల్లరులుగా పత్రికలలో ప్రక టించబడుతూవచ్చిన అరబ్బుల స్వాతంత్ర్య పోరాటము గతమాసపు దినాలలో ఒకచిన్న యుద్ధంగామారింది. బ్రిటీషుప్రభుత్వము సైనిక దళాలను ఒకదానివెనుక ఒకటిని పంపుతూ ఉంది. గత 15 దినాలలోనే 400 మందిదాకా ఈయుద్ధంలో చనిపోయారని వార్తలు వస్తూ ఉన్నాయి. బ్రిటీషువర్తకుల పరిశ్రమలను తగులబెట్టుతున్నారు. బ్రిటీషుసైన్యముపై మాటి మాటికి ఒత్తిడి తెస్తున్నారు. జెరుసలేమును పూర్తిగా బ్రిటీషుసైన్యము ఒకకోటగా మార్చి వేసింది.

ఈజిప్టుదేశంలోని కెయిరో పట్టణములో ముస్లిము ఇంటరుపార్లమెంటరీ కాంగ్రెసు ఏక గ్రీవంగా ఒకతీర్మానాన్ని ప్యాసుచేసింది. పాలె స్టయిను యూదులకు మాతృభూమిగా చేయా లన్న బాల్ఫరు ప్రధాని ప్రకటన రద్దు అయి నట్లుగా భావించాలి. పాలెస్టయినును విభజించ కూడదు. బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెల కొల్పాలి. ఇంగ్లీషువారు అరబ్బులతో ఒడం బడిక చేసుకోవాలి. రాజకీయ ఖైదీలనందరిని విడుదల చేయాలి. వీనిని చేయకపోతే అర బ్బులందరూ, యేదేశములో ఉండినా, బ్రిటీషు వారిని, యూదులను జన్మశత్రువులుగా భావి స్తామని ప్రకటించింది. వీనికి అంగీకరిస్తే, ఈవరకే పాలెస్టయినుకు వచ్చియున్నయూదు లకు అరబ్బులవలె పూర్తి హక్కులివ్వబడు నని కూడ ప్రకటించబడింది. కాని అందకాలో గుసగుసలాడివచ్చిన పాలెస్టయినులోని బ్రిటీషు హైకమీషనరు మార్షలుల ప్రకటించి పాలె స్టయినులో సైనిక శాసనాన్ని నెలకొల్పు తున్నాడు.

జవహరిలాల్‌నెహ్రూ అరబ్బుల పోరాటా న్నిబలపరుస్తూ ఒక స్టేటుమెంటు ప్రకటించాడు మధ్యయూరప్‌లో యూదులకెన్నో బాధలు కలు గుతున్నందులకు సానుభూతి తెల్పుతూ, యూదులు ఇప్పటివలె బ్రిటీషు ప్రభుత్వపు చేత కీలుబొమ్మలై అరబ్బుల స్వాతంత్ర్య పోరాటా న్నెదుర్కొంటే కేవలము ఒక్క ముస్లిముల యొక్కయేగాక, ఆసియాఖండమందలి ప్రజ లందరి సానుభూతి గోల్పోయి శత్రుత్వాన్ని పొందుతారని హెచ్చరించాడు.

చైనా

ఉత్తర చైనాను ఆక్రమించుకొని రష్యాపై యుద్ధానికి కావలసిన పునాదిని ఏర్పాటుచేసు కోడానికి దాడివెడలిన జపాను, చైనాప్రజల పట్టుదలవలన షాంఘై, నాంకింగు పట్టణాలను ఆక్రమించి, హాంకోనగరాన్ని పట్టుకోడానికి మొదలుపెట్టింది. హాంకోనగరాన్ని సమీపిం చాలనీ గత ఆరుమాసాలుగ ప్రయత్నించినా ఇంకను 100 మైళ్ళదూరంలో ఉంది. గత వారము జరిగిన ఒక యుద్ధంలో, 20,000 మంది జపాను సైనికులను చీనావారు హత మార్చారు. హాంకోను సమీపించలేక పోబట్టి చైనా సైన్యాన్ని నాశనం గావించడానికి విషవా యువులనుగూడ జపాను అప్పుడే [illegible] సూలు ప్రయోగించింది. అయినా [illegible] లేకపోయింది.

హాంకోను పట్టుకోడానికి, ఉత్తర చైనాలో పెకింగునుండి పెకింగు-హాంకో రైలు మార్గ మున ఒక జపాను సైన్యము, వచ్చింది. [illegible] యొకటి యాంగిట్సీయాంగు నదిగుండా షాంఘై, నాంకింగు నగరాల నుండి [illegible] ఇవి రెండూ హాంకోకు 100 మైళ్ళ దూరములో యుద్ధము చేస్తూ ఆగిపోవలసి వచ్చింది.

ఈ పరిస్థితులలో హాంకోను వశపర్చు డానికి, వశపర్చుకొన్ననూ, తన అధికారానికి లోబడిన ప్రాంతాన్ని సుస్థిరము చేసుకో [illegible] తూర్పు చైనా నంతను వశపర్చుకోనిదే [illegible] లేదని జపాను గ్రహించింది. అందుకని దక్షిణమున నున్న కాంటను నగరాన్ని పట్టు కొని, కాంటను-హాంకో రైలుమార్గము ద్వారా హాంకో పట్టణముపై మూడవ సైన్యమును కూడ నడుపదలచు కొన్నది. కాని బ్రిటిషువారి పరిశ్రమలకు, లాభాలు దక్షిణాన్న ఎక్కువగా నుండుటచే, బ్రిటిషు ప్రభుత్వంతో ఎక్కడ కల హము వస్తుందో అని ఇంతవరకు భయపడి ఊరకుండినది. కాని మ్యూనిక్ ఒడంబడికతో బ్రిటిషు ప్రభుత్వపు దృక్పథము స్పష్టమయి నందున, దాని లాభాల జోలికి పోమని వాగ్దా నము చేస్తూ, కాంటనుపై దాడి సాగించింది. రహస్యంగా సైన్యాన్ని దింపింది. దారిలో వెయిచో అనే పట్టణంపై బాంబుల గురిపించి, 1000 మందికి పైగా హతమార్చింది. అప్పుడు హాంకాంగు (బ్రిటిషు సైనికాశ్రయము)-కాం టను రైలు మార్గాన్ని ఆక్రమించుకొని కాం టను వైపు అతిశీఘ్రగతిని సమీపిస్తుంది. కాని కాంటను దాని నెదుర్కోడానికి సర్వ సన్నా హాలు చేస్తూ ఉంది. ఈ వరకు ఎప్పుడు ఓడి పోని చైనా సేనాని, 1025-27 చైనా స్వాతం త్ర్య పోరాటంలో ప్రఖ్యాతిగాంచిన సేనాని స్వయముగా కాంటను రక్షణ కోసం తగు ఏర్పాటులు చేస్తున్నాడు. ఒకవేళ కాంటను పడిపోయినా, తదుపరి హాంకో పడిపోయినా జపాను చైనాను పూర్తిగా ఆక్రమించు [illegible] ఇంకా చాల కాలము [illegible] ప్రపంచములో ఎన్నో [illegible]

ఇది విపరీతంగా తోచవచ్చు, కాని నిజం!

గాంధి తత్వం అభివృద్ధి దాయక స్వభావాన్ని వదలి పోతోంది!

[డాక్టర్. అధికారి]

వ్యాసకర్త



మింట్ కమ్యూనిస్టు కుట్ర కేసు ఖైదీలు

నిరంకుశ పర పరిపాలనకు వ్యతిరేకంగా భారతీయుల ఐక్యతా తిరుగుబాటులు, మూర్తీభవించెనో యను నట్లుప్పచున్న మహాత్ముని 70 వ జన్మ దినోత్సవాలు దేశమందంతటా జరిగినవి. ఇందు కాంగ్రెసు వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, భిన్నాభిప్రాయా లున్నను అందరూ పాల్గొని విజయవంతంగా జరిపిరి.

ఈనాడు జరిగినది 70 వ జన్మదినోత్సవము కానే కాదు. ఇది రాజకీయంగా మహాత్ముని 20 వ జన్మ దినోత్సవము మాత్రమే. 20 సంవత్సరముల క్రిందట 1919 లో మహాత్ముడు అఖిల భారత స్వాతంత్ర్య ఆందోళనలో నాయకత్వము వహించిన రోజు ప్రారంభమైనది. మునుపెప్పుడో ఆఫ్రికాలోను చంపారన్‌లో జయప్రదంగా ప్రయోగించిన సత్యాగ్రహ ఆయుధాన్ని, 20 సంవత్సరాల క్రితం, రాజకీయ పోరాటంలో అఖిల భారత ఆయుధంగా ప్రయోగించడానికి నిశ్చయించుకున్నాడు మహాత్ముడు.

ప్రజా ప్రతిఘటనకు నాయకుడు

"రౌలట్ చట్టాలు" అని పేరు గన్న నిరంకుశ నిర్బంధశాసనాలను శాంతియుతంగానైనా ప్రతిఘటించ వలసినదన్న ఆ పిలుపు, వాక్కు, వ్యక్తి సమావేశ స్వాతంత్ర్యాలకై పోరాడవలసిన దన్న ఆపిలుపు భారత జాతీయ పోరాటపు చరిత్రలో క్రొత్త మార్పును తీసుకొని వచ్చింది.

ప్రపంచమం దంతటా పీడిత ప్రజా సామాన్యము తిరుగుబాటు చేస్తూన్నది. ఈ రోజులలో ఉత్కృష్ట ఘటనమైన రష్యన్ విప్లవంవల్ల ఉద్దీపితులై, ఆసియా ఖండమందలి పీడిత ప్రజలందరూ నిరంకుశ పాలకులపై తిరుగబడ జొచ్చిరి. ఈ పరిస్థితులలో మహాత్ముని పిలుపు మారుమ్రోగింది. ఈ శంఖారావము భారత దేశంలో సమిష్టి ప్రజాప్రతిఘటనాయుగాన్ని ప్రారంభింప జేసినది. మితవాదులంతవరకూ అవలంబిస్తూన్న వాదోపవాద సాంప్రదాయాలన్నీ వదలిపోతూన్నవి. భారత జాతీయ కాంగ్రెసు దీనితో ప్రజాభిముఖమైనది. సామ్రాజ్య పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటనా విధానాన్ని అవలంబించినది. మహాత్ముని రాకతో భారతజాతీయ కాంగ్రెసు నూతనశకమం దడుగు బెట్టినది. విదేశీయ నిరంకుశ పాలకులకు వ్యతిరేంగా జాతీయ ఐక్యతను కొనసాగించే సంస్థగా అభివృద్ధి కావడం ప్రారంభించినది.

జాతీయ పోరాటంలో భారత జాతి నంతటినీ ఏకం చేయడానికి శక్తులన్నిటిని మహాత్ముడు ప్రారంభంలో చలనంలో పెట్టిన మాట నిజమే. కాని గాంధి తత్వం మాత్రం మొదటినుండియు వీటి గమనాన్ని అభివృద్ధిని నిరోధిస్తూనే వచ్చినది. ఇది విపరీతంగా కనుపించవచ్చును. కాని ఇది సత్యము.

విరుద్ధమైన రెండు స్వభావాలు

భారత జాతీయ పోరాటములో ఒక దశకు మహాత్ముడు ప్రతినిధి. ఆ దశ ఆఖరయే రోజులు దగ్గరకు వచ్చినవి. ఈ దశలోని అభివృద్ధి, మందగింపు—ఈ రెండు స్వభావాలకు కూడా మహాత్ముడు ప్రతినిధియే. "కాంగ్రెసు పతాకం క్రింద భారత జాతి యంతయు నేకమై పైశాచిక ప్రభుత్వాన్ని ప్రతిఘటించవలసినది!" అని నిర్భయంగా శంఖారావమును పూరించినప్పుడు ప్రజలలో పాతుకొని యున్న సామ్రాజ్య వ్యతిరేక స్వభావం, ప్రజాతంత్ర పిపాస ఆయనలో మూర్తీభవించినవి. ప్రజల కళ్లను కప్పి పుచ్చే మతములోని, "సత్యాహింస"లనే నినాదాలు, అనాదికాలపు ఆర్థిక విధానానికిని, దానిని ప్రతిబింబించే చర్ఖాలకు మరలవలసినదన్న ప్రబోధము, ప్రజా సామాన్యము యొక్క మాంద్యాన్ని—స్వాతంత్ర్యాన్ని కోరుచున్నను అందుకై వలయు పోరాటమందలి ప్రజాస్వామిక తత్వాన్ని నిరాకరించే పైవర్గాల భీరుత్వాన్ని మూర్తీభవించుచున్నవి.

ఈ రెండు స్వభావాలూ కలసి గాంధీ తత్వంగా పరిణమించినవి. పోరాటము విశాలమై, తేజోవంతమగుచున్నకొలదీ, గాంధీ తత్వమునందలి అభివృదికారక స్వభావం వెను వెనుకకు పోయి, అందలి అభివృద్ధి నిరోధక స్వభావం, ముసు ముందుకు వస్తూఉంటుంది.

అభివృద్ధికరమయిన దశ

1920 ఆ రోజులలో గాంధీ తత్వం మొత్తం మీద అభివృద్ధికరమగు శక్తిగానే పనిచేసినది. ఆనాటి కింకను భారత దేశములో సమిష్టి ప్రజా ప్రతిఘటన పేరు వినిపించి యుండలేదు. ఆనాడు అహింస, సత్యాగ్రహం, అనే నినాదాలు సామ్రాజ్యవాదుల హింసకు ప్రతిఘటన అయాయి. భారత దేశము దేశమే కాదనియు, ఐక్యత శూన్యమనియు, తనను తాను పరిపాలించుకొననే లేదనియు, సామ్రాజ్యవాదులు చెప్పే అసత్యాలకు విరుద్ధంగా "సత్యం" అనే నినాదం మారుమ్రోగినది. ప్రజలలోనికి పోయి వారిని కట్టుబాటుచేసి రాజకీయ రంగములోనికి నడిపించుకు వచ్చే సైనికులను తయారు వేయుటకు వారికి వలయు శిక్షణనిచ్చుటకు ఆనాటి బ్రహ్మచర్యము, స్వార్థత్యాగము, నిరాడంబరత్వములు ఉపకరించినవి. ఖద్దరు, చర్ఖాలు, జాతీయత, స్వశక్తిపై ఆధారపడుట, అను ధర్మములకు చిహ్నము లయినవి. ఆనాడు అప్పుడప్పుడే అధిక సంఖ్యలుగా రాజకీయ పోరాటములోనికి వచ్చుచున్న మధ్య తరగతి జనాభా యొక్క ప్రజాతంత్ర అభిప్రాయాల ప్రారంభ దశను. ఇవి ప్రారంభించినవి.

అంధకారము

గాంధి తత్వముతో రాజకీయ బీజములెంత ప్రధానమయినవో మత సంబంధ మయిన అంధకార బీజాలు కూడ అంతగాను ప్రధానమయినవి. ఈ రెంటిని విడదీయడం దుర్లభం. ఈ రెండూ కలసియే ఒక రాజనీతిగా తయారవుతవి. సంస్కరణ తత్వపు, పోరాటము, రాజీ, అను రాజనీతి. ఇది ప్రారంభ దశలో పోరాటములో అగ్రస్థానాన్ని వహించినది. అందుచేఅది అభివృద్ధికి దారి తీసినది. కాని ఏనాడయితే ప్రజలలో రాజకీయ చైతన్యం, నిర్మాణం, వృద్ధిపొంది ఒక ప్రజాశక్తిగా తయారయినాయో ఆనాడు రాజీ స్వభావం, పైచేయి యయినది. ఈవిధముగా గాంధీ తత్వము, భారతీయ ప్రత్యేక ప్రయోజనాల, (అనగా ధనిక వర్గం) యొక్క రాజనీతికి ప్రతిబింబ మయినది. ఈ ధనిక వర్గానికి స్వాతంత్ర్యం కావలెను. కార్మిక, కర్షకులు మాత్రము సంఘీభూతము అగుటకు వారిష్టపడరు. ప్రజాసామాన్యపు న్యాయమగు ఆర్థిక హక్కులను వారు ప్రతిఘటింతురు. ప్రజా పోరాటము సందర్భములో రాజీకి దిగే ఇట్టి ధనికవర్గములకు యీనాడు గాంధీ తత్వము అండగా వినియోగ పడుచున్నది. గాంధీ తత్వములోకి యీ భాగము జాతీయ విద్రోహులలో పేరు గన్నది. సామ్రాజ్యవాదులు, సంస్థానాధీశులు దీనిని ప్రయోగిస్తున్నారు.

గత 20 సంవత్సరాలలోను మనఉద్యమం వ్యాపించినది పెద్దదైనది. క్రొత్త శక్తి ఇంకొకటి తయారయినది. కార్మిక, కర్షకుల వర్గ సంఘాలు, అమలులోనికి వచ్చినవి. మహాత్ముని పిలుపుకు మేల్కొని ప్రజలు వర్గ విజ్ఞానాన్ని సంపాదించుకొనిరి. వర్గ సంఘాలు ఏర్పాటు చేసుకొనిరి. ఈ అభివృద్ధి అనివార్యమయినది. గాంధీ తత్వము తనకర్తవ్యము నిర్వర్తించుకొనినదని గత రెండు పోరాటములు స్పష్టముగా తెలిపినవి. ఇకముందిది యేమాత్రము సరిపోదు. [illegible] అనుభవాల ఫలితంగా ప్రజలు క్రొత్త పోరాటవిధానాలకు దిగుచున్నారు.

మొదటి పరాయనం.

1920-22 పోరాటాలలో మహాత్మునకు ప్రథమ విజయం కలిగినది. అప్పుడే మొదటి ఓటమికూడ కలిగినది. సామ్యమయిన శాంతియుత పోరాటమే యయినను భారతదేశమునను ఆసేతు హిమాచల పర్యంతము సాగే ప్రజా విప్లవము యొక్క నాయకుడయినాడు మహాత్ముడు, పోరాటములో క్రొత్త విధానమును కనుగొనిన మహత్తర శక్తయినాడు. యీనూతన విధానపు హద్దులలో ఈ విధానము వలన రేకెత్తి ప్రజా శక్తులు నిలువలేక పోయినవి. ఈ హద్దులను మీరి ప్రజలు "మహాత్మా గాంధీకీజై" అనే సింహనాదాల తోడనే పోలీసు స్టేషనులపై దండెత్తిరి. తరతరాలనుండి వారిని పీడిస్తూవున్న రక్కసుల భవనాలకు నిప్పు పెట్టిరి. చౌరీ చౌరా అనంతరం వేసిన వెనుకడుగు గాంధీ తత్వము యొక్క మొట్ట మొదటి ఓటమి. స్వత స్సిద్ధమైన ప్రజా విప్లవము నెత్తిపైనీ ఓటమి రుద్దబడినది. ఇది కట్టకడపటి ఓటమికాదు. ఈ ఓటమినుండి గుణపాఠాన్ని నేర్చుకో గలిగినంతటి చైతన్యాన్ని ప్రజలు సంపాదించుకొని యుండ లేదు.

రెండవపరాజయము.

1930 లో తిరిగి మహాత్ముడు స్వాతంత్ర్యశంఖారావాన్ని పూరించేసరికి క్రొత్త ఘటనలు మరిరెండు ఆవిర్భవించినవి-యీమధ్య కలిగిన గడువులో మహాత్ముడు రాజకీయ నాయకులను తయారు చేసెను. వీరు ముతక ఖద్దరు ధరించి ప్రజల మధ్యకు పోయిరి. వీరు తమను పీడించే పిశాచాల బారినుండి తమను ఉద్ధరించుటకు వచ్చిన మహానుభావులని ప్రజలు భావించిరి, గౌరవించిరి, యీ నాయకులే కాంగ్రెసు మహాసభను కూడ కట్టుబాటు చేస్తూవుండేవారు. దేశమందంతటను కాంగ్రెసు కమిటీలు వ్యాపింప జొచ్చినవి. దీనితోటి పాటే ప్రజా ఉద్యమ మింకొకటి వృద్ధి బొందసాగినది. దీని రాజకీయ కార్యక్రమము, పోరాట విధానము కూడ క్రొత్తవి. యిది పారిశ్రామిక కార్మిక, కర్షకోద్యమము. 1930 వ సంవత్సరమునందు సాగిన పోరాటములో గాంధి తత్వము యొక్క పాత్రను యీ రెండు క్రొత్త ఘటనలు నిర్ణయించినవి. స్వతసిద్ధంగా వృదిపొందుతూ వచ్చిన ప్రజా పోరాటాన్ని కట్టుబాటు చేసి నూతన దశలోకి దీనిని వృద్ధి పొందించుటకు సాధనమునకు బదులు గాంధీ తత్వము ప్రజా పోరాటమును అపుచేసి అరికట్టుట కెక్కువ సహాయపడే సాధన మయినది. గాంధీ తత్వము యొక్క పరిమితి హద్దులను మీరి మరియొక పర్యాయము ప్రజా పోరాటము అక్కడక్కడ మామూలు నాటుపద్ధతి మీదనే సాగినది. కాని మొత్తం మీద దేశమంతటను మూలమూలలకు అల్లుకొని ఒక కేంద్రీ కృత నాయకత్వము కలిగి, భారత జాతియొక్క ఐక్య పోరాటములో బ్రహ్మాండమయిన అభివృద్ధిని ప్రతిబింబించిన కేంద్ర నాయక సంస్థయగు కాంగ్రెసే ప్రజా పోరాటమును అరికట్టుట కుపయోగింప బడినది. అప్పుడు కారాగారములో మ్రగ్గుచున్న రాజకీయవాదుల మనస్సులు దీనికి చివుక్కుమనినవి.

దీనినుండి నీతి

1930—32 సంవత్సరములలో గాంధి తత్వము ఒక వంక ప్రజా ఉద్యమమునకు బ్రేకు వేసినది. ఇంకొక వంక భారత జాతి కంతకు నాయకత్వము వహించేటట్లు కాంగ్రెసును పెంపొందించినది. రెండవ ఉద్యమములో కలిగిన నిస్పృహ ప్రజలను అతివాదమై ఖరికిదింపేటందుకు మూలమైనది. మొదటి దశలో గాంధి తత్వము గావించిన మేలును గాంధితత్వము నుండియే రక్షించవలసిన స్థితి సంప్రాప్తమైనది. గాంధీ మహాత్ముని పిలుపునకు కదలి వచ్చిన ప్రజా శక్తులు తమ ఉత్కృష్ట ఆశయమయిన సామ్రాజ్యవాద నిర్మూలనకు సాగిపోవలసి యున్నది. ఇందుకు గాంధీ తత్వాన్నే పూర్తిగా వ్యతిరేకించవలసిన స్థితి సంప్రాప్తమైనది.

అంతిమావస్థ

కాంగ్రెసు మంత్రుల హయాము సాగుచున్న యీ రోజులలో గాంధీ తత్వము అంతిమ చరమావస్థలో ప్రవేశించినది. విప్లవము రాకుండా చేయుటకే గాదు. కనీసము సంస్కరణ తత్వము కలిగినదైనను ప్రజా పోరాటమునే రాకుండా అపుచేయుటకు సాధనముగా గాంధీ తత్వము తయారయినది. కత్తీ లేని శాసన సభాందోళకులను, వాదోపవాదాలతోనే సరిపెట్టే రాజకీయ వేత్తలను ఈ తత్వం ఆవహించుకొన్నది. ఒక వంకనుండి విప్లవమును అరికట్టుటకును, ఇంకొకవంక నుండి ప్రజా వ్యాపిత శాసన ధిక్కారాన్ని అపుచేయుట కొరకే 'పదవీ స్వీకరణ పరీక్ష' అను దాని ప్రారంభముపకరించినది. మూడవపర్యాయము శాసనోల్లంఘనోద్యమమే ప్రారంభమయినచో ఇంతవరకు ఎవరునూ కని విని యెరుగనంతటి శక్తితో సాగించి తీరాలి. ఈసంగతిని మహాత్ము డెరుగకపోలేదు.

అహింస—సామ్రాజ్యవాదుల హింస

శాంతియుతంగాను, తేలికగానైనను ఒకానొకనాడు సామ్రాజ్యవాదుల హింస, నిరంకుశ పరిపాలన, ప్రభుత్వాలను ప్రతిఘటించుటగా లెక్కింపబడిన మహాత్ముని అహింస, నేడు సామ్రాజ్యవాదుల క్రూర హింసలకు లోబడుటకు ప్రబలమైన సాకుగా ఉపయోగపడుచున్నది. మహాత్ముని ప్రోత్సాహముతో అఖిల భారత కాంగ్రెసు సంఘము 'అహింసా వాతావరణ' పేరుతో పౌరసత్వపు హక్కులను సన్నగిల జేస్తూ, [illegible] వాదులను సామ్రాజ్య వాదుల హింసకు, నిర్బంధము పాల్పడచేయుట కుపకరించే తీర్మానమును [illegible] నది. ఒకవంక భారతీయ ప్రజలపై దేశీయ [illegible] ధనికవర్గాలు సాగించే దారుణ దుర్భరహింస కళ్ల ఎదుట ప్రత్యక్షముగా కనుపిస్తోంటే దానిని ఖండించనే లేదు. కాంగ్రెసువాదులు, దోపిడి, రౌడీజము, హత్యలు, వర్గ సమరాన్ని హింసా పద్ధతులపై ప్రచారము వేయుచున్నారని నిందించినది. సామ్రాజ్యవాదుల అబద్ధాల నిక నుండి 'సత్యము' వ్యతిరేకించుట మాని వాటిని సమర్థించుట కుపకరించుచున్నది. రౌలట్ చట్టాన్ని మించిన క్రిమినల్ లా అమెండుమెంటు ఆక్టుయే సమర్థింపబడుచున్నది. గాంధితత్వము అభివృద్ధిదాయక స్వభావాన్ని వదలిపోవుచున్నది. రానురాను అభివృద్ధి నిరోధక స్వభావము దాని నావహించుకొని వచ్చుచున్నది.

ఋషిసంతతిలో ఆఖరి వ్యక్తి

అయినప్పటికీ, భారత జాతికి దాని స్వాతంత్ర్య పోరాటమునకు మహాత్ముడు నేటికి కూడ [illegible] ఆయన దానికి మార్గ దర్శకుడు, ప్రధాన [illegible]

(మిగతా 16 వ పేజీలో)



బాపూజీ

కార్మిక సమస్యలు

మద్రాస్ కాంగ్రెస్ ఎం. ఎల్. ఎ. అరెస్టు!

కాంగ్రెసు [illegible]త్వం కార్మికుల హక్కులు కాపాడాలి.

మధుర

150 మంది మిల్లు కార్మికుల అరెస్టు.

మహాలక్ష్మీ మిల్లులో 13 వ తేదీ రాత్రినుండి సమ్మె ప్రారంభమయినది. యజమానులకు ఇదివరలో తెలియజేసిన యిబ్బందులను వారు నెరవేర్చక పోవుటయే యీ సమ్మెకు కారణం.

14 వ తేదీనుండి కార్మికులు పికెటింగు ప్రారంభించిరి. పోలీసులు మొత్తం 150 మంది పికెటర్లను అరెస్టు చేసిరి. ఇందు స్త్రీలుకూడా చాలామంది గలరు. చెల్లయ్య అను కార్మిక సంఘ ఉపాధ్యక్షుని పోలీసులు అరెస్టు చేసిరి.

అధ్యక్షుని అరెస్టు

యిటుకూరు వెంకటేశ్వర మద్రాస్ కాంగ్రెస్ యం. యల్. ఎ గారు మహాలక్ష్మీమిల్లు కార్మికసంఘానికి అధ్యక్షులు. వీరును, యూనియన్ ఆఫీసులో ఉండగా పోలీసులు అరెస్టు చేసిరి.

లాఠీ చార్జి

15 వ తేదీని కొందరు కార్మికులు పికెటింగు చేస్తూంటే జిల్లా కలెక్టరు గారు వచ్చి లాఠీచార్జి చేయించిరి. ఈ లాఠీచార్జిలో కొందరు స్త్రీలకు కూడా గాయములు తగిలినవి. 3 గురు కార్మికులను అరెస్టు చేసిరి.

మధురలోని ప్రభుత్వ ఉద్యోగులు సాగిస్తూన్న ముష్కర పద్ధతి యిది. మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గము యొక్క పరిపాలనలోనే, కాంగ్రెసు శాసన సభా సభ్యులనే అరెస్టు చేశారంటే ప్రభుత్వ ఉద్యోగులు ఎంత విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారో విశదమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగ శాఖకు స్వాతంత్ర్యం ఇవ్వడం స్వాతంత్ర్య పోరాటపు గొంతును నులిమి వేయడమే. దీనిని గమనించి మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గం ప్రభుత్వోద్యోగుల యొక్కయు, పోలీసు అధికారుల యొక్కయు విచ్చలవిడి వర్తనాన్ని ఆపడానికి పూనుకోవాలి. లేకపోతే స్వాతంత్ర్య పోరాటం మంటగలుస్తుంది.

చీరాల

చీరాల ఫ్యాక్టరీ యజమానుల అక్రమాలు

చీరాల పొగాకు ఫ్యాక్టరీ యజమానుల అన్యాయాలు ఆంధ్రలోకాని కంతటికి తెలిసిన విషయమే. గతనెల ఆఖరి వారములో మద్రాసు లేబరు కమీషనరుగారయిన శ్రీ కొంతి రామమూర్తి ఐ. సి. యస్ గారు చీరాల యజమానులకును కార్మికులకు మధ్యనున్న తగాదాను పరిష్కరించడానికి వెళ్ళియుండిరి. అందుపై యజమానులు ఈ దిగువ షరతులకు అంగీకరించిరని వార్తలు వచ్చినవి.

1. మల్లాది యజ్ఞనారాయణ గారు అధ్యక్షులుగా నుందని పక్షమున, కార్మిక సంఘాన్ని యజమానులు గుర్తించి, ఇరువురి మధ్య వచ్చే తగాదాలను పరిష్కారం చేసుకోటానికి అంగీకరించిరి.

2 యిదివరలో పనిలోనుండి తొలగింపబడిన వారలను చేర్చుకొనుట.

3. ఇక ముందునుండి యజమానులు కక్షి పెట్టుకొని కార్మికులను పనిలోనుండి తొలగించరాదు. ఇవి కాక ఇంకనూ పనివారల జీతములను గురించియు, బకాయిలను గురించియు కొన్ని నియమాలకు యజమానులు అంగీకరించిరి.

లేబరు కమీషనరు గారు వెళ్ళిపోయిన తరువాత 43 గురు కార్మికులను పనిలోనుండి యజమానులు తొలగించిరనియు, యీ విషయమై దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు గారు మరికొందరు కాంగ్రెస్ ప్రముఖులు, విచారణ గావించి లేబరు కమీషనరుగారికి ఒక జాబును వ్రాసిరని వార్తలు వచ్చుచున్నవి.

చీరాల ఫ్యాక్టరీ యజమానుల అక్రమాలను అరికట్టుటకు తగినంత తీవ్రముగా ప్రజాందోళనను సాగించాలి. ఇందుకై చీరాల కార్మికుల సంఘాన్ని బలపర్చుటకు కార్మిక శ్రేయోభిలాషులు నడుములు కట్టి కార్య రంగానికి ఉగవలసి యున్నది.

విశాఖపట్టణం

రెండు రోజులలో విజయం

విశాఖపట్టణంలో 400 మంది పాకీవాండ్రు 11 వ తేదీ ఉదయం నుండి సమ్మెను ప్రారంభించారు. కారణం, జీతాల గురించియు, పని చేయుటను గురించియు నని తెలియవచ్చినది. డిప్యూటీ కలెక్టరు గారు యీ వ్యవహారములో కలుగజేసుకొని రాజీ కుదిర్చిరి. 13 వ తేదీనుండి పాకీవాండ్రందరూ పనిని ప్రారంభించిరి.

నెల్లూరు

పాకీవాండ్ర విజయం.

అక్టోబరు 10 వ తేదీని నెల్లూరు పాకీవాండ్రు సమ్మెను ప్రారంభించారు. ఆనాడే కలెక్టరు గారు పాకీవాండ్ర వద్దకు పోయి వారి యిబ్బందులను నెరవేర్చుటకు ప్రయత్నిస్తానని చెప్పిరి. ఆ సాయంత్రమే పని చేయు గంటలను గురించియు, జీతాలను గురించియు ఇంకా కొన్ని విషయాలను గురించియు పాకీవాండ్రు తమ కనీసపు కోర్కెల జాబితాను తయారు చేసి అధికారులకు పంపించిరి. సమ్మె విరమింపబడినది.

గుడివాడ

ఫ్యాక్టరీ కార్మికులకు అధ్యయన తరగతులు.

గుడివాడలో ఫ్యాక్టరీ కార్మిక సంఘం 142 మంది సభ్యులతో సెప్టెంబరు 28 వ తేదీని రిజిష్టరు చేయబడినది, ప్రతి ఆదివారము ఫ్యాక్టరీ కార్మికులలో అధ్యయన తరగతులు జరుగుచున్నవి. రాత్రి పాఠశాల నొకదానిని ఏర్పాటు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. సంఘమును అభివృద్ధి చేయుటకు అధికారులు ప్రయత్నములను చేయుచున్నారు.

బొంబాయి కార్మిక తగాదాబిల్లుపట్ల అసమ్మతి.

గుడివాడ ఫ్యాక్టరీ కార్మికసంఘము సెప్టెంబరు 25 వ తేదీని సమావేశమై బొంబాయి కార్మిక తగాదా బిల్లును ఖండిస్తూ, బొంబాయి కార్మికులకు తమ సానుభూతిని తెలుపుతూ తీర్మానములను చేసిరి.

గుడివాడ కార్మికుల కనీసపు కోర్కెలు

1. ప్రతి ఆదివారము సెలవు 2. ఫ్యాక్టరీ ఆక్టును యజమానులు అమలు జరుపాలి 3. వైద్య సహాయము 4. ఒకనెల మైనను నోటీసు లేకుండ కార్మికులను పనినుండి తొలగించరాదు 5. కార్మికులచే యజమానుల ఇంటి పనులు చేయించరాదు 6. ధాన్యం బియ్యం కొట్లవద్ద రాత్రి కాపలా యజమానుల ఖర్చుల మీదనే ఏర్పాటు చేసుకోవాలి అట్టి కాపలా కాయువారి జీతాలు ఎక్కువ చేయాలి. 7. ఆడకూలీలపట్ల యజమానులు, కంట్రాక్టర్లు మర్యాద మానాలి 8. పనివారలను తిట్టుట కొట్టుట ఆగిపోవాలి 9. కార్మిక సంఘములో సభ్యులుగా చేరువారిని యజమానులు బెదరించుట మానాలి 10. యజమానులు సంఘాన్ని గుర్తించాలి. మొదలగు కనీసపు కోర్కెలపై కార్మిక సంఘాధికారులు గుడివాడ కార్మికులలో ప్రచారమును చేయుచున్నారు.

తరిగొప్పుల కార్మికుల సభ

సెప్టెంబరు 25 వ తేదీని తరిగొప్పుల కార్మికుల సభ జరిగినది. కార్మికులు ఒక సంఘముగా ఏర్పడవలసినదని స్థానిక కాంగ్రెసువాదులు ప్రోత్సహించిరి. వారందరును కార్మిక సంఘములో సభ్యులుగా చేరుటకు తీర్మానించుకొనిరి. తరిగొప్పులలోని ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు 2, 3 మైళ్ళ దూరమునుండి రాత్రులందుకూడ పనిలోనికి పోవలసి వచ్చుచున్నది. రాత్రి సమయములందు పనిని చెప్పవద్దని కార్మికులెంతప్రతిమాలినను యజమానులు వినుటలేదు.

కలకత్తా

బెంగాల్ జ్యూట్ ఆర్డినెన్సుపట్ల అసమ్మతి.

బెంగాల్ మంత్రివర్గం ఇటీవల జ్యూట్ ఉత్పత్తిపై ఆంక్షలను వేయుచు ఒక ఆర్డినెన్సును ప్రకటించియున్నది. ఈ ఆర్డినెన్సు ఫలితంగా జ్యూట్ ఫ్యాక్టరీలలో పనిచేసేవారు 25 వేలమంది కార్మికులు నిరుద్యోగులయిరి. సుమారు 2. లక్షలమంది కార్మికులకు నూటికి 16 వంతున జీతములు తగ్గిపోయినవి. జ్యూట్ మిల్లు కార్మికులకు దామాషాను రు 15/- లకు మించి సంపాదన లేదు. ఆర్డినెన్సు ఫలితంగా యీ జీతములో రు 2—8—0 ల వరకు తగ్గిపోయింది. ఇదేగాక, జనుము పండించే రైతులోకం కూడా దీనివలన చాలా నష్టపడింది.

యీ ఆర్డినెన్సు పట్ల అసమ్మతిని తెలియజేయుచూ కలకత్తాలోని జ్యూట్ మిల్లు కార్మికులు మహాసభలు జరిపి తీర్మానములను చేయుచున్నారు. సెప్టెంబరు 24 వ తేదీనుండి కలకత్తా కార్మికులు ఆందోళన సాగించుచున్నారు. యీనెల 9 వ తేదీని 10 వేల మంది కార్మికులు సమావేశమై, ఈ ఆర్డినెన్సును మార్పు చేయకున్నచో జనరల్ స్ట్రయికును జరుపుటకు తీర్మానించిరి. బెంగాల్ రాష్ట్రమంతటను జ్యూట్ ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా ఆందోళన చేయుటకై ఒక దినమును ఏర్పాటు చేయవలసినదని కాంగ్రెసు సంఘాన్ని కోరినవి. రైతుసంఘాలుకూడ ఈ ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా పోరాటమును సాగించవలసినదని రైతులను కోరుతూ తీర్మానం ఆమోదింపబడినది.

(మిగతా 16 వ పేజీలో)



బొంబాయి మంత్రులకు ఒక పేద రైతు సలహా

సంయుక్త పరగణాలలో రైతు ఉద్యమం

వివిధ జిల్లాలలో, జమీందార్లు అక్రమంగా రైతులను ఏదో ఒక నెపంపై భూముల నుండి తొలగిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యాలయానికి ప్రతిరోజూ రైతుల నుండి వచ్చే అర్జీలకు లెక్కలేదు. ఒక్క అజాంగర్ జిల్లాలో జమీందార్లు 1000 మంది రైతుల భూములను స్వాధీనం చేసుకున్నారు. బిజ్నోర్ జిల్లాలో 801 రైతులకు యీగతి పట్టింది. కాంగ్రెసు మంత్రివర్గం యిందు విషయమై తగిన ఏర్పాట్లు చేయవలసిందని కాంగ్రెసు కమిటీ వ్రాసింది. బస్తీ జిల్లా కాంగ్రెసు కమిటీ ఉపాధ్యక్షులైన గుదరీరాంగారు, మరి 15 గురు రైతు సేవకులు యిండ్లు తగులబెట్టారనే నేరం క్రింద, వారిని అరెస్టు చేయించారు. కాని, యదార్థం ఏమంటే, వీరు జమీందారు యొక్క అత్యాచారాలను ఖండిస్తూ ప్రజలలో ఆందోళన చేయడమే. బెనారస్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి అయిన యస్. పి. త్రిపాఠీగారు, మరొక 10 మంది కాంగ్రెస్ ప్రచారకులు చందౌలీ తాలూకాలో ప్రవేశించ కూడదని 144 వ సెక్షను ప్రయోగింపబడింది. చందౌలీ తాలూకా రైతు సంఘాధ్యక్షుడు, కార్యదర్శి ప్రజలలో అశాంతిని ప్రోత్సహిస్తున్నారనే నేరం క్రింద అరెస్టు చేయబడ్డారు.

రాష్ట్ర శాసనసభ చేత నియమింపబడిన సెలెక్టు కమిటీ సభ్యులు రైతాంగ బిల్లుకు కొన్ని సవరణలు చేసి ప్రభుత్వానికి యిచ్చారు. సవరణ బిల్లులో ఈ క్రింది సౌకర్యాలు రైతులకీయ బడ్డాయి:

1. జమీందార్ల స్వంత కమతాలు సాధ్యమైనంత వరకూ తగ్గించి వేయాలి.

2. పెద్ద జమీందార్ల (అనగా, ప్రభుత్వానికి రు. 250 లు గాని అంతకంటె హెచ్చుగాని పేష్కష్ చెల్లించేవారి) స్వంత కమతాలపై సాగుచేసే రైతులకు జిరాయితీ హక్కు ఈయబడాలి. వంశ పారంపర్య దాన్ని రైతు అనుభవించడానికి హక్కు కలిగియుంటాడు. కాని, యీ జమీందార్లు 50 యకరాల కంటె మించని భూమిని సొంత కమతంగా ఉపయోగించుకో వచ్చును.

3. చిన్న జమీందార్ల (అనగా రు 250 ల కంటె తక్కువ పేష్కష్ చెల్లించే వారి) సొంత కమతాలు మాత్రం రైతులకు స్వాధీనం చేయబడవు.

4. జమీందారుకు రైతు చెల్లించవలసిన శిస్తుకు బాధ్యత ఆ రైతు క్రింద పనిచేసే కౌలుదారు మీద పెట్టకూడదు. అనగా పట్టాదారే బాధ్యత వహించి చెల్లించాలి.

5. వసూలిచ్చిన సొమ్ముకు రసీదు లీయకపోతే, జమీందారు శిక్షార్హుడౌతాడు.

6. రైతులు జమీందారుకు చెల్లించవలసిన బకాయిలకు పంట జప్తు చేయకూడదు.

7. తోట పైరులపై సేద్యంచేసే రైతు యొక్క భూమిని ఋణదాతగాని, జమీందారు గాని, బాకీలకు స్వాధీనం చేసుకొనవచ్చు.

కాంగ్రెసును యెదిరిస్తూ ఈ బిల్లుపై యు. పి. జమీందార్లు తీవ్రమైన ప్రచారంచేస్తున్నారు. శాసనోల్లంఘనం చేస్తాం అని బెదరిస్తున్నారు. కాని, యు. పి. ప్రధాని గోవింద వల్లభపంతు లక్నోలో ఉపన్యసిస్తూ జమీందార్లు బెదిరించినంతమాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వము తమ విధ్యుక్త ధర్మం చేసితీరుతుందని ఘంటాపథంగా పలికాడు. ఇంతేకాదు. ఈ జమీందార్లు రాష్ట్రంలో మత ద్వేషాలు కూడా రెచ్చగొట్టుతున్నారు. రైతాంగ బిల్లు రాష్ట్రమందలి మహమ్మదీయ ప్రజా బాహుళ్యానికి హానికరం అని దుష్ప్రచారం ఆరంభించారు. ప్రధాని దీనికి కూడా సమాధానమిస్తూ, యు. పి. రాష్ట్రంలో హిందూ ప్రజలకంటె ముస్లింలే యెక్కువ దీనస్థితిలో ఉన్నారనీ; యీ శాసనం వారికే ఎక్కువ ప్రయోజనకారి అనీ రుజువుచేశారు.

రాష్ట్ర కాంగ్రెసు మంత్రి వర్గానికి జమీందార్లకు మధ్య రాజీ చేయమని కోరుటకై కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యులవద్దకు యీ మధ్య జమీందార్ల ప్రతినిధులు వెళ్ళారు. తామిచ్చే నిర్ణయానికి జమీందార్లు బద్ధులైయుంటారా అని వారిని నాయకులడిగారు. అందుకు జమీందార్లు సమ్మతించలేదు. రాజీ సంభాషణలు అంతటితో ముగిసినవి.

పూనాలో రైతుల ప్రదర్శనం.

బొంబాయి కాంగ్రెసు మంత్రి వర్గం ప్యాస్ చేయనున్న రైతాంగపు బిల్లును భగ్నం చేయడానికి అనేకమంది భూస్వాములు, జమీందార్లు ఆందోళన ప్రారంభించారు. కాని ప్రభుత్వానికి తమ ఆమోదాన్ని తెలియజేయుటకు, బిల్లులో యింకా కొన్ని సవరణలు సూచించుటకు సుమారు 1500 మంది రైతులు పూనా వీధులలో పెద్ద ప్రదర్శనం, ఊరేగింపు చేశారు. పూనా జిల్లా కాంగ్రెస్ కమిటీ యాజమాన్యాన్ని ఈ ఊరేగింపు జరిగింది. ఎసంబ్లీ భవనంవద్దకు రైతులు వచ్చారు. రివెన్యూమంత్రి శ్రీ మొరార్జీ దేశాయిగారు వెలికివచ్చి ఉపన్యసించారు. ఇట్టి ఊరేగింపులు, ఆందోళన అవసరం యేమిటని రైతులను మందలించారు. కాంగ్రెసు మంత్రులు ఎల్లప్పుడూ రైతుల శ్రేయస్సే కోరుతారని ధైర్యంచెప్పి పంపారు. రైతులు ఈ మాటలతో సంతృప్తిపడక, ప్రధాని బి. జి. ఖేర్ యింటి వద్దకు వెళ్లారు. రైతాంగపు బిల్లులోని ప్రధానాంశములను ఆయన తెలియజెప్పి, రైతులకు ధైర్యం యిచ్చాడు. నాటి సాయంకాలం జరిగిన బహిరంగ సభలో ఒక సామాన్య రైతు వ్రాడుక మరాఠీ భాషలో ఉపన్యసిస్తూ, "నానే ప్రధాన మంత్రి నని యిస్తే, ప్రభుత్వపు ఆదాయ వ్యయ పట్టికను అతి అవలీలగా సరిచేస్తాను!" అని పలికాడు. "రైతుల పన్నుభారం, శిస్తు భారం తగ్గించి, ప్రభుత్వోద్యోగులకు నెలకు రు 12 ల చొప్పున జీతాలిస్తే రైతులూ సంతోషిస్తారు, ఆ ప్రభుత్వోద్యోగులూ రోజుకు రెండుసార్లు తృప్తితీరా భోజనం చేస్తారు." అని ఆ రైతు సలహాయిచ్చాడు! మరొక రైతు "మాకు విద్యా సౌకర్యాలకంటె, ఆరోగ్య సౌకర్యాల కంటే ముందు, తిండి అవసరం" అని గర్జించాడు.



బొంబాయి ప్రధాని
బి. జి. ఖేర్

బరోడా

బరోడా సంస్థాన ప్రభుత్వాజ్ఞను ఉల్లంఘించి, మంగ్రోల్ రైతులను బహిరంగ సభలో హెచ్చరించి నందుకు, గుజరాత్ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి డి. యం. మంగార్ కర్ గారిని సంస్థాన పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్ కాంగ్రెస్ సోషలిస్టు నాయకుడైన దిన్ కర్ మెహతాగారు కూడా ఆ సభలో ఉపన్యసించారు. కాని, ఆయనను అరెస్టు చేయలేదు. సుమారు 70 మంది రైతు ప్రచారకులు యీ విధంగా ప్రభుత్వాజ్ఞను ఉల్లంఘించినందుకు అరెస్టు చేయబడ్డారు. అయినప్పటికీ రైతుల శాసనోల్లంఘ నోద్యమం నానాటికీ వృద్ధి పొందుతోంది.

బీహార్

జమీందార్లు రైతుల చేత వెట్టి చేయించు కోరాదని కొత్తగా చట్టం ప్యాసు చేయబడినప్పటికీ దానికి విరుద్ధంగా, మాఝీ, గంగాపూర్, ఖవర్ పురా, హసన్ పురా, చానీ, విశౌల్, తిసీడీహ్, గోదౌలా జమీందార్లు తమ రైతుల చేత వెట్టి చేయించు కొంటున్నారు.

ముజఫర్ పూర్, కర్నోల్ జమీందార్లు రైతులిచ్చే శిస్తులకు రసీదులిస్తూ, రకరకాల షరతులు వ్రాసి, అవియేవో రైతులకు చెప్పకుండా వేలుముద్రలు వేయించు కొంటున్నారు.

పాట్నా జిల్లాలో హీరాసింగ్ అనే ఒక కాంగ్రెస్ జమీందారు అచ్చు రసీదు ఫారం ఒకటి, వ్రాత రసీదు ఫారం ఒకటి ఉంచుకొని ఎవరికి ఏదియిస్తే మాట దక్కుతుందో వారికి ఆ రసీదులు యివ్వడం మామూలు.

గయా జిల్లా ఒబరా తాలూకాలో, సూర్యనారాయణ సింహు అనే ఒక జమీందారుకు 20 సంవత్సరాల నుంచి రైతులు చెల్లించే పన్నుకు రసీదులిచ్చే అలవాటే లేదట! గ్రామస్థులచే నిర్బంధంగా పాలు, పెరుగు, నెయ్యి వగైరా సరకులు తెప్పించు కొంటాడట! అనేక బాధలు పెట్టి వెట్టి చేయించుకొంటాడట!

గయా జిల్లాలో, పంచరత్నలాల్ అనే జమీందారు శాసనానికి వ్యతిరేకంగా రైతులచేత వెట్టి చేయించు కొంటున్నాడు. ఈయన పెద్ద కాంగ్రెస్ అభిమాని! కొన్నాళ్ళు తాలూకా కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షస్థానాన్ని కూడా అలంకరించాడు.

ఉ. చదుములో రైతు ఉద్యమము

మదనపల్లి తాలూకా, చదుము గ్రామంలో రైతు వుద్యమము బ్రహ్మాండంగా పెరుగుతూ వున్నది. దానికి ఎక్కువగా కారణము అక్కడి ధనికుల దుర్మార్గపు చర్యలే. షాహుకార్లు, కరణం, భూస్వాములూ యావన్మందియేకమై బీద రైతులను త్రొక్కిపట్టాలని ప్రయత్నము చేస్తున్నారు. అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారు.

రైతులంతా కలసి, కాంగ్రెసు సంఘము, రైతు సంఘము పెట్టుకోవటమే రైతుల తప్పు! కాంగ్రెసులో చేరితే రాట్నాలు పెట్టి, ఖద్దరు వడకవలసినదే కాని రైతులంతా చేరి రైతు భజన చేయుటకు ఏమి న్యాయము? జమీందారీ పద్ధతి, షాహుకారీ పద్ధతి నశించుగాక అనడం ఏమి ధర్మము? రైతులంతా రైతు భజనలు కోలాటాలు వేయరాదట! రైతు పాటలు పాడరాదట! రైతు భజనలు ఆడవాండ్లను ఆకర్షించ టానికట!

ధనికుల కుట్రలు.

రైతులు ఏర్పాటు చేసుకున్న కాంగ్రెసు సంఘాన్ని రూపుమాపు చేయాలని ధనికులు మదనపల్లెకు పోయి, జిల్లా కాంగ్రెసు కార్యదర్శిగారి వద్దనుంచి కాంగ్రెసు రసీదు పుస్తకములు తెచ్చి, తాము వేరే కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నించారు. కాంగ్రెసు పెద్దలకుల సానుభూతిని సంపాదించుటకై మాటికీ మదనపల్లెకు తిరుగుతూ రైతులంతా ఆస్థి పంచిపెట్టుతున్నారు.

(మిగతా 17 వ పేజీలో)

మన రాజకీయాలు

పత్రికలు ప్రకటిస్తే ప్రమాదమా?—ఇది యెంత యదార్థం?—బొంబాయి మంత్రి వర్గాన్ని అభినందించాలి—సింధు మంత్రి వర్గానికి గండం తప్పదా?—అస్సాంలో కాంగ్రెసు బలం హెచ్చింది—అతివాదులయెడ మహాత్ముని వైఖరి.

ముస్లిం నాయకుల అసలు గుట్టు

పత్రికలు ప్రకటిస్తే ప్రమాదమా?

"ఏజన్సీ" అనే పేరుతో తెలుగు మాసపత్రిక ఒకటీ, "Excluded Areas" (మినహాయింపు ప్రదేశాలు) అనే పేరుతో ఇంగ్లీషు మాసపత్రిక ఒకటీ ప్రకటించడానికి శ్రీ ఘటూరి కోదండ రామయ్య గారు మా. గోదావరిజిల్లా కలెక్టరుగారి అనుమతికై వ్రాయగా, ఏ పత్రికకు ప్రతిదాని 250 రూపాయిల చొప్పున సెక్యూరిటీ చెల్లింపవలసిందని కలెక్టరు గారు ఉత్తర్వు చేశారు. దీనికి కారణం తెలియజేస్తూ, కోదండరామయ్యగారు ఎవరి ఆస్తి సంరక్షణార్థమైనా ప్రభుత్వ యంత్రాంగం చెప్పడానికి వీల్లేదని: ఏజన్సీ ప్రాంతాలను విద్యావిహీనులైన ఏజన్సీ ప్రజలు ఉద్రేకపూరితులై, ప్రమాద పరిస్థితులు కలుగుతాయి కాబట్టి: ఏమైన యిట్టి పత్రికలు అనుమతి యిచ్చి గోదావరి జిల్లా కలెక్టరు గారు అభిప్రాయ పడ్డారు!

ఫైజుపూర్, హరిపూర్ కాంగ్రెసు మహాసభలలో ఏజన్సీ ప్రాంతాల పరిపాలనను గురించి విస్తృతంగా ఆమోదించబడిన తీర్మానం అమల్లోకి వచ్చేటట్లు నిరంతరమైన ఆందోళన చెయ్యడం అతివాద పక్షం అయితే, కోదండరామయ్యగారు అతివాదులలో ఒకరే. కాని, కాంగ్రెసు సంస్థ తరఫున అధికారంలో ఉన్న మంత్రివర్గపు హయాంలోనే యిట్టి ఖంగారు ఉత్తరువులు అమలు జరగడం మన మంత్రుల చేతకానితనాన్ని తెలియజేస్తున్నవి. పత్రికలు ప్రకటిస్తేనే ప్రమాద పరిస్థితు లేర్పడే ఏజన్సీ దుష్పరిపాలనను ఎంత త్వరలో నిర్మూలిస్తే అంత మంచిది. "విద్యావిహీను"లైన ఏజన్సీ ప్రజలు ఏవిధంగా ఈ పత్రికలు చదివి ఉద్రేకపూరితులై, "ప్రమాద పరిస్థితుల"కు కారణభూతులౌతారో మాత్రం కలెక్టరుగారు తెలియజేయ లేదు! ఇట్టి అఖండ మేధావంతులైన జిల్లా కలెక్టర్లను తాబేదార్లుగా ఉంచుకొని, రాజగోపాలాచారిగారు ఏవిధంగా కాంగ్రెస్ తీర్మానాన్ని అమల్లో పెట్టగలరో పాఠకులు ఊహించుకోవచ్చును. కాంగ్రెసు వాదులు ప్రకటించే పత్రికలకు సెక్యూరిటీలు అడగవద్దని జిల్లా కలెక్టర్లకు ఉత్తరువు లీయాలి. ఇందుకై ప్రజలు ఆందోళన చేయాలి.

ఇది యెంత యదార్థం?

బెంగాలు విద్యార్థుల సమావేశానికి అధ్యక్షత వహిస్తూ శ్రీ శరత్‌చంద్రబోసుగారు యిచ్చిన ఉపన్యాసంలో వర్గపోరాటాన్ని గురించి కొన్ని చిత్రమైన అభిప్రాయా లిచ్చారు. ఏ భారతీయునికీ వర్గపోరాటం నచ్చదట! భారతదేశ చరిత్ర, నాగరికత మొదటి నుంచి యిప్పటివరకూ, సామరస్య సిద్ధాంతం మీదనే నడుస్తూ వచ్చాయట! కాని, ఇది యెంతవరకు యదార్థమో పరిశీలించాలి. ఆర్యులకూ—అనార్యులకు, ఒక సామంతరాజుకూ—మరొక సామంతరాజుకూ, గ్రీకు దేశపు రాజులకూ—స్వదేశ చక్రవర్తులకూ, రాజపుత్రులకూ—మహమ్మదీయ సైన్యాలకూ, మహమ్మదీయ చక్రవర్తులకు—మహారాష్ట్ర రాజులకూ, భారత సంస్థానాధీశులకూ—బ్రిటిష్ పరిపాలక వర్గానికీ మధ్య జరిగిన పోరాటాలు, యుద్ధాలు, రక్తపాతాలు బోసుగారు మరచిపోయారా? వర్గపోరాట సిద్ధాంతం యెవరికీ నచ్చకపోవచ్చు. కాని, దేశంలో యేగ్రామం చూచినా, ఏ పట్టణం చూచినా, ఈ సిద్ధాంతం నిత్యమూ ఆచరణలో ఉంది. వర్గ పోరాటం లేని సమాజాన్ని స్థాపించడమే ప్రతి సోషలిస్టు యొక్క ఆశయం.



శ్రీ శరత్ చంద్రబోసు

బెంగాల్ ఎసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు.

ఇండియాలో నేడు ధనికవర్గాలకు చెందినవారెవరూ యెక్కువ పట్టుదలతోను, క్రౌర్యంలోనూ ప్రవర్తించడం లేదని బోసుగా రన్నారు. ఇదికూడా సత్యదూరం అనే చెప్పాలి. పట్టుదల—క్రౌర్యం లేకపోతే చిరకాలంనుంచీ వీరనుభవిస్తూన్న ఆస్తిపాస్తులన్నీ మాయ మౌతాయి. నేటి సమాజ పద్ధతే ఆవిధంగా ఉన్నది. ఆదర్శప్రాయమని మొన్నమొన్నటివరకూ పిలువబడే తిరువాన్కూరు సంస్థానంలో నేడు తాండవ మాడుతూన్న భయంకర హత్యాకాండను చూస్తే, విదేశపరిపాలనే యింతకంటె మెరుగనిపిస్తుంది. ఆంధ్ర దేశంలో నేడు రైతులపై జమీందార్లు, షావుకార్లు చేస్తూన్న అత్యాచారాలు, ఫ్యాక్టరీయజమానులు కూలీలను పెట్టేబాధలు నిత్యమూ చూస్తూనే ఉన్నాం. ఇతర రాష్ట్రాలలో కూడా యిట్టి దోపిడీ విధానమే అమల్లో ఉంది. అట్టి పరిస్థితుల్లో, ధనిక వర్గాలు "యెక్కువ పట్టుదలతోను, క్రౌర్యంతోను ప్రవర్తించడంలే"దని బోసుగారు అనడం సాహసమే!

బొంబాయి మంత్రివర్గాన్ని అభినందించాలి

శాసనోల్లంఘనోద్యమ రోజుల్లో ప్రవేశపెట్టబడిన స్పెషల్ పవర్స్ ఆక్టు అనే చట్టాన్ని రద్దు చేస్తూ బొంబాయి శాసన సభలో ఆమోదింపబడిన తీర్మానానికి బొంబాయి గవర్నరు తన అనుమతి యిచ్చాడు.

నిరంకుశ శాసనాలను రద్దు చేయాలనే కాంగ్రెసు తీర్మానాన్ని యీవిధంగా అమలుపరచుటకు ప్రయత్నిస్తూన్న బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గాన్ని చూచి మన రాజాజీ పాఠం నేర్చుకుంటే, ఎంతైనా మంచిది. బొంబాయి మంత్రి వర్గాన్ని ఈవిషయంలో అభినందించాలి.

సింధు మంత్రివర్గానికి గండం తప్పదా?

సింధు రాష్ట్రపు మంత్రివర్గానికీ, కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డుకీ మధ్య జరిగిన ఒడంబడికవల్ల ఆ రాష్ట్రంలో కాంగ్రెసుకు పూర్వం కంటె బలం యేర్పడింది. ముస్లిం లీగ్ నాయకుడైన జిన్నా, బెంగాల్—పంజాబ్ ప్రధానమంత్రులైన హక్, హయత్‌ఖాన్‌లు కరాచీ వెళ్ళి, కాంగ్రెసు బలాన్ని చీలగొట్టడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. 35 మంది ముస్లిం శాసన సభ్యులలో 27 గురిని ముస్లిం లీగ్ సభ్యులుగా ఉండేటట్లు సంతకాలు చేయించుకున్నారు. యూరపియన్ సభ్యులు ముగ్గురూ, మరొక హిందూసభ్యుడూ కలిస్తే, 60 మందిలో 31 మంది కూడిన మెజారిటీ ముస్లిం లీగ్‌కు ఉంటుంది. అప్పుడు, పూర్తిగా ముస్లిం లీగ్ సభ్యులతో కొత్తమంత్రి వర్గం యేర్పడుతుంది. కాంగ్రెస్ పలుకుబడి క్షీణిస్తుంది. ఇది జరగకుండాఎన్ని ప్రయత్నాలైనా చేస్తున్నారు. కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటరీ కమిటీవారు కాంగ్రెస్ పార్టీకిచెందిన 10 మందిసభ్యులు యిప్పటి మంత్రివర్గానికి పూర్తిగా సహాయం చేయడానికే నిశ్చయించుకున్నారు. అయినప్పటికీ, సింధు మంత్రివర్గానికి గండం తప్పేటట్లు లేదు.

అస్సాంలో కాంగ్రెసు బలం హెచ్చింది

అయిదుగురితో కూడిన కాంగ్రెసు మిశ్రమ మంత్రి వర్గంలో ముగ్గురు ముస్లిం సభ్యులు కూడా యిప్పుడు చేర్చుకోబడ్డారు. వారు: మౌల్వీ ఆలీ హైదరుఖాన్, ఫకీరుద్దీన్ అహమ్మద్, మౌల్వీ మహమ్మదాలీ అనేవారు. వీరు గాక, నిమ్నజాతుల ప్రతినిధులు మరొక ముగ్గురు కూడా కాంగ్రెసు మిశ్రమ పక్షంలో కొత్తగా చేరారు. వీరు మొన్నటివరకూ ప్రతికూలపక్షంలోనివారు. అస్సాములో నేడు కాంగ్రెసు మంత్రి వర్గానికి గల బలం 107 గురు శాసనసభ్యులలో 55 గురు. దీన్ని బట్టి, ఆ రాష్ట్రంలో యూరపియన్ సభ్యులు ఎన్నెన్ని యెత్తులు వేస్తూన్నప్పటికీ, కాంగ్రెసుకు రోజు రోజూ బలం ఎక్కువౌతోందని స్పష్టమౌతుంది. కొత్త మంత్రి వర్గం అధికారానికి వచ్చాక, ఒక్కొక్కరినే రాజకీయ ఖైదీలను విడిచిపెట్టడం కూడా ప్రారంభించారు.

అతివాదులయెడ మహాత్ముని వైఖరి

ఢిల్లీలో యీమధ్య జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశంలో అతివాదులు సభను విడిచిపెట్టి వెళ్ళిపోవడాన్ని గురించి హరిజనపత్రికలో మహాత్ముడు ఖండిస్తూ, ఈవిధంగా వ్రాశాడు:—

"వారు (అతివాదులు) ఎంత దీర్ఘంగా ఉపన్యసించ దలుచుకొన్నారో, ఎన్ని యెక్కువ ఉపన్యాసా లీయాలని అనుకున్నారో, అంత దీర్ఘమైనట్టి అధికమైనట్టి ఉపన్యాసాలకు అనుమతి యివ్వడంలో అధ్యక్షుడు (సుభాష్ బోసు) తప్పుదారి తొక్కాడని నా అభిప్రాయం."

కాంగ్రెసు సంస్థ పుట్టి 50 సంవత్సరాలకు పైగా అయింది. కాంగ్రెసు యొక్క ఆదర్శాన్ని గురించి, పద్ధతులను గురించి, కార్యక్రమాన్ని గురించి భేదాభిప్రాయాలు గలిగిన అతివాదులు, మితవాదులు మొదటి కాంగ్రెసులో నుంచీ ఉంటూనే వచ్చారు. మహాత్మునికి భారత రాజకీయాల్లో పలుకుబడి అంత యెక్కువగా లేనప్పుడు, తిలక్ అతివాద పక్షానికీ, గోఖ్లే మితవాదపక్షానికీ నాయకులు. తరువాత, అసహాయోద్యమాన్ని దేశంలో ప్రవేశపెట్టి, ప్రజాపోరాటం ద్వారా ప్రభుత్వాన్ని లొంగదీయడానికి నడుము కట్టిన గాంధీజీ అతివాదులపక్షాన నాయకుడయాడు. మితవాద నాయకులైన గోఖ్లే యిత్యాదులు కాంగ్రెసు నుండి తప్పుకొని, ప్రత్యేకంగా ఒక సంస్థను స్థాపించుకొన్నారు. ఈ కాంగ్రెసులోనే మళ్ళీ జవహర్‌లాల్, మరియు సాంబమూర్తి గార్ల నాయకత్వాన్ని అతివాద మొకటి బయల్దేరింది. అధినివేశ స్వరాజ్యం కాక, సంపూర్ణ స్వాతంత్ర్యం కాంగ్రెసు యొక్క ఆదర్శంగా ఉండాలని వీరి అభిప్రాయం. సంపూర్ణ స్వాతంత్ర్య సమితి అనే పేరుతో వీరొక సంస్థకూడా స్థాపించారు. 1930 వ సంవత్సరంలో జరిగిన కరాచీ కాంగ్రెస్‌లో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం ప్యాసయింది.

ఈ అతివాద, మితవాద పక్షాలకు చెందినవారు కాంగ్రెసు కమిటీలలోను, మహాసభలలోనూ వారి వారి కార్యక్రమాలను, ఆదర్శాలను యితర కాంగ్రెసువాదులు కూడా అంగీకరించాలనే అభిప్రాయంతో దీర్ఘమైన ఉపన్యాసాలు చేసేవారు. అనేకసార్లు అతివాదుల కార్యక్రమాన్నే కాంగ్రెసు అంగీకరిస్తూ వచ్చింది. కాని, ఎప్పుడైతే కాంగ్రెసులో అతివాద పక్షానికి చెందిన సోషలిస్టులు, కమ్యూనిస్టులు, రాయిస్టులు, రైతుసంఘమువారు ఢిల్లీ కాంగ్రెసు కమిటీ సమావేశంలో ఏకమై, కాంగ్రెసులో ఉన్న మితవాద దృక్పథాన్ని తీవ్రంగా యెదుర్కొన్నారో అప్పుడు నాయకులందరికీ ఆశ్చర్యం కలిగింది. మహాత్ముడు కూడా వారి "వాక్ అవుట్" (సభను విడిచి వెళ్ళుట) ఖండిస్తున్నాడు. మొదటినుంచీ కాంగ్రెసులో ఉన్న సాంప్రదాయాలకు, న్యాయానికీ విరుద్ధంగా, అతివాదుల వాక్స్వాతంత్ర్యాన్ని కాంగ్రెస్ సమావేశాలలో కూడా అరికట్టాలని మహాత్ముడు అభిప్రాయమిస్తున్నాడు. ఇది యెంతమాత్రం న్యాయంకాదు. "అది (కాంగ్రెసు) 1920 నాటి నుంచీ యుద్ధం చేసే ఒక సైన్యం మాదిరిగా ఉంది, ఒకే ఆశయంతో, ఒకే కార్యవిధానంతో, ఒకే గమ్యస్థానంతో, సరిమైన శిక్షణతో పనిచేస్తూ వచ్చింది." అని మహాత్ముడు వ్రాశాడు. కాని, కాంగ్రెసు చరిత్ర చూస్తే, యిది సరికాదని బోధపడుతుంది.

అతివాదులు ప్రజా సామాన్యంలో యిప్పటికంటె తీవ్రంగా పని చేస్తేనే గాని, గాంధీజీ వంటి నాయకులు తీసుకొంటూన్న యిట్టి దృక్పథాన్ని మార్చలేము.

కేకలుకూడా దౌర్జన్యమే?

విద్యాశాఖ మంత్రియైన డాక్టరు సుబ్బరాయన్‌గారు తెలిచేరీ ఎయిడెడ్ ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయుల మహాసభకు ఆహ్వానింపబడగా, అక్కడికి వెళ్ళారు. "మేనేజ్‌మెంటు పద్ధతి నశించు గాక!" అని ఉపాధ్యాయులు కేకలు వేశారు. సుబ్బరాయన్ గారు ఆగ్రహావేశులై, "అట్టి కేకలు వేయడం దౌర్జన్యం; నిజంగామీకు దౌర్జన్యరాహిత్య సిద్ధాంతంలో నమ్మకం ఉంటే, యిట్టి కేకలు వేయకూడదు." అని మందలించారు. అవసరమయితే, ఇంతకంటె మంచి ఉపాధ్యాయులు నియమించబడతారని కూడా సుబ్బరాయన్‌గారు బెదిరించారు

నిరంకుశమైన బ్రిటిష్ సామ్రాజ్యంతో హోరాహోరీగా పోరాడుతున్న సంస్థ తరఫున డాక్టర్ సుబ్బరాయన్‌గారు ఉపన్యసించడానికి వస్తే, ఉపాధ్యాయుల రక్తమాంసాలను పీల్చివేసే మేనేజ్‌మెంటు పద్ధతి నశించాలి అని కేకలు వేయడం ఏవిధంగా దౌర్జన్యం అవుతుందో బోధపడదు. మంత్రిగారు సభను విడిచిపెట్టి వెళ్ళిపోగానే, వారి వైఖరిని ఖండిస్తూ మహా సభలో తీర్మానించబడింది.

కాంగ్రెసు మంత్రులు అధికారానికీ వచ్చాక, వివిధ వర్గాలకు—వివిధ తరగతులకు చెందిన పీడిత ప్రజలలో నూతనోత్సాహం, ఆశా జ్యోతి బయల్దేరింది. కార్మిక సమ్మెలు, రైతుప్రదర్శనాలు, విద్యార్థి మహాసభలు వెల్లివిరుస్తున్నాయి. ఉపాధ్యాయుల్లోకూడా యీ ఉత్సాహం ప్రారంభమయింది. ఇట్టి ప్రజా ఉద్యమాలను చూచి గర్వించడానికి మారు, మన మంత్రులు వాటిని ఖండిస్తున్నారు. కాని, ఫెడరేషన్ ఏచ్చి మీద పడినప్పుడు, యీ సుబ్బరాయన్‌గారే "బ్రిటిష్ సామ్రాజ్యం నశించుగాక!" అని యింతకంటె బిగ్గరగా కేకలువేసే పరిస్థితులు వస్తాయి.

ఎయిడెడ్ స్కూలు ఉపాధ్యాయులు తమ కష్టాలను తొలగించుకోవాలంటే, ఐకమత్యాన్ని యింకా వృద్ధి చేసుకొని, ఇతర పీడిత వర్గాల హక్కులకు సానుభూతిని వెల్లడిస్తూ, తమ హక్కులకై ధైర్యంగా పోరాడాలి.

ముస్లిం నాయకుల అసలుగుట్టు

కరాచీలో జరిగిన సింధు ముస్లిం మహాసభలో జిన్నా ఉపన్యసిస్తూ, 20 సంవత్సరాలనుంచి జెకోస్లొవేకియన్ ప్రభుత్వం క్రింద బాధలుపడి, చివరకు వేరుపడిన సూడెటన్లు ఏవిధంగా ఆత్మరక్షణకై కృషిచేశారో, అదే విధముగా ఇండియన్ ముస్లింలుకూడా ఎప్పటికైనా ఇండియా నుండి వేరై ఆసియాలోనే ఇతర మహమ్మదీయ జాతులలో కలిసిపోగలరని బ్రిటిష్ ప్రభుత్వాన్ని బెదరించాడు. ఆసమావేశంలోనే బెంగాల్ ప్రధాని ఫజ్లుల్‌హక్ ఉపన్యసిస్తూ, యీ విధంగా పలికాడు:—

"తాము జాతీయవాదులమని చెప్పకొనే ముస్లింలకు నేను యిచ్చే 'వార్నింగ్'ఏమంటే, ఇండియన్‌ముస్లింలు వారితో పోరుసల్పితీరుతారు. 8 సం॥రాల వయస్సుగల మహమ్మద్ బిన్‌కాసిమ్ తన 18 మంది సైనికులతో సింధురాష్ట్రాన్ని జయించగలిగినప్పుడు 9 కోట్ల మంది ముస్లింలు కలసి ఇండియాఅంతటినీ జయించితీరుతారు."

అమాయక ప్రజలలో యిట్టి మతావేశాలను రెచ్చగొట్టి, ప్రభుత్వాన్ని బెదరించి, జిన్నా, హక్‌వంటి ముస్లిం నాయకులు రాబోయే ఫెడరేషన్‌లో ఎక్కువ హక్కులు సంపాదించాలని ఈవిధంగా యెత్తులు వేస్తున్నారు. ఇదే వీరి అసలుగుట్టు!

దేవదాసు

శరత్ బాబు

విరచితం

పూర్వకథ

పార్వతీ దేవదాసులు చిన్ననాట నుండి స్నేహంగా పెరిగారు. రానురాను ఆ మైత్రి ప్రేమగా మారింది. కాని దేవదాసు తలిదండ్రుల తిరస్కరించలేక ఆమెను వివాహమాడడానికి సాహసించలేక పోయాడు. పార్వతిని రెండో పెండ్లివాడైన 40 సేండ్ల భువన చౌదరికిచ్చి పెళ్ళిచేశారు.

ఈపెళ్ళి పార్వతికి ఇష్టంలేదు. సంఘానికి వెరచి లోబడింది. దేవదాసు కూడా లోలోన కుమిలిపోతూనే వున్నాడు.

చదువుకోసం పోయిన దేవదాసుకు కలకత్తాలో చున్నీలాలతో స్నేహం కలుగుతుంది. దాని ఫలితంగా వేశ్య చంద్రముఖి పరిచయం కూడా కలుగుతుంది. చంద్రముఖి దేవదాసును ప్రేమిస్తుంది. కాని అతడామె నైచ్య జీవనాన్ని అసహ్యించుకుని తిరస్కరిస్తాడు.

పార్వతి కాపురానికి వెళ్ళింది. అత్తవారి భాగ్యానికి ఆశ్చర్యపడింది. భువన చౌదరి ప్రథమ కళత్రానికి మహేంద్రుడు వినోదలాల్ అనే యిరువురు కొడుకులు. యశోద అనే ఒక కూతురు వున్నారు. రెండో పెళ్ళిఅయినా భర్త మెప్పును పొంది పార్వతి సుఖంగా కాపురం చేస్తూంది.

కలకత్తాలో దేవదాసు త్రాగుడుకు అలవాటుపడ్డాడు. ఈ త్రాగుడును మాన్పించడానికి చంద్రముఖి చాల ప్రయత్నిస్తుంది.

దేవదాస్ తండ్రి నారాయణ ముఖర్జీ గతించాడు. తండ్రి మరణానంతరం అన్నదమ్ము లిద్దరూ — దేవదాసూ ద్విజదాసూ — ఆస్తిని పంచుకున్నారు.

ఈ ఆపత్సమయంలో దేవదాసు దగ్గరకు పోవడం ఉచితమని పార్వతి తలచింది. అత్తవారింటి నుండి పరుగెత్తుకు వచ్చింది. ఒకనాటి సాయంకాలం పరామర్శ చేయడానికి పార్వతి దేవదాసు వద్దకు పోయింది. సంభాషణలో చిన్ననాటి తమ మైత్రిని తలచుకొని విచారపడతారు.

ఎన్ని కష్టాలు వచ్చినా నీవు సాధార్యగా వుండి వుంటే నాకేమీ దిగులుండేది కాదు అని దేవదాసు అంటాడు. ఈ మాటలు పార్వతి గుండెలు బ్రద్దలుచేశాయి.

దేవదాసు పెళ్ళి చేసుకోడానికి "నీవంటి" పిల్లను వెదకి పెట్టమని పార్వతిని అడిగాడు. "నీవు నిజంగా పెళ్ళి చేసుకుంటావా దేవదా" అని పార్వతి అడిగింది. దేవదాసు [illegible] చేసుకుంటాడు.

పార్వతి తన్ను తాను సంబాళించుకొని "నీవు త్రాగుడు ఎందుకు అలవాటు చేసుకున్నా"వు అని ప్రశ్నిస్తుంది. ఆమెవద్ద దాచలేక దేవదాసు "నిజమేన"ని ఒప్పుకుంటాడు.

ఆ తరువాత

పార్వతి కొంచెంసేపు స్తబ్ధురాలై కూర్చున్నది. తర్వాత— "ఎన్ని వేలు పెట్టి నగలు చేయించి యిచ్చావు?" అని అడిగింది.

దేవదాసు నవ్వుతూ—"ఇంకా ఇవ్వలేదు. చేయించి అట్టేపెట్టాను: [illegible] కావాలా?" అన్నాడు.

పార్వతి చెయ్యి చాపి—"ఇవ్వు. నా వొంటిమీద ఒక్క నగకూడా లేదు." అన్నది.

"చౌదరి గారు ఇవ్వలేదా?"

"ఇచ్చారు. అవన్నీ వారి పెద్ద కూతురికి ఇచ్చాను."

"నీకు అవసరమే లేదా?"

పార్వతి తల అడ్డంగా తిప్పి ముఖం వంచుకున్నది. ఈమాటు నిజంగానే దేవదాసు కళ్ళలో నీళ్లతిరిగాయి. ఎంతో దుఃఖంలోతప్ప స్త్రీలు తమ ఒంటిమీది నగయితీసి ఇతర్ల కివ్వరని అతను గ్రహించాడు. కన్నీటిని అపుకుని- ఉత్తదేపారూ. నేను ఏస్త్రీనీ ప్రేమించలేదు. ఎవ్వరికీ నగ ఇవ్వలేదు." అన్నాడు దేవదాసు.

పార్వతి నిట్టూర్చి- "నాకూ అదే నమ్మకం." అని మనస్సులో అనుకున్నది. చాలాసేపు నిశ్శబ్దంగా ఉన్నారు. తర్వాత పార్వతి—"ఇక మద్యం తాగనని ప్రతిజ్ఞ చెయ్యి!" అని అన్నది.

"అది నావల్లకాదు. నువ్వు నన్ను ఒక్కమాటు కూడా తలచనని చేయగలవా?" అన్నాడు దేవదాసు.

పార్వతి మాట్లాడలేదు.

ఈసమయంలోనే పూజాగృహంలో సాయంకాలపు జేగంటా,శంఖ [illegible] వినిపించింది. దేవదాసు చకితుడై కిటికీలోనుంచి బయటకు చూసి— [illegible] పడుతూ ఉంది! ఇక ఇంటికి పో పారూ." అన్నాడు.

"నేను పోను. నువ్వు ప్రతిజ్ఞ చెయ్యి!"

"నేను చేయలేను."

"ఎందుకు చేయలేవు?"

"అందరూ అన్నిపనులూ చేయగలరా?"

"చేయదలచుకుంటే తప్పకుండా చేయగలరు."

"నువ్వు ఈ రాత్రికి నాతో లేచి రాగలవా?"

హఠాత్తుగా పార్వతి గుండె ఆగినట్టయింది. ఆమెకు తెలియకుండానే "అదెలా సంభవం!" అని ఆమె నోటినుంచి వెలువడింది.

దేవదాసు మంచం మీద కొంచెం జరిగి కూర్చుని—"తలుపు తియ్యి పారూ!" అన్నాడు.

పార్వతి లేచి తలుపుకు ఆనుకుని అడ్డుగా కూర్చుని—"ముందు ప్రతిజ్ఞ చేయి!" అన్నది.

దేవదాసు లేచి నిలబడి, ధీర భావంతో— "పారూ, బలవంతాన ప్రతిజ్ఞ చేయించటం మంచిదా? దానివల్ల ఏమన్నా లాభమున్నదా? ఇవ్వాళ చేసిన ప్రతిజ్ఞ రేపటికి ఉండదు. ఎందుకు నన్ను మిథ్యావాదిని కూడా చేస్తావు?" అన్నాడు.

తర్వాత చాలాసేపు నిశ్శబ్దంగానే గడచిపోయింది. గడియారం 'టంగ్, టంగ్' అని తొమ్మిది కొట్టింది. దేవదాసు వ్యాకులపాటుతో— "ఓ పారూ, తలుపు తెరవవే!" అన్నాడు.

పార్వతి జవాబివ్వలేదు.

"ఓ పారూ!"

"నేను యిక్కడనుంచి కదలను!"అని పార్వతి ఆవేగాన్ని అపుకోలేక అక్కడే పొర్ల నారంభించింది. ఆమె చాలాసేపటివరకు ఏడుస్తూనే ఉన్నది. గదిలో కారు చీకటి—ఏమీ కనపడటం లేదు. పార్వతి నేలమీద పడి ఏడుస్తున్నదని మాత్రం దేవదాసు వూహించి మెల్లగా— "పారూ!" అని పిలిచాడు.

"దేవదా, నాకు చాలా కష్టంగా ఉన్నది." అని పార్వతి ఏడుస్తూనే అన్నది.

దేవదాసు దగ్గరికి వచ్చాడు. అతని కంటా తడి ఉన్నది. కాని స్వరం మారలేదు—"ఆసంగతి నాకు తెలియదటే పారూ!" అన్నాడు.

"దేవదా, నేను చచ్చిపోతున్నాను. నీకు నే నెప్పుడూ సేవ చేయలేకపోయాను—నా ఆజన్మవాంఛ—"

"దానికీ సమయం వస్తుంది." అన్నాడు దేవదాసు ఆ చీకట్లో కళ్ల తుడుచుకుంటూ.

"అయితే నాదగ్గరకు రా. ఇక్కడ నిన్ను చూచేవారెవరూ లేరు."

"నీ ఇంటికి వస్తే బాగా చూస్తావా?"

"నాకు చిన్నప్పటినుంచీ ఉన్న కోరిక! నా యీ కోర్కె నెరవేర్చు భగవంతుడా! తర్వాత చచ్చిపోయినా నాకు దిగులు లేదు." అన్నది పార్వతి భగవంతుని ఉద్దేశించి.

ఈమాటు దేవదాసు కళ్ళనుంచి కూడా బొట బొట నీళ్ళు కారినవి.

"మా ఇంటికి రా, దేవదా!" అని పార్వతి మళ్ళీ అడిగింది.

దేవదాసు కళ్లు తుడుచుకుని—"సరే, అలాగే వస్తాను." అన్నాడు.

"నన్ను తాకి చెప్పు, వస్తావా?"

దేవదాసు ఆ చీకట్లో ఊహించి, పార్వతి పాదాలను అంటుకుని— "ఈమాట ఎప్పటికీ మరచిపోను. నా సేవ చేస్తే నీకు దుఃఖం తగ్గిపోయేటట్టయితే నేను తప్పక వస్తాను. చనిపోయే ముందు కూడా నా కీమాట తప్పక జ్ఞాపకం ఉంటుంది." అని అన్నాడు.

౧౩

తండ్రిచనిపోయిన తర్వాత దేవదాసు ఆరుమాసాలదాకా ఇల్లుకదలలేదు. అతనికి ఏకాంత జీవనం అంటే విసుగెత్తి పోయింది. సుఖం లేదు శాంతిలేదు. పైనఎప్పుడూ పార్వతి చింత. ఏపని చేద్దామన్నా పార్వతే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఇక అన్నద్విజదాసూ, భర్తగారి అడుగుజాడల్లో నడిచే వదినా, దేవదాసును ఇంకా విసిగించారు. అతని తల్లిస్థితి కూడా ఇలానే ఉన్నది. భర్తచావుతో ఆమె సుఖాలన్నీ తుడుచుకు పోయినవి. పరాధీనంగా ఈ ఇంట్లో ఉండటం ఆమెకు క్రమంగా అసహ్యం వేసి పోయింది. కొన్నాళ్ళనుంచి ఆమె కాశీ వెళ్ళాలని అనుకొంటోంది. దేవదాసుకు పెళ్ళి చేయకుండా ఎలావెళ్ళడమా అనే ఆగింది.—"పెళ్ళి చేసుకో దేవాదా! నేనుచూసి పోతా"నని "ఆమె చాలాసార్లు చెప్పింది కూడా. కాని దానికి ఒక ఇబ్బంది ఉన్నది. ఇంకా ఏటిసూతకం వెళ్ళలేదు. పైగా అతనికి నచ్చిన పిల్ల దొరకాలి. పార్వతిని ఎందుకు చేయక పోతినా; అని ఇప్పుడిప్పుడామె విచారిస్తూ ఉన్నది. ఒకనాడు దేవదాసును పిలిచి—"ఇక, ఇక్కడుండలేను దేవా! కొన్నాళ్ళపాటు కాశీ వెళ్తాను.' అని చెప్పింది.

దేవదాసు ఉద్దేశంకూడా ఇదే—"నేనుకూడా అదే చెప్పుదామనుకుంటున్నాను. ఈఆరు మాసాలుండి వస్తే సరిపోతుంది." అన్నాడు దేవదాసు.

"ఆఁ-అలాగేచేయి నాయనా! సాంవత్సరీకం అయ్యాక నీ పెళ్ళిచేసి, నీ సంసారం చూసి మళ్ళీ నిశ్చింతగా నేను కాశీ వెళ్తాను."

దేవదాసు తల్లిని కాశీలో వదిలిపెట్టి తాను కలకత్తా వచ్చాడు. కలకత్తా వచ్చి నాలుగైదు రోజులు చున్నీలాలు కోసం తిరిగాడు. అతను కనపడలేదు. బసమార్చి వేశాడట. ఒకనాటి సాయంత్రం దేవదాసుకు చంద్రముఖి జ్ఞాపకం వచ్చింది. ఒకమాటు చూడగూడదా? అనుకున్నాడు. ఇన్నాళ్ళనుంచీ ఆమె జ్ఞాపకమే రాలేదు. దేవదాసు కొంచెం సిగ్గుపడ్డాడు కూడా. బాడుగబండి మాట్లాడుకుని చంద్రముఖి ఇంటి ముందుకు వచ్చి ఆగాడు. చాలాసేపు కేకలు వేసిన మీద— "ఇక్కడ లేదు." అని ఎవరో ఆడ మనిషి జవాబిచ్చింది.

"చక్రపాణి"

అనువాదం

ఇంటి కెదురుగా లాంతరు స్థంభం ఉన్నది. దేవదాసు దాని దగ్గరకువచ్చి—"ఎక్కడికి వెళ్ళిందో చెప్పగలవా?" అని మళ్ళీ అడిగాడు.

ఇంట్లో ఉన్నమనిషి కిటికీ తలుపుతెరచి, కొంచెంసేపు అతని వంక నిదానించి చూసి "దేవదాసుగా?" అని అడిగింది.

"ఆఁ."

"ఆగు—తలుపు తెరుస్తాను." అనివచ్చి తలుపు తీసి "రండి"అని పిలిచింది. దేవదాసుకు గొంతు ఎరిగిన దానిలాగానే కనిపించింది. కాని గుర్తించలేకపోయాడు; పైగా చీకటి కూడా పడింది— "చంద్రముఖి ఎక్కడ ఉందో చెప్పగలవా?" అని అడిగాడు.

స్త్రీ మందహాసం చేస్తూ—"పైకి రండి చూపిస్తాను." అన్నది.

దేవదాసు ఈమాట గుర్తించి—"నీవా!" అన్నాడు.

"ఆఁ, నేనే. నన్ను బొత్తిగా మరచిపోయావా?"

దేవదాసు పైకి వచ్చాడు. చంద్రముఖి నల్ల కమ్ముల సాదా చీర కట్టుకుని ఉన్నది; చీరె మాసింది. చేతిలో గాజులు మాత్రం ఉన్నవి; ఇక ఒంటిమీద ఒక్క నగ కూడా లేదు. కొన్నాళ్ళనుంచి తల దువ్వుతున్న లక్షణాలేవీ ఆమెలో కనిపించలేదు. దేవదాసు విస్మయంతో—"నువ్వేనా!" అని తర్వాత పరీక్షగా చూశాడు. చంద్రముఖి వెనకటికంటే చాలా కృశించిపోయింది.

"నీ కేమైనా జబ్బు చేసిందా?" అని దేవదాసు అడిగాడు.

చంద్రముఖి నవ్వుతూ—"శారీరకంగా ఏమీ లేదు. మీరు కాస్త తీరికగా కూర్చోండి" అన్నది.

దేవదాసు మంచంమీద కూర్చున్నాడు. గది అంతా మారిపోయింది. యజమానురాలికి మల్లే దాని ముఖాన కూడా దౌర్భాగ్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కుర్చీలూ, టేబిలూ, అలమారీ—వగైరాలు పెట్టేచోట ఖాళీగా ఉన్నది. ఒక్క సామాను కూడా లేదు. మంచం మాత్రం ఉన్నది; దాని మీద పరచిన గుడ్డ కూడా మాసింది. గోడల మీద ఒక్క చిత్రం కూడా లేదు; ఇంకా మేకులు మాత్రం ఉన్నాయి. వాటికి కట్టిన ఎర్రత్రాళ్లు కూడా వేళ్లాడుతూనే ఉన్నాయి. గడియారం గోడనే ఉన్నది; కాని ఆడటం లేదు. దాని చుట్టూ సాలీళ్లు జాలరు అల్లినవి. గదిలో ఒక మూలను ఆముదం దీపం వెలుగుతూ ఉన్నది. దాని సహాయంతోటే దేవదాసు ఈ కొత్త అలంకరణ చూశాడు. అతనికి విస్మయంతో పాటు కొంచెం కోపం కూడా వచ్చింది.

"ఇలాంటి దుస్థితి ఎలా సంభవించింది, చంద్రా?" అని అడిగాడు.

చంద్రముఖి మ్లానంగా నవ్వి— "ఇది దుస్థితని ఎవరు చెప్పారు? నాభాగ్యం పండింది." అన్నది.

దేవదాసుకు ఏమీ అర్థం కాలేదు.— "నీ ఒంటిమీద నగలన్నీ ఏమయినై?" అని అడిగాడు.

"అమ్మేశాను"

"సామాను?"

"అదికూడా అమ్మాను."

"పటాలు కూడా అమ్మావా?"

చంద్రముఖి నవ్వుతూ, ఎదురుగా ఉన్న ఇల్లు చూపించి— "ఆ ఇంట్లో ఉండే క్షేత్రమణి కిచ్చాను." అన్నది.

దేవదాసు కొంచెంసేపు ఆమె ముఖంవంక చూసి— "చున్నీబాబు ఎక్కడ?" అన్నాడు.

"నాకు తెలియదు. రెండు మాసాల క్రిందట పోట్లాడి వెళ్ళిపోయాడు."

దేవదాసుకు ఇంకా ఆశ్చర్యం కలిగింది— "పోట్లాడటం ఎందుకు?" అన్నాడు.

"ఇక పోట్లాటలే రావా?"

"వస్తవి. కాని ఎందుకు వచ్చిందా అని?"

బేరం కుదర్చటానికి వస్తే వెళ్ళగొట్టాను.

"ఏమి బేరం?"

"పశువుల బేరం!" అని చంద్రముఖి నవ్వి— "మీకు అర్థం కాలేదా? ఒక షావుకారును పట్టుకువచ్చాడు. నెలకు రెండువందల రూపాయలు, వంటినిండా నగలు; కొసరు వాకిట్లో బంట్రోతు! తెలిసిందా?" అన్నది.

దేవదాసు అర్థం చేసుకొని— "ఏదీ, ఆ లక్షణాలేవీ కనపడవే?" అన్నాడు నవ్వుతూ.

"ఉంటే మీకు కనపడేవి. నేను వాళ్ళను వెళ్ళగొట్టాను."

"వాళ్ళ అపరాధం?"

"అంత గొప్పది కాదు. నాకే ఇష్టం లేకపోయింది."

దేవదాసు కాసేపు ఆలోచించి— "అప్పటి నుంచీ, ఇంకెవ్వరూ రాలేదా?" అని అడిగాడు.

"అప్పటిన్నుంచేం? మీరు వెళ్ళిన మర్నాటినుంచీ ఎవ్వరూ రాలేదు. చున్నీ మాత్రం ఎప్పుడన్నా వచ్చి కూర్చునేవాడు. రెండు మాసాలనుంచి అతను కూడా రావటం లేదు."

దేవదాసు మంచంమీద పండుకున్నాడు; కాసేపు అన్యమనస్కంగా ఉండి— "అయితే వ్యాపారమంతా ఎత్తేసినట్టేనా, చంద్రముఖీ?" అని అడిగాడు.

"ఆఁ— దివాలా తీసింది!"

"మరి నీ పొట్ట గడవటం ఎలా?"

"ఇంతకుముందే చెప్పానుగా, నగలమ్మానని."

"ఎన్ని రూపాయలొచ్చినై?"

"ఎక్కువ రాలేదు. ఏడెనిమిది వందలు వచ్చాయి. అవి ఒక షరాబు దగ్గర అట్టిపెట్టాను. నెలకు ఇరవై రూపాయలు చొప్పున ఇచ్చే ఏర్పాటు."

"ఇరవై రూపాయలతో వెనక నీకు గడిచేది కాదుగా"

"ఉహుఁ, ఇప్పుడూ గడవటం లేదు. మూడునెలల అద్దె కూడా బాకీ ఉన్నది. అందుకనే, చేతుల గాజులమ్మి ఎటన్నా వెళ్దామనుకుంటున్నాను."

"ఎక్కడికి వెళ్తావు?"

"ఇంకా స్థిరపరచుకోలేదు. ఏదన్నా పల్లెటూరు—ఇరవై రూపాయలతో గడిచే చోటుకి ఎక్కడికైనా."

"ఇన్నాళ్ళనుంచీ ఎందుకు వెళ్ళలేదు? నీ కేదో ప్రయోజనం లేకపోతే, ఇన్నాళ్ళనుంచీ వృధాగా అప్పెందుకు పెంచావు?"

చంద్రముఖి తల వంచుకుని ఆలోచనలో పడింది. ఆమె తన జీవితంలో మాట్లాడడానికి సిగ్గుపడటం ఇదే మొదటసారి.

"మాట్లాడవేం?" అన్నాడు దేవదాసు.

చంద్రముఖి మంచంమీద ఒకప్రక్కని ఒత్తుకు కూర్చుని మెల్లగా చెప్ప నారంభించింది:—"కోప్పడకండి. వెళ్ళేముందు మిమ్మల్ని ఒకమాటు చూసి పోదామని ఆగాను. మీరు తప్పక వస్తారనే నమ్మకం నాకున్నది. ఇవ్వాళ వచ్చారు. ఇక నేను రేపే వెళ్ళిపోవటానికి ప్రయత్నిస్తాను. ఎక్కడికి వెళ్తానో చెప్పమంటారా?"

దేవదాసు విస్మితుడై లేచి కూర్చున్నాడు:-"కేవలం చూడాలనేనా! ఎందుకు?"

"అ దొక ఖయ్యాళి. నేనంటే మీరు అసహ్యించుకుంటారు. ఇంతగా నన్నెవ్వరూ ఎప్పుడూ అసహ్యించుకోలేదు—బహుశా అందుకే ననుకుంటాను. ఆనాటి సంగతి మీ కిప్పుడు జ్ఞాపకమున్నదో లేదో తెలియదు, కాని నాకు బాగా జ్ఞాపకం ఉంది. మీరు మొట్టమొదట వచ్చిన రోజుననే నన్ను ఆకర్షించారు. మీరు ధనికుల బిడ్డలని కూడా నాకు తెలుసును. కాని మీ ధనం నన్నాకర్షించలేదు. మీకు పూర్వం ఇక్కడకు ఎంతోమంది వచ్చారు, పోయారు. కాని ఒక్కరిలో కూడా నాకు తేజస్సు కనిపించలేదు. మీరు రాగానే నన్ను గాయపరిచారు. నేను అనుకోని విధంగా, నాతో అతి మోటుగా వ్యవహరించి, [illegible] ముఖం తిప్పుకున్నారు. చివరకు తమాషాగా డబ్బు పారవేశారు—[illegible] మీకు జ్ఞాపకం ఉన్నాయా?"

దేవదాసు మాట్లాడలేదు. చంద్రముఖి మరల చెప్పనారంభించింది.

"అప్పటినుంచీ నేను మీమీద ఒక కన్నుంచాను; ప్రేమించీకాదు—ఆద్వేషించీ కాదు; ఒక చిత్రమైన వస్తువును చూస్తే మనకు ఎలా జ్ఞాపకం ఉంటుందో, అలానే, నేను మిమ్మల్ని మరచిపోలేక పోయాను, మీరు వస్తే నేను చాలా భయంతోను, జాగ్రత్తగానూ మెలగేదాన్ని. కాని [illegible] పోతే మాత్రం ఏమీ తోచేది కాదు. తర్వాత నా కేమి మతిభ్రమ వచ్చిందో తెలియదు—ఈకళ్ళతో ప్రతి విషయాన్నీ ప్రతి వస్తువునూ ఇంకో దృష్టితో చూడ నారంభించాను. నాలో ఉన్న పూర్వపు— 'నేను' పోయి [illegible] 'నేను' వచ్చింది. ఆతర్వాత మీరు తాగుడుకు అలవాటయ్యారు. మద్యమంటే నాకు తగని రోత; త్రాగుబోతును చూస్తే నాకు మండిపోయేది. అదేం ఖర్మమో మిమ్మల్ని చూస్తే నాకు కోపం వచ్చేది కాదు. తాపం వచ్చేది." అని చంద్రముఖి దేవదాసు కాళ్ళమీద చేతులు పెట్టి బొట బొట కన్నీళ్ళు కారుస్తూ— "నేను చాలా అధమురాలిని. నా తప్పులు లెఖ్ఖవేయకండి. [illegible]నంటే మీరు దూరంగా ఉండేవారు—తిట్టేవారు. చీదరించుకొనేవారు. కాని మీరు ఎంత చీదరించుకుంటే అంత దగ్గిరకు రావాలనుకునే దాన్ని. [illegible] మీరు నిద్రపోయాక—పోనీయండి. ఆసంగతి చెప్పితే మీకు కోపం వస్తుంది!" అన్నది.

దేవదాసు ఏమీ మాట్లాడలేదు. ఈ కొత్తరకం మాటలు అతనికి వేదన కలిగిస్తున్నాయి. చంద్రముఖి చాటుగా కళ్ల తుడుచుకుని మళ్ళీ చెప్పసాగింది:

'ఒక రోజున మీ రన్నారు జ్ఞాపకమున్నదా—మీరు ఎంత [illegible] సమూ, అత్యాచారమూ, ఉపద్రవమూ, తిరస్కారమూ సహిస్తారు [illegible] నుంచీ నాకు అభిమానం పుట్టుకొచ్చింది. ఈవృత్తి అంతే [illegible] వేసింది.

దేవదాసు లేచి కూర్చుని— 'మరి నీ పొట్ట గడిచేదె[illegible]' అడిగాడు.

కృష్ణా జిల్లా విద్యార్థి మహాసభ.

ద్వితీయ కృష్ణా జిల్లా విద్యార్థి మహాసభ [నవ]ంబరు 5, 6 తారీఖులలో గన్నవరంలో జరు[గు]ను. ఆంధ్రరాష్ట్రి విద్యార్థి సంఘ ప్రధాన [క]ార్యదర్శి బసవ పున్నయ్యగారు అధ్యక్షత [వ]హిస్తారు. ప్రారంభకులు గాను, ఉపన్యాస[కు]లు గాను చాలమంది విద్యార్థి నాయకులు; [క]ాలేజీ ప్రొఫెసర్లు ఆహ్వానింప బడిరి. అనేక [ము]ఖ్య విషయములు సభలో చర్చింపబడును. [ప్ర]తి విద్యార్థి సంఘము ముగ్గురు ప్రతినిధులను [ఎ]న్నుకొని పంపవచ్చును.

కార్యదర్శి.

* * *

విశాఖపట్నం జిల్లా విద్యార్థి సంఘం.

యీనెల 30 తేదీన విశాఖపట్నంలో జిల్లా [వి]ద్యార్థి మహాసభను జరుపవలెనని తలంచి[నా]ము. గనుక ఆయా జిల్లాలోని విద్యార్థి సోదరు[లం]దరు తమ ప్రతినిధులను ఎన్నుకొని సభను [జ]యప్రదముగా జరుప ప్రార్థన. స్థలము, కార్య[క్ర]మము తరువాత ప్రకటింపబడును.

వివరములకు యీ దిగువ విలాసమునకు [వ్రా]యవలెను.

జి. రామకోటేశ్వరరావు.

లేక

యమ్. వాసుదేవరావు.

మహారాజపేట (పోస్టు)

విశాఖపట్నం.

* * *

భీమవరం తాలూకా కాంగ్రెసు సంఘ [సా]ధారణ సమావేశము శ్రీ సాగి నారాయణ [రా]జుగారి అధ్యక్షతను సమావేశమై యీక్రింది [తీర్]మానములు గావించిరి.

[illegible] ఆజాయ వ్యయపట్టికను [...]చుచూ ఒక తీర్మానము, జిల్లాబోర్డు [...] కాంగ్రెసు అభ్యర్థుల విజయము[...] అన్ని ఫిర్కాలలోను వాలంటీర్ల శిబి[రాలు] ఏర్పరచుటకు ఒక కమిటీని నియమిస్తూ [ఒక] తీర్మానం, కాంగ్రెసు సభ్యులైన వారెవ్వ[రూ] కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేక ప్రచారం [చేయరాదనీ], కాంగ్రెసు విజయానికై తోడ్పడవలసి[నదని కోరు]చూ ఒక తీర్మానముమున్నూ. నర్సా[పురం తాలూ]కా కాళీపట్నం రైతుల పట్టుదలకు [...]త్యానికి, ధైర్య సాహసాలకు అభినం[దిస్తూ] తమ హక్కులకై చివరవరకు పోరాడ[వలసి]నదని రైతులను హెచ్చరిస్తూ, ఆతాలూకా [కాంగ్రె]సు సంఘంవారు అప్పటి రైతులలో దౌర్జ[న్యాన్ని] ప్రబోధిస్తున్నారని ఆంధ్రరాష్ట్రి కాం[గ్రెసు] సంఘాధ్యక్షులగు పట్టాభిగారు నిజ పరి[స్థితి]ని తెలుసుకొనక రిపోర్టు చేయుటకు చిం[తిస్తూ], సరియైన విచారణ చేయించుటకు ఒక [కమి]టీని ఏర్పాటు చేయవలసినదిగా కోరుతూ [ఒక] తీర్మానం, లంచగొండి తనము, గ్రామ [కాం]గ్రెసు సంఘ తగాదాలు విచారించుటకు ఒక్క [కమి]టీని ఏర్పాటుచేస్తూ తీర్మానించిరి.

* * *

[...]-10-38 తేదీ సాయంత్రం 3 గంటలకు [...]ద తాలూకా కాంగ్రెసు సంఘ కార్యవర్గం [...]వనమలూరు గ్రామంలో కిలారు గోపాల[...] వర్మగారి అధ్యక్షతను సమావేశమై [...] తీర్మానములు గావించిరి.

[...]ధమిక సభ్యులను విరివిగా చేర్పించ[...]కా సభ్యులను కోరుతూ,

[...]సంవత్సరం అతివృష్టివల్ల నష్టం [...] రిమిషన్ యిప్పించవలసిన [...]త్వమును కోరుచూ,

అదీ —ఇదీ —అన్నీ

3. సి. ఐ. డి. శాఖను ప్రజా సేవకుల వెంటాడుటను మాన్పించి, జమీందార్లు, మొఖా సాదార్లు, గవర్నమెంటు ఉద్యోగులు ప్రజలను పెట్టు బాధలను కనిపెట్టి రిపోర్టు చేయుటకు వినియోగించమనీ,

4. కాంగ్రెసులో బోగసు మెంబర్లను చేర్పు తున్నారనీ ఆ పద్ధతి పూర్తిగా మాన్పించాలనీ గాంధిగారు చెప్పుతున్నను, యీ జిల్లాలో కాం[గ్రె]సు స్వాములు జమీందార్ల తట్టుచేరి వారి డబ్బుతో తప్పుడు మెంబర్లను చేర్చుతున్నట్లు యాథిగా తెలుస్తోంది గాన వారి చర్య ఖండిస్తూ దీనిని గురించి తగు విచారణ చేయమని అ. భా. కాం. సంఘమువారిని విచారించమనీ,

5. ఉభయ కృష్ణా జిల్లా బోర్డులను రద్దుపరచి వెంటనే జనరల్ ఎన్నికలు జరిపించమని స్థానిక సంస్థల ప్రభుత్వమును కోరుచూ, బెజ వాడ బోర్డు ఆఫీసు గుమాస్తాలు ఎలిమెంటరీ పాఠశాలో పాధ్యాయులకు సరిగా జీతములు యివ్వక నానా బాధలు పెట్టుచున్నారు గాన వారిపై తగు చర్య తీసుకొనమని స్థానిక శాఖా ప్రభుత్వం వారిని కోరుతూ ఒక తీర్మానం, లిబరానూ(?) ప్రభుత్వం, ప్రజా ఉద్యమాన్ని అణచడానికి చేస్తున్న చర్యలను ఖండిస్తూ ఒక తీర్మానం,

వివిధ సంస్థానాధీశులను కూడ తీసుకొని ఫెడరేషనును అమలుజరుప జూచుచున్న సమయాన, ఫెడరేషనును నిర్మూలించుటకు ఎట్టి అనుమానాలకు తావుచేయందే కార్యక్రమాన్ని యివ్వవలసినదని అఖిల భారత కాంగ్రెసు వర్కింగు కమిటీని కోరుతూ ఒక తీర్మానం,

రాజన్ మంత్రిగారు ఆయుర్వేదము నందు చూపుతున్న నిరాదరణకు అసంతృప్తిని వెల్లడిస్తూ, ఆయుర్వేదాభి వృద్ధికి తగిన ప్రోత్సాహ మివ్వమని కోరుతూను,

ఋణ నివారణ చట్టం ద్వారా రైతులకు కొంత లాభం కలిగించుటకు యాభై లక్షల రూపాయలు మంజూరు చేసినందుకు మద్రాసు ప్రభుత్వాన్ని అభినందిస్తూ యింకా ఎక్కువ మొత్తమును మంజూరు చేయవలసినదనియు,

సత్యాగ్రహ రోజులలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగాలు యిచ్చిన ప్రభుత్వమును అభినందిస్తూ తీర్మానములు గావించబడెను.

* * *

కృష్ణాజిల్లా రైతు సంఘము, బెజవాడ.

గుడివాడ తాలూకా కవుతరం గ్రామములో ది 24-10-38 తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పైసంఘ కార్యనిర్వాహక వర్గ సమావేశమును, 2 గంటలకు సాధారణ సంఘసమావేశమును జరుగును. కాన సభ్యులెల్లరు విచ్చేయ కోరెదను.

కృష్ణాజిల్లా రైతాంగ విద్యాలయ ఉపసంఘము కూడ పై గ్రామములోనే పై తేదీనే సాయంత్రం 4 గంటలకు సమావేశమగును గాన అందరి సభ్యులెల్లరు హాజరు కాగోరెదను

బెజవాడ, 13-10-38. } సుంకర సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి.

పోలీసు లాకప్ లో యానాదిని కొట్టుట.

కోవూరు అల్లూరు పోలీసు సబ్ యినస్పెక్టరులు అలగానిపాడు గ్రామ కాపురస్థుడు పంచమూర్తి వెంకట సుబ్బయ్యని 31-8-38 తేదీ రాత్రి 8 గంటలకు అరెస్టుచేసి కోవూరు తీసుకొని వచ్చినారని, మార్గమందును, పోలీసు కొట్టులోను కొట్టినారని తెలిసి 1-9-38 తేదీ జామీను పిటీషన్ కోవూరు సబ్ మేజస్ట్రేటు గారి కోర్టులో పెట్టగా 3-9-38 తేదీ విడుదల చేస్తామని చెప్పి 8-9-38 తేదీ వరకు విడుదల చేయకుండా జరిపి 8 తేదీ సాయంత్రము 5½ గంటలకు విడిచిపెట్టారు.

3-9-38 తేదీ కోవూరు సబ్ మేజస్ట్రేటు కోర్టుకు జామీను యిచ్చు నిమిత్తము వచ్చి యున్న శ్రీ పు. పోలారెడ్డి, వాకాటి వెంకట రమణారెడ్డి గార్లను జామీను యిచ్చినచో గుమాని లిస్టులో పెట్టుతామని కోవూరు, అల్లూరు పోలీసు సబ్ యినస్పెక్టరు బెదరించిరి. ఈవిషయము నెల్లూరు జిల్లా పోలీసు సూపరింటెండెంటుగారికి అర్జీ మూలకముగా పై పోలారెడ్డి, వెంకటరమణారెడ్డిగార్లు తెలిపియున్నారు.

9—9—38 తేదీన పంచమూర్తి వెంకట సుబ్బయ్య నెల్లూరు జిల్లా సూపర్నెంటుగార్ని సమీపించి చెప్పుకోగా వారు దెబ్బలుచూచి స్టేటుమెంటు తీసుకొని బుచ్చిరెడ్డి పాళెము మకాముగోయున్న కావలి డిప్టీ మేజస్ట్రేటు వారి వద్దకు పోలీసు జవాను ద్వారా వెంకట సుబ్బయ్యను పంపిరి.

డిప్టీ మేజస్ట్రేటువారు వెంకట సుబ్బయ్యకు గల దెబ్బలుచూచి, స్టేటుమెంటు తీసుకొని బుచ్చిరెడ్డి పాళెం గవర్నమెంటు డాక్టరువద్ద సర్టిఫికేటు తీసుకొని, కొంతమందిని విచారించినట్లు తెలుస్తున్నది. ఇంతకన్న ఎక్కువేమీ చేయలేదు. కాంగ్రెసు హయాములో కూడ పోలీసుల అక్రమాలు ఈ విధంగా సాగుతూ ఉంటే, రాజాజీ పోలీసులను పొగడడము ఎంత ప్రమాదకరము!

పుచ్చలపల్లి సుందరయ్య.

. కోదేరు రేవు దౌర్జన్యం,

ఆచంట గ్రామమునకు మూడు మైళ్ళ దూరములో నున్న కోదేరు రేవు అమలాపురం రాజోలు తాలూకాల ప్రయాణీకులకు ముఖ్యమైన మార్గమై యున్నది. రహదారీ చాలా హెచ్చు, యీ రేవు దాటు ప్రయాణీకుల పడు కష్టాలు చెప్పనలవి కాదు. రేవు యిజారాదారు షెడ్యూల్డు రేటు మనిషికి 0-0-6 అయి ఉండగా 0-1-0 చొప్పున వసూలు చేయుచూ వరద రోజులలో 0-2-0 వసూలు చేయుచున్నారు. రేవు పడవలు రెండే వుంచి ప్రయివేటు నావలకు ప్రయాణీకులను పంపుటచే ప్రవేటు నావలకు 0-1-0 చార్జీ యివ్వవలసి వచ్చుచున్నది. రేవువద్ద షెడ్యూల్డు రేటు బోర్డు వుంచుట లేదు. రసీదులు యిచ్చుటలేదు. ప్రయాణీకులు రసీదులు అడిగిన, యివ్వక నిరాకరించి తిట్టుట, కొట్టుట జరుగుచున్నది. అదనపు రేటు యివ్వనివారి దుస్తులను లాగుకొనుట మొదలగు దౌర్జన్యము లనేకములు జరుగుచున్నవి.

ఈ పరిస్థితులు తాలూకా కాంగ్రెసు కమిటీ ద్వారా అధికారులకు నివేదించినను యింత వరకు ఏ చర్యయు జరుపలేదు.

ఈ విషయములో గ్రామస్థులు కూడ కొందరు పిటీషను పెట్టగా పెనుగొండ రేంజి లోకల్ఫండు ఓవర్సీయరుగారు 13-10-38 తేదీని విచారణకు రాగా అనేకమంది ప్రయాణీకులు యీ పై సంగతులను రుజువు పరచినారు. ప్రయాణీకుల సాక్ష్యములను ఓవరుసీరుగారు వ్రాసుకొన్నారు. రసీదు పుస్తకములు పరీక్షించగా ఈ నెల 1వ తేదీనుండి ఉన్నట్టున్ను, అవియైనను ఆరోజుననే చింపినట్టున్ను ధ్రువపడినది. అప్పటికి దాటిన ప్రయాణీకుల వద్దనైనను రసీదులు లేవు. రసీదులు యివ్వలేదు. షెడ్యూల్డు రేటు బోర్డు కట్టబడి యుండలేదు. ఓవర్సీరుగారు యివతలకు వచ్చిన తర్వాత కూడ 0-1-0 పుచ్చుకొన్నట్లు, రసీదులు యివ్వనట్టు రేవుదాటి వచ్చిన ప్రయాణీకులు చెప్పియున్నారు. అవికూడ వారు వ్రాసుకొన్నారు.

యిప్పటికీ యిట్టి దౌర్జన్యములు జరుగుచున్నవి. కాన వెంటనే యీ అన్యాయములను తొలగించుటకు తగు చర్య తీసుకొనవలసినదిగా స్థానిక శాఖవారిని కోరుచున్నాము.

ఇట్లు,

నెక్కలపూడి రామారావు.

జిల్లా బోర్డుల ఎన్నికలు

కాంగ్రెసు విజయమే ప్రజా విజయం

గుంటూరు సోషలిస్టులు సూచించిన కార్యక్రమం

ఆంధ్ర దేశమందలి 12 జిల్లాలలో పశ్చిమ గోదావరి, గుంటూరు, కర్నూలు, అనంతపురం కడప, చిత్తూరు జిల్లాలలో వచ్చేనెల 2, 3 వ వారాలలో జిల్లాబోర్డు ఎన్నికలు జరుగనున్నవి.

ఈ జిల్లా లన్నిటియందును జిల్లాబోర్డు ఎన్నికలలో కాంగ్రెసు పోటీ చేయుచున్నది.

అనంతపురం జిల్లాలో జిల్లా కాంగ్రెసు కమిటీ సమావేశమై, కాంగ్రెసు తరపున యం. యల్. ఏ., యం. యల్. సి. లు, లాయర్లు, కాంగ్రెసు సివిక్ బోర్డు మెంబర్లు, పూర్వపు జిల్లాబోర్డు మెంబర్లు వీరిని ఎవరినీ జిల్లాబోర్డుకు అభ్యర్థులుగా నిలుపరాదని తీర్మానించినది. అందుచే జిల్లాబోర్డులకు సుశిక్షిత కాంగ్రెసు యువజన వర్కర్లు అభ్యర్థులుగా నిలచిరి. మొత్తం 52 స్థానాలలో 37 గురు పోటీలేకుండ నెగ్గిరి.

కడప, చిత్తూరు జిల్లాలలో కూడ ఇంచుమించుగా ఇదే వాతావరణము ఏర్పడియున్నది.

పశ్చిమ గోదావరి జిల్లాలో జిల్లా సివిక్ బోర్డు తప్పటడుగు వేసింది. అనంతపురం జిల్లా కాంగ్రెసు కమిటీ నిర్ణయించినట్లు సరియైన కాంగ్రెసు సేవకులను మొదట్లో నిశ్చయించ లేదు.

అన్ని ఫిర్కాలలోను గ్రామాలవారీ ప్రజాభిప్రాయాన్ని కనుగొని, ఏ యే ఫిర్కాలలో ఎవరెవరుంటే బాగుంటుందో తాలూకా సంఘాలలో నిశ్చయించుకొని, మొత్తం అన్ని తాలూకాలను గురించి ఆ యా తాలూకా కాంగ్రెసు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు సమావేశమై, జిల్లా యందలి అన్ని తాలూకాల అభ్యర్థుల జాపితాను తయారుచేసి; జిల్లాసివిక్ బోర్డుకు సిఫార్సు చేసినవి. స్థానికంగా కాంగ్రెసు వాదులను, ప్రజలను విచారించమని కూడా కోరినవి. కాని యీ సూచనల నన్నిటిని జిల్లాసివిక్ బోర్డుత్రోసి రాజని దరఖాస్తులుపెట్టిన అభ్యర్థు లెవరిమట్టుకు వారు 5 గురు సాక్షులను తమ పలుకుబడిని తెలుపుటకు తెచ్చుకోమని ప్రకటించింది. ఆప్రకారంగానే అభ్యర్థుల నియామకం చేసింది. నిర్ణయింపబడిన అభ్యర్థులలో చాలవరకు నిన్న మొన్నటి వరకు కాంగ్రెసు వాదులను, కాంగ్రెసు సంస్థను తిట్టిపోసిన వారే గలరు.

జస్టిస్ పార్టీ నాయకుడగు చిట్టూరి యింద్రయ్యగారు కూడ కాంగ్రెసు అభ్యర్థిగా నియమింపబడిరి. కేవలం యీ జిల్లాబోర్డులలో మెంబర్లుగా ఎన్నుకోబడదామనే ఆశతోడనే కాంగ్రెసు మెంబర్లుగా చేరిన జస్టిసు పార్టీవారిని చాల మందిని జిల్లా సివిక్ బోర్డు నిశ్చయించినది.

ఈ నిర్ణయం, జిల్లాలోని కాంగ్రెసు వాదులందరిని ఉగ్రులను గావించినది. ప్రజా సామాన్యములో అసంతృప్తి ప్రబలినది. పిటిషన్లు, మెమోరాండములు, రాయబారాలు, రాష్ట్రి కాంగ్రెసు కమిటీపై వర్షింపసాగినవి. ఇంతేగాదు. జిల్లా సివిక్ బోర్డు యొక్క అసమంజస వైఖరిని ఖండిస్తూ సభలు, ప్రదర్శనాలు, తీర్మానాలు కూడా రాష్ట్రి కాంగ్రెసు కమిటీకి పంపబడినవి.

ప్రజా సామాన్యమందును, కాంగ్రెసు వర్కర్ల యందును చెలరేగిన ఈ అసంతృప్తి నిచూచి సివిక్ బోర్డు సభ్యులలో ఆవేదన హెచ్చినది. "జిల్లా బోర్డు అభ్యర్థుల నియామకం విషయమై సివిక్ బోర్డు ఎంతో లోపము జరిపి కాంగ్రెసు ప్రతిష్ఠ సన్నగిలుటకు దారి తీసినదని" సివిక్ బోర్డు సభ్యులందరు ఎవరిమట్టుకు వారు రాజీనామాలను రాష్ట్రి కాంగ్రెసు సంఘానికి పంపారు. జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగారు కూడా రాజీనామా నిచ్చిరి.

తరువాత, ఏలూరులో ఆంధ్ర రాష్ట్రి కాంగ్రెసు వర్కింగు కమిటీ సమావేశమై, జిల్లా సివిక్ బోర్డుకు వచ్చిన దరఖాస్తులన్నిటిని పరిశీలించి, సివిక్ బోర్డుచే నియమింపబడిన అభ్యర్థులను రద్దుచేసి, వారిస్థానే సరియగు కాంగ్రెసు వాదులను చాలవరకు నియమించినది కొత్తగా రాష్ట్రి కాంగ్రెసు సంఘముచే నియమింపబడిన వారిలో చాలామందిని, ఇదివరలో వేర్వేరు తాలూకా కాంగ్రెసు సంఘాలు సమావేశమై, జిల్లా సివిక్ బోర్డునకు సూచించి యుండినవి. మొత్తం 43 స్థానములలోనూ 13 స్థానములకు మాత్రమే పోటీలేకుండ కాంగ్రెసు పార్టీవారు ఎన్నుకొన బడిరి. మిగిలిన అన్ని స్థానాల లోనూ పోటీలు జరుగుచున్నవి.

కర్నూలు జిల్లాలో కూడా, జిల్లా సివిక్ బోర్డు లోపము చేసినది. ఇక్కడ పూర్తిగా జస్టిసు పార్టీవారిని కాకపోయినా కాంగ్రెసు వ్యతిరేకులను, కాంగ్రెసువాదులు కానివారిని జిల్లాబోర్డు సభ్యులుగా కాంగ్రెసు సివిక్ బోర్డు నిశ్చయించినది. ఈ చర్య పట్ల తమ అసమ్మతిని తెలుపుచూ వాటిని రద్దుచేయ వలసినదని జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్ష కార్యదర్శులతోసహా 11గురు కార్యనిర్వాహక వర్గసభ్యులు రాష్ట్రి కాంగ్రెసు సంఘ అధ్యక్షునకు జాబువ్రాసిరి. కాని, యీ జిల్లా విషయములో రాష్ట్రి కాంగ్రెసు కమిటీ వీరి అభిప్రాయాన్ని లెక్కించలేదు. దీని ఫలితంగా కాంగ్రెసువాదులే ఇండిపెండెంటు టిక్కట్టుమీద జిల్లాబోర్డు ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. కాంగ్రెసు సివిక్ బోర్డు అసందర్భపు పక్షులతో చేతులు కలిపి కాంగ్రెసు ప్రతిష్ఠను భగ్నము చేయుచుండుటను చూచి, ఇట్టి లోపాలను చేయవలదని కాంగ్రెసును మందలించుటకు వీరు పోటీ చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో కూడా 52 సీట్లకు 32 మంది కాంగ్రెసు అభ్యర్థులు పోటీలేకుండ ఎన్నుకొనబడిరి.

జిల్లాబోర్డు ఎన్నికలలో పాల్గొన వలదని మొదట జిల్లా కాంగ్రెసు కమిటీ తీర్మానించినది. ఇది చాలా అసందర్భమయినదనియు, జిల్లాబోర్డు ఎన్నికలలో పోటీచేసి తీరాలనియు ఏలూరులో సమావేశమయిన రాష్ట్రి కాంగ్రెసు వర్కింగు కమిటీ తీర్మానించి గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీకి ఫర్మానా యిచ్చినది. స్వయముగా రాష్ట్రి కాంగ్రెసు కమిటీయే అభ్యర్థులను నియమించినది.

గుంటూరు కాం॥ సో॥ పార్టీ సూచించిన

కార్యక్రమము.

1. మైనారిటీ తీరిన ప్రతి స్త్రీకి, ప్రతి పురుషునకు ఓటింగు హక్కు.

2. సంయుక్త నియోజక వర్గము.

3. ప్రతినిధులను తొలగించి తిరిగి ప్రతినిధులను ఎన్నుకొనే అధికారము ఓటర్లకే వుండాలి.

4(a) విద్యాశాఖకు సంబంధించిన, యింజనీరింగు శాఖకు సంబంధించిన అధికారులు డిస్ట్రిక్టు బోర్డు నిర్ణయాలకు, దాని అధికారానికి లోబడి ఉండవలెను.

(b) వీరి జీతములను, అలవెన్సులను నిర్ణయించటానికి డిస్ట్రిక్టు బోర్డుకు అధికారముండవలెను.

5. ట్రాఫిక్కు బోర్డును నియమించే పద్ధతిని రద్దుచేసి, మోటార్ల మీద లైసెన్సులను విధించే అధికారము డిస్ట్రిక్టు బోర్డుకు ఇవ్వాలి.

6(a) భూముల మీద విధించబడు డిస్ట్రిక్టు బోర్డు సెస్సు విషయంలో జిల్లా రివెన్యూ ఆఫీసరు సలహాదారునిగా నుండవలెను. దానిని నిర్ణయించే బాధ్యత డిస్ట్రిక్టు బోర్డు కుండాలి.

(b) లాండు రివిన్యూ వసూలుకు సంబంధించిన రసీదులలో గవర్నమెంటు శిస్తు ఎంతో డిస్ట్రిక్టు బోర్డు సెస్సు ఎంతో వేరు వేరు అయిటములుగా నుంచాలి.

(c) జిల్లా బోర్డులకు రాష్ట్రి ప్రభుత్వం వారు రికరింగు సబ్సిడీలను తప్పనిసరిగా యిస్తూ ఉండవలెను.

7. అభ్యర్థులు డిపాజిటు చేయవలసిన ద్రవ్యము రు. 30 కంటె మించకూడదు.

8. నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్య.

9. ప్రతి మూడేసి గ్రామాలకు ఒక్కొక్క రూరల్ డిస్పెన్సరీని ఏర్పాటు చేయవలెను.

10. పశు వైద్యశాలలు అథమం ప్రతి ఫిర్కాకు ఒక్కొక్కటి చొప్పున యేర్పాటు చేయవలెను.

11. ద్రవ్యసహాయ్యముతోటి రాత్రి పాఠశాలలను విరివిగా స్థాపించవలెను.

12. రోడ్ల మరమ్మతు విషయంలో ఇప్పటి మోస్తరుగా అక్కడ కొంతా యిక్కడ కొంతా కాకుండా ఒక తాలూకా అయిన తరువాత మరియొక తాలూకాలోని రోడ్లను తీసుకోవలెను. (మరీ పాడయిపోయిన ప్రాంతాలను ముందుగా తీసికొనవలెను.)

13. (a) డిస్ట్రిక్టు బోర్డు తరపున గ్రంథాలయాలను విరివిగా స్థాపించాలి.

(b) ప్రయివేటు లైబ్రరీలకు గ్రాంట్లను విరివిగా సప్లయి చెయ్యాలి

(c) గ్రంథాలయాలలో అభివృద్ధి కరమైన రాజకీయ సంబంధమైన సారసత్వమునకు సంబంధించిన గ్రంథములను ఉండనీయవలెను.

14. డిస్ట్రిక్టు బోర్డు రోడ్లమీద నుండు చెట్లను వేలంవేసే అధికారం ఓవరుసీర్లకు కాకుండా ఆచెట్టు యే గ్రామపంచాయితీ సరిహద్దుకు చెంది ఉంటుందో ఆ పంచాయితీలకు వదలవలెను.

15. జిల్లాబోర్డుకు సంబంధించిన స్థలాలను ప్రయివేటు లైబ్రరీలకు ఉచితంగా నీయవలెను.

16. డిస్ట్రిక్టు బోర్డు విద్యార్థులకిచ్చు స్టయిఫెండ్సును కేవలం బీదవిద్యార్థులకే యిచ్చుచుండవలెను.

17. సెకండరీ స్కూల్సులో టెక్నికల్ యెద్యుకేషను (వృత్తివిద్య)ను త్వరలో ప్రవేశపెట్టవలెను.

18. విద్యార్థు లిచ్చుకొను జీతాల విషయములో బీద విద్యార్థులందరికి అర్థ జీతము లుండాలి. బ్రాహ్మణేతర విద్యార్థులైన వారికే అర్థ జీతముల నిచ్చు పద్ధతిని పోగొట్టి, బీదవారైన వారికిచ్చు పద్ధతి అమల్లోకి వచ్చేట్టుగా రాష్ట్రి ప్రభుత్వాన్ని ఒత్తిడి చెయ్యాలి.

19. జిల్లాబోర్డు పాఠశాల లన్నిటిలోను అభివృద్ధి కరమైన (Progressive) జాతీయ సంబంధమైన గ్రంథాలను పెట్టవలెను.

20. ఎలిమెంటరీ పాఠశాలలోని టీచర్లకు స్టార్టింగు 25 రూపాయలతో నుండి 40 రూపాయలవరకు పెరుగవలెను. మాధ్యమిక పాఠశాలలో స్టార్టింగు 40 రూపాయల నుండి ఉండవలెను.

21. (a) హిందీ ఉపాధ్యాయులకు [...] సరిగా S. S. L. C. ప్యాసయి ఉండాలనే నియమాన్ని రాష్ట్రి ప్రభుత్వంవారు రద్దు చేయునట్లుగా జిల్లాబోర్డులు ఆందోళనచెయ్యాలి.

(b) వీరి జీతాలు 30 రూపాయల స్టార్టింగుతో నుండవలెను.

22. జిల్లా బోర్డులు నిరుద్యోగులుగా నుండెడి వారికి సహాయ్యంగా నిరుద్యోగ భీమా పద్ధతిని యేర్పాటు చేయవలెను. దీనికి రాష్ట్రి ప్రభుత్వము నుంచి అవసరమైన ఆర్థిక సహాయ్యమును జిల్లా బోర్డులు పొందవలెను.

23. కంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలి. కలెక్టివ్ బార్గెయినింగు పద్ధతి ద్వారా పనివారల సంఘాలతోటే ప్రత్యక్ష సంబంధాలను ఏర్పాటు చేసుకోవలెను.

24. గ్రామాభివృద్ధి కొరకు మాడల్ విలేజి పద్ధతిని జిల్లా బోర్డులు త్వరలో అన్ని ప్రాంతాల లోను అమలు జరుపవలెను.

25. బీదవారి యొక్క గృహ వసతికిగాను జిల్లా బోర్డులు తమ క్రింద నున్న భూములను ఉచితంగా వారికివ్వవలెను,

26. రోజుకు 8 గంటల పని,

27. నెలకు 20 రూపాయల వేతనం.

28. పనివారల సంఘాలను గుర్తించటం.

29. కమ్యూనిటీల ప్రకారం నియోజక వర్గాలను విభజించే పద్ధతిని రద్దు చేయించాలి.

ఈ కార్యక్రమమును అంగీకరించవలసినదని కోరుతున్నాం. స్థానిక సంస్థలలోని మన కాంగ్రెసు అభ్యర్థులు నెల నెలకు వారు నియోజక వర్గాల్లో కావించిన ప్రచారాన్ని గురించి రిపోర్టు జిల్లా కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గానికి, తమకు పంపేటట్లు రాష్ట్రి కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గంవారు వారిని నియమిస్తుండాలి.

కార్మిక సమస్యలు

(8 వ పేజీ తరువాయి)

ధూళియా

కాంగ్రెసువాల్ల సహకారము!

9వ తేదీ సాయంకాలం ధూళియా బట్టల మిల్లు కార్మికులు సమావేశమై మిల్లుల ఎదుట సత్యాగ్రహము ప్రారంభించుటకు తీర్మానించిరి. తదనంతరం ఖాందేష్ జిల్లాయందంతటను జనరల్ స్ట్రయికు జరుగును.

గత నెల సెప్టెంబరు 6వ తేదీని ధూళియా మిల్లు యజమానులు 54 కార్మికులను పనిలో నుండి తొలగించిరి. మిగిలిన స్త్రీ కార్మికులు ఎక్కువ పని చేయుటకు నిరాకరించిరి. ఇందుచే మిల్లు యజమానులు మిల్లును 6వ తేదీని మూసివేసిరి.

ఇందు విషయమై యజమానులతో రాయబారాలను జరిపి నూతన యంత్రాభివృద్ధిని ఆపు చేయుటకును, తీసివేయబడిన కార్మికులను పనిలో జేర్పించుటకును ప్రయత్నములు జరిగినవి. కలెక్టరుగారి ఎదుట ఉభయ పక్షాల వారికిని సంభాషణలు జరిగినవి. 54 మంది కార్మికులను పనిలోనుండి తొలగించుట అక్రమమని నిర్ణయించ బడినది.

వీరి నందరినీ పనిలో చేర్చుకొనుటకు మేనేజర్లు అంగీకరించిరి. కాని కంపెనీ డైరెక్టర్లు మాత్రము ఇందు కంగీకరించక మిగిలిన కార్మికుల నింకను యిబ్బంది పెట్టుట నారంభించిరి. ... అసిస్టెంటు లేబరు కమీషనరు గారు విచారించి కార్మికులదే న్యాయమని నిశ్చయమిచ్చెను. అయినను యజమానులు పట్టుదలను వదలలేదు.

కార్మికుల సత్యాగ్రహమును పాడుచేయుటకై అధికారులు 144 వ సెక్షను ప్రయోగించుటకు సిద్ధముగా నుండిరి. ధూళియా సిటీ కాంగ్రెసు కమిటీ, మునిసిపాలిటీలు కార్మికుల యెడల సానుభూతిని చూపుతూ తీర్మానములను గావించినవి. సానేగురుజీగారు (స్థానిక కాంగ్రెసు నాయకులు) కార్మికులలో నిలచి సత్యాగ్రహమును నడుపుటకు నిశ్చయించుకొనిరి.

కలకత్తా

8000 మంది కార్మికుల సమ్మె.

ప్రతి ఆదివారము సెలవు కావాలి. అని కలకత్తాలో ఆందోళన చేస్తున్న కార్మికులు 8,000 మంది అక్టోబరు 10 వ తేదీనుండి సమ్మెను ప్రారంభించిరి.

అహమ్మదాబాదు

జనరల్ స్ట్రయికు భయం.

అహమ్మదాబాదు మిల్లులలో కంట్రాక్టు పద్ధతిని తొలగించ వలసినదనియు, కార్మికుల జీతాలను ఎక్కువ చేయవలసిన దనియు, ఈ షరతులను 17 వ తేదీ లోపుగా నెరవేర్చకున్నచో 17 వ తేదీనుండి సమ్మె చేస్తామని మజూరీ కార్మిక సంఘం యజమానులకు నోటీసిచ్చింది.

కార్మికుల జీతములనుగురించి విచారించుటకై బొంబాయి ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన విచారణ కమిటీ నివేదికను చూచునంత వరకు ఏమేమియు మార్పులను చేయలేమని యజమానులు చెప్పారు. ఇందుపై అహమ్మదాబాదు మిల్లులలో జనరల్ స్ట్రయికు వచ్చునని యజమానులు భీతిల్లుచున్నారు.

మద్రాసు

యజమానులదే తప్పు

డయోసీషియన్ ప్రెస్సు తగాదా.

మద్రాసు డయోసీషియన్ ప్రెస్సు కార్మికుల సమ్మె సందర్భములో ఏర్పాటు చేయబడిన విచారణ కమిటీ తన తీర్పును చెప్పినది. "14 మే నెలలో అన్యాయంగా 10 మంది కార్మికులను ప్రెస్సులో నుండి తొలగించి యజమానులే తప్పుచేసి యుండిరి" దీనిని ప్రభుత్వం ప్రకటిస్తూ యీ తప్పును యజమానులు దిద్దుకొన వలసినదని యజమానులకు సూచన నిచ్చినది.

యీ తీర్పుపై యజమానులొక ప్రకటన చేసిరి. ప్రెస్సులో పదిమంది కార్మికులు అనవసర మగుటచే తాము వారిని పనిలో నుండి తీసివేసిరి మనియు, ఇందులో తమ తప్పేమియు లేదనియు విచారణ కమిటీ తీర్పు చెప్పినంత మాత్రమున తాము అన సరమైన కార్మికులను చేర్చుకొనుటకు యిష్టపడమనియు తెలుగ చేసియు యజమానులు ప్రకటన చేసిరి.

బెజవాడ

తోళ్ళ షాపు రాజీ

11 వ తేదీని తోళ్ళషాపు యజమానులతో తోళ్ళషాపు కార్మిక సంఘాధ్యక్షులయిన శ్రీ కె. వి. నారాయణరావు యం. యల్. ఏ. గారు మోజెసుగారు, ఏ వెంకటేశ్వర్లుగారు, షాపు యజమానులతో మాట్లాడి కార్మికులకు యజమానులకు రాజీ కుదిర్చిరి రాజీ షరతులు క్రిందటి వారం సవశక్తిలో ప్రకటింపబడినవి.

డాల్మియానగర్

సమ్మెదారుల అరెస్టు.

డాల్మియానగర్లో వాకీ పనివాళ్ళు తమకు జీతములు ఎక్కువ చేయవలసినదని స్థానిక అధికారులను కోరుచూ వచ్చిరి. యజమానులందుకు నిరాకరించుటచే సమ్మె ప్రారంభమయినది పాకీవాళ్ళు పికెటింగును కూడా ప్రారంభించిరి. అప్పుడే 18 మంది పికెటర్లను కార్మిక సంఘ అధ్యక్షుని అరెస్టుకూడా చేశారని 13 తేదీని పాట్నానుండి వార్త వచ్చినది.

కోయంబత్తూరు

మురుగన్ మిల్లు కార్మికుల సమ్మె.

కోయంబత్తూరు మురుగన్ మిల్లు యజమానులు యీ దిగువ విధముగా జిల్లా కలెక్టరు గారికి జాబువ్రాసిరి. "7వ తేదీలోగా జీతాలను తీసుకొనని కార్మికులకు నవంబరు 7వ తేదీ వరకు జీతాలు ఇవ్వబడవనియు, పనిలో వెంటనే వచ్చి చేరని కార్మికులకు సర్వీసు అంతయు రద్దు చేయబడి. క్రొత్తగా పనిలోనికి వచ్చినట్లుగానే పరిగణింప బడుననియు, అప్పుడు కూడ తమ ఇష్టము వచ్చిన వారినే పనిలోనికి తీసుకొందుమనియు యజమానులు కలెక్టరుగారికి జాబువ్రాసి పంపిరి.

సదరు తగాదాను పరిష్కారం చేయుటకు లేబరు కమీషనరు గారయిన శాంతి రామమూర్తిగారు కోయంబత్తూరు వెళ్లుచున్నారు.

గత కోయంబత్తూరు కార్మిక తగాదాల సందర్భంలో ఏర్పాటు చేయబడిన విచారణ కమిటీ వారు కొన్ని సూచనలను సదుపాయాలను పూర్వకంగా కోయంబత్తూరు మిల్లులకు లేబరు కమీషనరుగారు పంపిరి.

ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ తృతీయ మహాసభ

ఈ నెల 30 వ తేదీన

ఏలూరులో జరుగును.

అధ్యక్షులు :

ఆచార్య రంగాగారు

విద్యార్థి మహాసభ

(22 వ పేజీ తరువాయి)

యూనియన్లు ఉండి చురుకుగా పని చేయుచున్న చోట్ల organising committee సహాయము అవసరం లేకుండానే, వానివాని కష్టాలు, ఆయా ప్రదేశాల్లో ప్రచారం జరగటం, Authorities కి తెలియ జేయటం జరగవలెను.

పైన సూచించిన విషయాలన్నీ మహాసభ ముందే ఎందుకు జరగాలి?

సభ జయప్రదంగా జరగాలంటే, సభ యొక్క ముఖ్యోద్దేశం సాంతం ఆచరణలోకి తేవాలంటే, అవియన్ని ముక్కాలి అవసరం. విద్యార్థులలో చాలామంది, చాలాచోట్ల ఆంధ్రదేశ మంతటా విద్యార్థి సమ్మె (General Strike) వస్తేనే గాని ఈ కష్టవిముక్తి జరగదని తలుస్తున్నారు. ఈ అభిప్రాయంతో నేను కూడా ఏకీభవిస్తాను. కాబట్టే పై బాధ్యతలను ఇంతగా నొక్కి చెప్పటం జరిగింది. ఈ మహాసభ General Strike విషయము తీవ్రంగా ఆలోచించి, దాన్ని జయప్రదముగా జరపటానికి మార్గాలు విచారించాలని ఉంటుంది. ఇదే ప్రస్తుతం జరగబోయే మహాసభ యొక్క ముఖ్యోద్దేశమై ఉండాలి. జనరల్ స్ట్రయిక్ నినాదాన్ని ఈ కాన్ఫరెన్సు ఇచ్చి, ఇదివరకు సభలకు, ఇప్పటివానికి తేడా చూపించాలి. సంఘ నిర్మాణం, కష్టాలను authorities కు తెలియ జేయటం, విరివిగా ప్రచారం సాగించటం, ఇవన్నీ జనరల్ స్ట్రయిక్ కు తోడ్పడుతవి.. జనరల్ స్ట్రయిక్ మాట అట్లా ఉన్నాగానీ, పై సూచనలు, విద్యార్థి ఉద్యమానికి, బలమిస్తాయి. దేశ స్వాతంత్ర్య పోరాటానికి కూడా అభివృద్ధి పొందటానికి ఇదే ఉద్యమము తోడ్పడుతుంది.

కాన్ఫరెన్సునందు క్రిందటి సంవత్సరం చేసిన పనులు, చేయలేనివి, ఎంతవరకు విద్యార్థి ఉద్యమం అభివృద్ధి పొందింది, ఇవన్నీ చూచుకొని వాటిని ఆధారంగా గొని ముందు మార్గం వ్యక్తీకరణం జరగాలి.

ఆంధ్ర విద్యార్థుల సమస్యలకు, సమస్య నివారణోపాయం జరుగు ఉద్యమాలకు, ప్రచారము జరగటం లేదు. కొన్ని దిన పత్రికలు "హిందూ" మొదలైనవి విద్యార్థుల పట్ల విరోధ భావం వహించినవి. కొన్ని ముభావంగా ఊరుకొంటున్నవి, కనుక ఆం. రా. వి. ఫె. బులిటెన్ రెండు వారాల కొకటి ఇచ్చునట్లు తీర్మానం, ఆ తీర్మానాన్ని ఆచరణ నుంచటం, ఇవి జరగాలి. ఫెడరేషన్ యొక్క ఆర్థిక సమస్యను కూడా విచారించాలి.

విద్యార్థి సంఘ నిర్మాణం బలంగా జరగాలి!

జనరల్ స్ట్రయిక్ నినాదం ఇవ్వటానికి కాన్ఫరెన్సు సిద్ధం కావాలి!

విద్యార్థి సంఘాలకు జై!

స్వతంత్ర భారతకు జై!

గాంధి తత్వం

(7 వ పేజీ తరువాయి)

ప్రజాతంత్రమునకై, సంపూర్ణ స్వరాజ్యమునకై పోరాడుచూ నేల యీనినట్లుగా వృద్ధిచెందుచూ మన ప్రజా సేనలు పూర్తిగా గాంధి తత్వాన్ని విడవివైచినను, మహాత్ముని చిత్రములను మాత్రము విడువక పోరాటమును సాగించగలవు.

మహాత్ముడు రాజకీయ నాయకుడే గాడు. ప్రజలచే "మహాత్మా" అను పవిత్ర బిరుదమును పొందిన మత కర్తగా గూడా ప్రజలు భావించుకొనుచున్నారు. భారత జాతీయ పోరాటములో అభివృద్ధి కరమైన భవిష్యత్తుకు, విప్లవ శక్తుల కడ్డుతగిలే మందగింపు స్వభావమునకు గూడ గాంధి తత్వము ప్రాతినిధ్యము వహించు చున్నది. వెనుక భారతదేశము ఋషి సంతతికి పేరు పొందినది. ఈనాటి మన మహాత్ముడా ఋషి సత్తములలో ఆఖరివాడయి యుండనోపును. పూర్వకాలపు మహాఋషు లందరు సమాజములో తగాదా లేర్పడినచో వాటిని పరిష్కరించి ఎప్పుడూ పీడించే వర్గమునకు అనుకూలముగా నుండునట్లు చేసి, సమాజమందు ఎప్పటియట్లు శాంతిని నిలుపుటకే పనిచేసిరి.

భారతీయులు నిరాకరించే వారసత్వము

(Heritage)

సమాజము యొక్క పాత దశలో నుండి భారతజాతి ముందుకువచ్చి చాల కాలమైనది. మహాత్ముడీ క్రొత్త దశలో భారత జాతికి నాయకుడైనాడు. పీడించు వారికి పీడింపబడేవారికిని మధ్య శాంతిని నిలబెట్టు దినములు గతించినవి. రాజీ, (మైత్రి) అను దశ భారత జాతీయ పోరాటము నందు నశించినది. రాజీ (మైత్రి)ని ప్రేమ యనండి. వర్గ సామరస్య మనండి. లేక ధర్మకర్తృత్వ మనండి లేక దానికి మరి ఏ పేరు పెట్టినను సరే, రాజీని మాత్రము భారతీయులు నిరాకరింప నున్నారు. మహాత్ముడు భారత జాతీయోద్యమ నిర్మాత; సామ్రాజ్యవాద పీడనకు వ్యతిరేకముగా ప్రజా ప్రతిఘటనను ప్రారంభించిన మార్గ దర్శకుడు. ఆ మహాత్మునకు భారత జాతియంతయు ప్రణమిల్లుతుంది.

రైతులోకం

(9 వ పేజీ తరువాయి)

భూములను అక్రమించు కొంటున్నారు, దోపిళ్లు చేయమంటున్నారు, మొదలైన అపనిందలను ధనికులు రైతులపై మోపి, రైతులను అణచి వేయాలని ఆలోచన చేస్తున్నారు.

ఈ విషయాల్ని గురించి విచారణ చేయడానికి, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ సంయుక్త కార్యదర్శి, డి. యన్. వల్లభరావుగారు చదుము గ్రామానికి రహస్యంగా మదనపల్లి తాలూకా రైతు సంఘ కార్యదర్శితోను, మదనపల్లి కాంగ్రెసు అధ్యక్షుడు కె. నరసింహ రెడ్డిగారితోను పోయినారు.

గ్రామగ్రామాల నుంచీ వేలకొలది రైతులు, స్త్రీలు రైతుసభకు వచ్చారు. ఆసభను భగ్నం చేయాలని ధనికులు సంగీతము, వాయిద్యము, భాగవతము మొదలుపెట్టారు. "ఆచార్య రంగా పద్ధతి నశించుగాక" అని కేకలువేశారు. ఆనాటి సభలోనే రైతు నాయకులు ధనికులను గట్టిగా మందలించారు. "ఆస్తులను పంచిపెట్టుతామంటే వచ్చిన వారంతా చేతులు యెత్త" మన్నప్పుడు అంటే, ఒక్కరూ చేయి ఎత్తలేదు. "ఆస్తుల కొరకు గాక కష్టాలు పోవాలనే కోరికపైననే వచ్చిన వారు చేతులెత్త"మంటే అందరూ చేతులెత్తి నారు. దీనివల్ల రైతులు ఆస్థి పంచిపెట్టి దోపిడి చేయమంటున్నారు అనేపుకారు ధనికులే పుట్టించినారని స్పష్టమైనది.

మాటిమాటికీ "కొట్లాటలు జరుగుతాయి" అని బెదరిస్తున్నారు ధనికులు. కొట్లాటలు వస్తే అవి ధనికులవల్లనే కాని రైతులవల్ల కాదు. ఎందుకంటే అహింసనే రైతులు ఆరాధిస్తున్నారు.

రైతులు : కూలీలు.

అటు షాహుకార్లు, జమీందార్లు, అయ్యగార్లు ఏకమైతే ఇటు కూలీలు, రైతులు యేకమైనారు! విప్లవాన్ని సాధించటానికి కూలీ రైతుల ఐక్యత సాధ్యమవుతుందని ప్రపంచానికి వెల్లడి చేస్తున్నది చదుము రైతువుద్యమం.

రైతుల బావులను హరిజనులను త్రాగనిచ్చి నారు. వారి యిండ్లకు వీరు, వీరి యిండ్లకు వారు పోయినారు. కూలీల కనీసపు కోర్కెలను ఒప్పుకొన్నారు రైతులు. మాల మాదిగలు రైతుల కోరికపై గొడ్డు మాంసమును విడచినారు. వీనికి ముందంజ వేసింది గుంటుపల్లి రైతులు.

రైతులకు బలము లేకుండా చేయాలని అనేక విధాలగా బెదరిస్తున్నారు ధనికులు. కాని, అవసరమైతే రైతులు సత్యాగ్రహం చేయాలని తీర్మానించు కొన్నారు. భూస్వాములు దౌర్జన్యాలు చేస్తే వారు అవసరములేదని, వెంటనే ఆవూరు విడచి పెట్టుతామని నిశ్చయము చేసుకొన్నారు.

చదుము గ్రామం కూలీ, రైతు రాజ్యమును స్థాపించునో అనిపించు చున్నది. ఎక్కడ వినినా రైతు సంఘమునకు జై, ఆచార్య రంగాకు జై అనే శబ్దాలే. ఎవరుపాడినా రైతు పాటలే; రైతు భజనలే. ఇంతటి మహోన్నతమైన రైతువుద్యమము బయలుదేరి నందుకు సంతసము.

కాశీపట్నం గాథ

12-10-38 వ తేదీని పాలకొల్లులో సమావేశమైన నర్సాపురం తాలూకా కాంగ్రెసు కమిటీ యొక్క సాధారణ సమావేశంలో ఇతర తీర్మానాలతో బాటు యీ క్రింది తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించ బడింది:—

"ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులు డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు కాశీపట్నం జమీందారీ రైతు తగాదాను గూర్చి నిష్పాక్షికమగు విచారణ జరిగించుటగాని, అచ్చట పని చేయుచున్న కాంగ్రెసు ఉపసంఘమును గాని విచారించకయే యీ విషయమై మహాత్మ గాంధీగారికి అందజేసిన వార్తలు సత్యదూరమనియు, ఆధార రహితములనియు యీ సభ వారు ఖచ్చితముగా తెల్పుచున్నారు.



ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ పట్టాభి గారు

సరియైన విచారణ జరుపకుండా వ్రాసిన పట్టాభిగారి వ్రాతలను ఆధారము చేసుకొని హరిజన పత్రికలోని మహాత్ముని ప్రకటన దేశీయులందరిని తప్పుడు త్రోవలో పెట్టుటయే గాక, రైతులపై జరుపబడుచున్న సెక్యూరిటీ సెక్షనులను బలపరుచుటకు కూడా ప్రభుత్వము వారికి సహాయకారిగా నున్నదని యీ సభవారు అభిప్రాయపడుచూ, కాశీపట్నం జమీందారు రైతు తగాయిదాలో నర్సాపురం తాలూకా కాంగ్రెసు కమిటీవారు కలుగజేసుకొని నప్పటి నుండి ఈనాటి వరకు చేసిన కృషి సక్రమము, న్యాయము, దౌర్జన్యరహితముగా నున్నదని రైతు శ్రేయమే తన శ్రేయస్సని ప్రకటించుకొనుచున్న కాంగ్రెసు సూత్రములకు అనుగుణ్యముగా కాశీపట్నం ఉపసంఘము వారు పనిచేసిరని యీ కమిటీవారు తమ స్పష్టమైన అభిప్రాయము వెల్లడించు చున్నారు"

పశ్చిమ కృష్ణా కాంగ్రెసు నాయకులపై దాడి

కాశీపట్నం రైతుల ఆందోళనను గురించి గాంధీజీ యిచ్చిన స్టేటుమెంటుతో ధైర్యం తెచ్చుకొని, కాంగ్రెస్లోని స్వార్థపరులు, జమీందార్ల ఏజంట్లు అపర అహింసా దేవతలై పోయి, సోషలిస్టులపై దాడిని ప్రారంభించారు. వీరికి బొమ్మలూరు కంద్రికలో సోషలిస్టుల దౌర్జన్య ప్రబోధం కన్పిస్తోంది, గాంధిజీకి, రాష్ట్ర, జిల్లా, తాలూకా కాంగ్రెసు కమిటీలకు రిపోర్టులు వెళ్ళినాయి. ఎవరివద్ద నుండి? నూజివీడు తాలూకా కాంగ్రెసు సంఘ సంయుక్త కార్యదర్శి పదవినుండి విరమించుకొన్న పి. సి. రంగారావుగారి నుండి.

జమిందారీ ముఠాలున్నూ కాంగ్రెసులో స్వార్థపరులున్నూ పశ్చిమ కృష్ణా కాంగ్రెసు నాయకులపై దాడిని ప్రారంభించారు.

ఇంతకూ రంగారావుగారి ఆరోపణలేమిటి? "రైతు నాయకులగు పేట బాపయ్య ప్రభృతులు అహింసా సత్యములను విడనాడి, కాంగ్రెసు బురఖాతో రైతు సంఘ ప్రచారం చేస్తున్నారు; రైతులను దౌర్జన్యానికి పురిగొల్పుతున్నారు; పెద్ద జమీందార్లతో లాలోచీపై చిన్న జమీందార్లు, అగ్రహారం మొఖాసాదార్లు, మొదలైన వారిపై విరుచుకుపడుతున్నారు; రైతులకు అత్యాశలు కల్పిస్తున్నారు; జమీందార్ల భూముల్ని దౌర్జన్యంగా ఆక్రమించుకో మంటున్నారు" ఇట్టివే ఇంకాకొన్ని ఆరోపణలు. బొమ్మలూరు కంద్రిక రైతుల కిట్టి సలహానే పేట బాపయ్యగారిచ్చారట. బహిరంగంగా వీరవల్లి రైతు మహాసభలో తన్ను (రంగారావుగారు) దూషించి, రైతులను దౌర్జన్యంగా భూముల నాక్రమించుకో మన్నారట. ఇట్టి పేట బాపయ్య ప్రభుతుల్ని, పిడికిటి రామకోటయ్యగారు వగైరా నాయకు లనుకొనబడే వారు వెనుకవేసుకు వస్తున్నారట.

బాపయ్యగారు వగైరాలపై రంగారావు గారికి గల వ్యక్తిగత ద్వేషం వల్ల వారిపై ప్రతీకారేచ్ఛతో పట్టాభి, గాంధిజీల సహాయానికై అబద్ధపు కంప్లెయింట్లు సృష్టిస్తున్నారు.

నేటి ప॥ కృ॥ కాంగ్రెసు నాయకులు రైతు సంఘాభిమానులును; రైతు సంఘాధికారులు కూడాను. అగ్రహారం, ఈనాందారీ రైతులకు సహాయం జేస్తున్న మాటా వాస్తవమే. కాంగ్రెసు వాదులు చేయవలసిన పనే అది. కాని దౌర్జన్యాన్ని ప్రబోధించటం, జమీందార్లతో లాలోచీ పడటం రంగారావుగారి అభూతకల్పన. అగ్రహారందారుతో సమాధానం పడ్డ వారికి ప॥ కృ॥ కాంగ్రెసు నాయకులు జమీందార్లతో లాలోచీ పడ్డట్లు కాన్పించడంలో ఆశ్చర్యం లేదు. కామెర్లు వచ్చినవానికి ప్రపంచమంతా పచ్చగా కన్పిస్తుంది. మునగాల, ముక్త్యాల, గంపలగూడెం ఎస్టేట్లుచిన్నవా? ఆజమీందార్లతోలాలోచీపడ్డారా? చిట్టేల, మునగాలలో జమీందార్ల దుండగాలకు ప్రతిగా దౌర్జన్యాన్నిబోధించారా? ఇతర ఎస్టేట్లలో కూడా రైతు ఉద్యమాన్ని బలపర్చుట త్వరలోనే రంగారావుగారు చూడకపోరు.

ప॥ కృష్ణా కాంగ్రెసు నాయకుల అవినీతి వల్ల తాము తాలూకా కాంగ్రెసు సంఘ సభ్యత్వానికి రాజీనామా ఇస్తున్నారట! పాపము తాలూకా కాంగ్రెసు సంఘం ఏమిచేసింది వీరికి అలుక తెప్పించడానికి?

రాజీనామా నివ్వటం నిజంగా ఒక ఎత్తు; ఏమీ లేనిదే ఊరికే రాజీనామా విస్తాడా యని అమాయకులగు ప్రజలలో సందేహాలు కల్పించడానికి ఎత్తిన ఎత్తు.

ఈ ఎత్తులను గుర్తించాలని ప్రజలను కోరుతున్నాము. కాంగ్రెసులో ఉన్న రైతు సంఘాభిమానుల కెట్టి అడ్డంకులున్నాయో, ఎట్టి అపవాదులు వస్తున్నాయో గుర్తించాలి. రైతులకై పాటుబడుటే దౌర్జన్యమను వారు కాంగ్రెసులో ఉండుట, మంచిదేమో ఆలోచించాలి, తమ ప్రాంతాలలో కూడా రైతు శ్రేయస్సుకు వ్యతిరేకులగు వారు కాంగ్రెసులో వున్నారేమో పరిశీలించాలి.

కృష్ణాజిల్లా రైతాంగ విద్యాలయం

ఆచార్య రంగాగారు తమ నిడుబ్రోలు విద్యాలయమును యీ సంవత్సరము మూసివేసి కృ॥జిల్లా విద్యాలయమున ఒక వారం ... టకు అంగీకరించినారు. నవంబరు ... వ తేదీన విద్యాలయము ప్రారంభమై ఒక వారం ... జరుగును. కొలదిమంది యితర జిల్లా రైతు సేవకులను చేర్చుకొందురు. అక్టోబరు ... వ తేదీలోగా దరఖాస్తులు, దరఖాస్తు ... రు 5 లు వారికి జేరునట్లు పంపవలెను. రుసుములేని దరఖాస్తులు విచారింపబడవు.

లింగాల కరణంగారి హయాం.

నందిగామ తాలూకా లింగాల గ్రామములో అక్రమయిన ఆక్రమణలు శాస్త్రిగా వున్నట్లు కనుపించు తున్నాయి.

నెం. 147/2 గ్రామ కంఠములో వున్న బోలా రాజయ్యగారి కొట్టు ముందర మొరక, డబ్బారేకుల చూరు, పది సంవత్సరముల నుండీ యుంటూ వున్నప్పటికీ ఆక్రమణయని నోటీసు జారీ చేయించారు. అది నిజంగా ఆక్రమణ అయితే కరణంగారు యీ రోజుననే కండ్లు తెరవటానికి కారణమేమిటో!

డి. నెం. 71/1 మంద బయలనే ఖంతలో 1 సెంటు ఆక్రమణచేసి గొయ్యి తీసినట్లు నోటీసు జారీ చేయించారు. కరణంగారు. సదరు ప్రదేశములో గొయ్యి లేనేలేదని ... రైతులు చెప్పుతున్నారు.

జనగం నారాయణగారు బ్రాంచి కాలువ నుండి నీరు పెట్టుకొని య 1-92 సెంట్లు సాగు చేసుకుంటే మునియేరు మెయిన్ చానల్ నుండి నీరు పారించుకొన్నట్లు శిఖార్థపు నీటి పన్ను నోటీసు జారీ చేయించారు.

లింగాల గ్రామములో వున్న దొంకలు, పోరంబోకులు, గవర్నమెంటు వారి అనుమతి లేనిదే కొందరు మాల మాదిగలు దున్ని పైరులు వేశారు. కాని వాటినుంచి వచ్చే ఫలసాయము గవర్నమెంటు వారి సిస్టులకే చాలదు. కొంతమందిగవర్నమెంటు అధికారులు "దున్నుకోండి మీకు పట్టాలిప్పిస్తాము: ఎవరు దున్నుకో మన్నారని అడిగితే కాంగ్రెసోళ్లు దున్నుకోమన్నారు అని చెప్పండి అని ప్రోత్సహించుతున్నారు. ఇందువల్ల భూములకు, బీళ్ళకు రైతుల పశువులు, బండ్లు వెళ్ళుటకు వేరే మార్గంలేదు. బొలాల్లో శెనగకాయ ఇతరములకు తోలుకోటానికి వీలులేదు. రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒకవేళ ఆ దున్నినదొంకలలోనుండి తోలుకొని వెళ్ళితే హరిజనుల ప్రోత్సాహమువల్ల దౌర్జన్యానికి, కలహాలకు కారణ మవుతుందని ఊరుకొంటున్నారు.

ఈ విధంగా రైతులకు, కూలీలకు కక్ష పెట్టి తమాషా చూడడము ధర్మము గాదు. హరిజనులీ మోసాన్ని గ్రహించి, కండ్లుతెరిచి రైతులతో యేకమయ్యారంటే అధికార్లు తాము త్రవ్వుకొన్న గోతిలో తామే పడతారు.

జోస్ డయజ్ జీవిత చరిత్ర.

స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి.

జోస్ డయజ్ 11 వ ఏటనే, సెవిల్లీ నగరంలో ఒక రొట్టెల షాపులో పని చేస్తూండే వాడు. ప్రతిరోజూ పదిగంటలు పని చేసి, పనికి పోతూ వుండేవాడు. ఇలా ఎంతో కాలం కార్మికుడై, ఒక బాగున్న ఫ్యాక్టరీలో అతడు పని చేసేవాడు. సెట్టుబడిదార్ల కార్మికులను యిలా బాధించడాన్ని జోస్ డయజ్ చిన్నతనంలోనే కళ్ళార చూచేవాడు. త్వరలోనే ఆ బాధలు వీటాలు అతనిలో మొలకెత్తి ప్రారంభించాయి.

కార్మికోద్యమం

జోస్ డయజ్ 18 సంవత్సరాల నాటికే సెవిల్లీ రొట్టె పనివాండ్ల సంఘం యొక్క కార్యనిర్వాహక వర్గంలో సభ్యుడైనాడు. విప్లవోద్యమంలో అతడు పని విధానములు తెలుసుకోవడం ప్రారంభించాడు. అనేక సమ్మెలు, యువ విప్లవ వాద్యాలను అతడు ప్రోత్సాహం యిస్తూ వుండేవాడు. అతని కాలం కష్టాలు, పట్టుదల, నిరాడంబరత, పలువురి కార్మికుల్లో అభిమానం సంపాదించాయి. 1910-11 సంవత్సరాలలో "ఎంటి లూషియన్" జిల్లాలో జరిగిన సమ్మె పోరాటాలలో డయజ్ ప్రధాన పాత్ర వహించాడు. స్పెయిన్ దేశం అంతటిలోనూ అప్పటి పోరాటాలు ఎక్కువ ప్రధానమైనవి. ఈ పోరాటాల్లో కార్మికులు చూపిన ధైర్య సాహసాలు, మారాలోచన యిలాంటి ప్రాంతాల్లో యెక్కడా చూపించలేదు.

1920 తరువాత, సెవిల్లీకి చుట్టుపట్ల వున్న కార్మికులు అనేక దేశముంచి జనరల్ స్ట్రైయిక్ చేశారు. దాన్ని ప్రభుత్వం అణచుతున్న పనులలో పాలుపంచుకున్నది. డయజ్ అప్పుడు చూపించిన పట్టుదల, సహనం, ధైర్యసాహసాలు ప్రస్తావించదగినవి. సమ్మెకు నాయకత్వం వహించిన అనేకమంది కార్మికులను అంతా సెవిల్లీ నగరం నుంచి బహిష్కారం విధించారు. సమ్మెలో పట్టుబడ్డ వారి వీపులకై అతడు మాడ్రిడ్ వార్తలతోనూ సంబంధం పెట్టుకుని తిరిగేవాడు. ఇలాంటి తీవ్రపరిస్థితి వల్ల దేశం అంతటా జైళ్లు నిండిపోవడంతో పెట్టి ఆందోళన బయలుదేరింది. ఇది చూచి ప్రభుత్వం ఎవరికీ శిక్షలు గాక, యావజ్జీవ జైలుగాని, శిక్షకి ఎక్కువ కాలం జైలుగాని విధించలేదు. డయజ్ పట్టినపట్టు ఫలించింది. వెంటనే అతడు సెవిల్లీకి మరలిపోయి, కార్మిక సంఘాల నిర్మాణ సమస్యలకు తన కాలాన్ని వినియోగించ సాగాడు.

జైలు జీవితం.

స్పెయిన్ దేశము ప్రైమో-డి-రివేరా యొక్క సైనిక నియంతృత్వ పరిపాలన క్రిందికి వచ్చింది. జోస్ డయజ్ ఎన్నాళ్ళ కార్యాచరణకు పూను కొన్నాడు. జైళ్ళలో నిర్బంధింపబడుతున్న కార్మిక నాయకుల సహాయార్థమై అతడొక సంస్థను స్థాపించాడు. నియంతృత్వ పరిపాలనను తీవ్రంగా ఖండిస్తూ ప్రజలలో ప్రచారం చేశాడు.

మాడ్రిడ్ నగరంలో ఒకరోజు డయజ్ ఒక కార్మికుల రొట్టెల బుట్టను బజారుకి తీసుకుపోతూ, అమ్ముకొంటూ తిరుగుతున్నాడు. ... డయజ్. ప్రభుత్వ దృష్టిలో పడకుండా అతడి మారువేషంలో వుండవలసివచ్చిందని తెలుసు కుని చేసేపని తీర్మానించగా, సెవిల్లీ పోలీసు పట్టి ఆ దినంలో యీ విధంగా రొట్టెలు తయారుచేసి అమ్మేవాడు కాని, త్వరలోనే పోలీసులు ఇది గ్రహించి అతన్ని అరెస్టు చేశారు. జైల్లో ఉన్నప్పుడు విప్లవోద్యమం యొక్క రహస్యాలను చెప్పవలసిందని పోలీసులు యెంతో ప్రయత్నించి అతనిని హింసించారు. చంపుతాం అని బెదిరించారు. కొరడాలతో కొట్టారు. ఇతర విధాల చిత్రవధ చేశారు. కాని చెప్పలేదు. ఈ విధంగా డయజ్ 8 నెలలు జైలులో గడిపాడు. ఆరోగ్యం పూర్తిగా పాడై విడుదల చేయబడ్డాడు. కాని, విప్లవోద్యమంలో అతనికి పూర్వంకంటె ఉత్సాహం ఎక్కువైంది. అనేక కమ్యూనిస్టు గ్రంథాలు చదివాడు. ఆ గ్రంథాల సిద్ధాంతాల వంటి కమ్యూనిస్టు సిద్ధాంతమే మంచిదని గ్రహించాడు. సెవిల్లీలో వున్న కమ్యూనిస్టు ప్రముఖులతో చేరి, కమ్యూనిస్టు కార్యక్రమాన్ని అమలులో పెట్ట ప్రారంభించాడు. రాజకీయ ఖైదీల సహాయార్థం పని చేస్తున్న కమ్యూనిస్టు సహాయ సంఘంలో సభ్యుడుగా చేరాడు.

కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి.

ఇంతలో సెవిల్లీ కమ్యూనిస్టు పార్టీ కమిటీని పోలీసులు అరెస్టు చేశారు. కార్మికోద్యమం అల్లకల్లోలంగా వుంది. అప్పుడు, మాడ్రిడ్‌లో వుండే కమ్యూనిస్టు నాయకులు జోస్ డయజ్‌ను సెవిల్లీలో పార్టీ పునర్నిర్మాణానికి నియమించారు. కొంతకాలం తరువాత, రాష్ట్ర పార్టీ కాన్ఫరెన్సులో డయజ్ "ఎండల్యూషియా" జిల్లాకు పార్టీ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు.

స్పెయిన్‌లో, ముఖ్యముగా సెవిల్లీలో, సమ్మెలు, విప్లవోద్యమాలు, ప్రభుత్వ నిర్బంధ విధానం మితిమీరి పోతున్నాయి. అందుకే 1931 లో రివేరా ప్రభుత్వం, ఆ తరువాత ఏక రాజ్యాధిపత్యం కూలిపోయాయి.

డయజ్ కృషికి ఫలితంగా "ఎండల్యూషియన్" జిల్లా కమ్యూనిస్టు పార్టీ, స్పెయిన్ దేశం అంతటిలోనూ ఎక్కువ బలమైన శాఖగా తయారైంది. అతడు పెట్టుబడిదారుల అమానుషమైన దోపిడీ విధానాన్ని ఎదుర్కొనడమే కాకుండా పార్టీలో వున్న "బుల్లెరోస్" ముఠా యొక్క సెక్టేరియన్ వైఖరిని తీవ్రముగా ఖండించేవాడు. ఆ రోజుల్లో, "బుల్లెరోస్" ముఠా వారే పార్టీ నాయకత్వంలో వుండడంవల్ల ఇతని పని మరీ కష్టమయింది. కార్మిక వర్గానికి చెందిన వారిని పార్టీలో చేర్చుకోకుండా యీ ముఠావారు అనేక సాకులు చెప్పేవారు. అంతే కాదు. ఒకవైపు స్పెయిన్‌లో ఏక ఛత్రాధిపత్యం వహించి, రిపబ్లికన్ పరిపాలన అమల్లోకి రాబోయే సమయాన సామాన్య ప్రజలంతా "రిపబ్లికన్ పరిపాలన చిరస్థాయి అగుగాక!" అనే నినాదాన్ని మారుమోగిస్తోంటే, మరొక ప్రక్కనుంచి యీ ముఠావారు కమ్యూనిస్టు పార్టీ యాజమాన్యాన్ని "రిపబ్లికన్ పరిపాలన నశించు గాక!" అనే నినాదం యిచ్చారు.

ఈ సెక్టేరియన్ ధృక్పథంతో డయజ్ చాలా తీవ్రంగా పోరాడాడు. 1932 లో, సెవిల్లీలో జరిగిన పార్టీ కాంగ్రెసులో డయజ్ పక్షానికే జయం లభించింది. స్పెయిన్ దేశ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, డయజ్ పక్షం వారి చేతుల్లోకి వచ్చింది. కొత్త సెంట్రల్ కమిటీ ఎన్నుకోబడింది. డయజ్ స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శి అయినాడు. సెక్టేరియన్ పక్షరులన్నీ విడిచి పెట్టబడ్డాయి. ఇందువల్ల అనేకమంది తీవ్రవాదులు, తీవ్రవాద పార్టీలు కమ్యూనిస్టు పార్టీ వైపుకు ఆకర్షింపబడ్డారు.

డయజ్ చాకచక్యము

పార్టీ నిర్మాణ విధానంలో డయజ్ చూపిన చాకచక్యం ఇంతా, అంతాకాదు. పార్టీ సభ్యులతో అతడు ఎంతో దగ్గర సంబంధాన్ని కలిగి యుండేవాడు. చక్కని సూక్ష్మబుద్ధిగల వారిని పార్టీలో చేర్చుకొనేవాడు. ఎవరెవరు ఏయే పనులు చక్కగా నిర్వర్తించగలరో ఆలోచించి వారికి ఆ పనులే యిచ్చేవాడు. వారుచేసే పనిని జాగ్రత్తతో పరిశీలించేవాడు. ఏ సభ్యుడైనా తాను చేయలేనంత పని చేయవలసి యుంటే, త్వరగా అతన్ని యెక్కువ పని నుంచి తొలగించేవాడు. పార్టీ నాయకులను సూక్ష్మదృష్టితో కనిపెట్టేవాడు. కొత్త నాయకులను తయారు చేసేవాడు. కమ్యూనిస్టు పార్టీ అంటే, సర్వ



ఎంతపెద్ద ఎంటి పిల్లలను ఇప్పగించి యుద్ధానికి పోతున్న స్పానిష్ యువకుడు.

విధాలా కార్మిక వర్గానికి నాయకత్వం వహించ గలిగిన పార్టీగా డయజ్ చేశాడు. ప్రజా సామాన్యానికి, పార్టీకి ఎంతో దగ్గర సంబంధం వుండేలాగున అతడు కృషిచేశాడు.

డయజ్ నాయకత్వాన సెంట్రలు కమిటీ పూర్వపు సెక్టేరియన్ పోకడలు విడిచిపెట్టి, కార్మిక వర్గము యొక్క ఐక్యతకై తీవ్రంగా కృషిచేయ ప్రారంభించింది. సెప్టెంబరు 1934 లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ అసాధారణ సమావేశంలో, సోషలిస్టులచే స్థాపింపబడ్డ **Workers' Alliances** అనే సంస్థలలో పార్టీ సభ్యులు చేరి పనిచేయాలని తీర్మానించబడింది. ఎందువల్ల నంటే, ఈ సంస్థలు కార్మిక కర్షకుల ఐక్య సంఘటనను పోషించుతాయి. ఈ సమావేశంలోనే జోస్ డయజ్ ఉపన్యసిస్తూ ఈ విధంగా పలికాడు. "ఫాసిజమ్ (ఫేసిజమ్) ముందుకు రాకుండా నిరోధించాలంటే, కొద్ది రోజులలో ఎదుర్కొని గెలుపు."

ఇది చెప్పిన విధంగానే, కొద్ది రోజుల తరువాత, అక్టోబరు నెలలో ముగ్గురు ఫేసిస్టు మంత్రులతో కూడిన ప్రభుత్వం స్పెయిన్‌లో ఏర్పడింది. వెంటనే దేశం అంతటా కార్మికులు జనరల్ స్ట్రైయిక్ ప్రకటించింది. ప్రత్యక్ష పోరాటానికి దిగారు. "అస్టూరియస్" అనే ప్రాంతంలో ఈ సమ్మె పోరాటం తీవ్రరూపం దాల్చింది. కార్మికులు సాయుధ విప్లవానికి తయారయారు.

జూలై 1935, అక్టోబరు తిరుగుబాటులో పాల్గొన్న అనేకమంది కార్మికులను ప్రభుత్వం హింసించి, ఉద్యమాన్ని చాలావరకు అణచివేసింది. అయినప్పటికీ, కమ్యూనిస్టు పార్టీ యొక్క నాయకత్వంలో కార్మికులకు విశ్వాసం అణుమాత్రం తగ్గలేదు.

ఐక్య సంఘటన.

అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభకు స్పెయిన్ తరఫున వెళ్ళిన ప్రతినిధులకు డయజ్ నాయకుడు.

సమావేశానంతరం ఇతడు ఐక్య సంఘటన పొంది, ఫేసిస్టు వెనుకబాటు పారద్రోలడానికి ఫేసిస్టు ప్రతికూల పార్టీలన్నీ కలిసి పోరాడవలసిన అగత్యాన్ని గురించి విరివిగా ప్రచారం చేశాడు. అప్పటికి స్పెయిన్‌లో పరిపాలిస్తున్న ఫేసిస్టు ప్రభుత్వాన్ని కార్మికులందరూ, ప్రత్యక్ష పోరాటం ద్వారా కూలద్రోయాలని ప్రబోధించాడు.

స్పెయిన్‌లో ఫేసిస్టు ప్రతికూల ఐక్య సంఘటనను నిర్మించుటకు డయజ్ ఎన్నో అవస్థలు పడవలసి వచ్చింది. మాటిమాటికి కొత్త కష్టములు, కొత్త తగవులాటలు, కొత్త ఎత్తులు — వీటిని ఎదుర్కొనవలసి వచ్చింది. గాని, ఎన్ని అంతరాయము లున్నప్పటికీ, ఫేసిస్టు ఎదుర్కోవాలంటే ఐక్య సంఘటన ఒక్కటే మార్గం కాబట్టి, పార్టీ కార్యదర్శిగా డయజ్ యిందుకై ఎన్నో కష్టాలు పడ్డాడు.

ఇతని కృషికి ఫలితంగా స్పెయిన్ ప్రభుత్వము కొత్త ఎన్నికలు ప్రకటించింది. ఫిబ్రవరి 1936 లో జరిగిన ఎన్నికలలో పాప్యులర్ ఫ్రంటు (ప్రజా ఐక్య సంఘటన) పార్టీలకు మెజారిటీ వచ్చింది. ప్రజా ఉద్యమం ఫలించింది.

కాని, ఫేసిస్టు వెనుకబాటు స్పెయిన్ నుంచి తరిమివేయ బడిందని డయజ్ నమ్మలేదు. జూన్ 1, 1936 అతడు ఈ విధంగా వ్రాశాడు: "ఫేసిస్టులను, యితర అభివృద్ధి విరోధకులను కొత్త ప్రభుత్వం ఒక విధంగా ప్రోత్సహిస్తోంది. అట్టివారిపై తీవ్రమైన చర్య తీసుకోవాలి. విప్లవ ప్రతిపక్షులు మళ్ళీ తలయెత్తకుండా ప్రభుత్వం పూర్తిగా అణచివేయాలి. ప్రజా ప్రభుత్వానికి అనుమానాస్పదులనందరినీ ఐక్య పదవుల నుండి తొలగించాలి. ప్రభుత్వం నేటి కమ్యూనిస్టు సైన్యాధికారుల్నీ, ఫేసిస్టు న్యాయాధికారుల్నీ, ప్రజా వ్యతిరేకులను ప్రభుత్వ పదవుల్నీ వారి వారి స్థానాల నుంచి తొలగించాలి. ఎందువల్లనంటే ఫ్రాంకోవంటి ఏక రాజ్యాధిపత్యం వహించడం అవమానకరమైన విషయం. అట్టి వారిందరినీ ప్రభుత్వం వెంటనే డిస్మిసు చేయాలి. 1931 లో మనం చేసిన పొరపాట్లు దిద్దుకోవాలి."

ఫేసిస్టుల తిరుగుబాటు.

కాని, రిపబ్లికన్ ప్రభుత్వం ధైర్యం చూపలేక పోయింది. ప్రజల విప్లవశక్తిని చూచి భయపడింది. వారి యుత్సాహసాహసం ప్రవర్తించలేకపోయింది. ఫేసిస్టులంటే గతాగత వణకు నాటించింది. వారికి మిలిటరీలోను ఇతర ప్రభుత్వ శాఖలలోను పెద్దపెద్ద ఉద్యోగాలిచ్చి రాజ్యాధికారం సంపత్తి పరచింది.

జూలై 18, 1936 దేశములో ఫేసిస్టులు తిరుగుబాటు చేశారు. అప్పటినుంచి నేటివరకూ జోస్ డయజ్, ఒక్క నిమిషమైనా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నాడు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన అసంఖ్యాకమైన కార్మికులు ఫ్రాంకో సైన్యాలతో హోరాహోరిగా యుద్ధం చేస్తున్నారు. ప్రతి యుద్ధరంగంలోను కమ్యూనిస్టులే ముందంజ వేస్తున్నారు. డయజ్ తుపాకి చేబట్టి స్వయంగా యుద్ధం చేస్తాడు. రోజురోజుకు వృద్ధి చెందుతూన్న కమ్యూనిస్టు పార్టీని ఎంతో చాకచక్యంతో సంఘటన పరుస్తాడు.

నవంబరు మాసం వచ్చింది. మాడ్రిడ్ గేట్ల యెదుట శత్రు సైన్యాలు నిలిచివున్నాయి. వెంటనే కమ్యూనిస్టు పార్టీ సభ్యులు నగరవాసులందరినీ యుద్ధరంగంలో చేర్చారు. శత్రు సైన్యాలను మారంగా తరిమివేశారు. డయజ్, తోటి కార్మికులతో పాటుగునపం తీసుకొని సైన్యాలను కోటలు కట్టేవాడు. ప్రతి రోజూ యుద్ధభూమికి వచ్చి, విప్లవ సైనికుల్ని పుర్సాహపరిచే వాడు.

1936 డిసెంబరు 1 వ తేదీని జోస్ డయజ్ స్పెయిన్ పార్లమెంటు సభలో యీ విధంగా ఉపన్యసించాడు.

"మన దేశంలోవున్న అంగబలాన్నీ ఆయుధ బలాన్నీ, ఆహార పదార్థాలను కేంద్రీకరిస్తేనే గాని మనం ఈ యుద్ధంలో గెలువలేము. గట్టిదైనట్టి, ఐక్యతతో కూడినట్టి, మంచి శిక్షణ గలిగినట్టి ఏకైక నాయకత్వం మీద కూడా మన విజయం ఆధారపడి యుంటుంది. ఒకే విధానాన్ని ఆచరణలో పెట్టే సైన్యాధిపతులు, ఐకమత్యంతోను, శిక్షణతోను కూడిన సైనిక దళాలు అత్యవసరం. ప్రజలందరికీ సరిపోయే ఆయుధాలు, ఆహార పదార్థాలు ఉత్పత్తి చేయడానికి మన నాయకత్వం దేశం అంతటికీ ఒక జాతీయోత్పత్తి విధానం అనుసరించాలి. స్థానిక అవసరాలను తీర్చడం మాత్రమే ప్రభుత్వ కర్తవ్యంగా ఉండకూడదు. అన్ని యుద్ధరంగాలలోను సైనికులకు ఏయే సరకులు ఎంతెంత అవసరమో అంచనావేసి, ఆ అంచనా ప్రకారం ఉత్పత్తి చేయించాలి. శత్రు సైన్యాలను మనం ఓడించాలంటే ఫ్యాక్టరీలలో కార్మికులందరూ ఎడతెగకుండా పనిచేసి సరుకులను ఉత్పత్తిచేయాలి. పనిచేసే గంటల నిర్ణయమంటూ ఉండకూడదు. యుద్ధంలో మనం గెలువకపోతే, మనంచెప్పే సిద్ధాంతాలన్నీ వ్యర్థమైపోతాయి. ఫేసిస్టు కిరాతకులు దేశాన్ని ధ్వంసం చేస్తారు. కాబట్టి, కమ్యూనిస్టులమైన మేము మాయొక్క ఆదర్శాలనుగాని, కార్యక్రమాన్నిగాని విడిచిపెట్టకుండానే, యీ విధంగా చెపుతాం: నేడు స్పెయిన్ దేశపు ప్రజలందరికీ ఒకే కార్యక్రమం, ఒకే ఆలోచన, ఒకే ఆదర్శం ఉండాలి. అదే, యుద్ధంలో జయం పొందడం.

ఫేసిస్టు రక్త పిశాచులను దేశంనుంచి తరిమివేయాలంటే, శిక్షణ కలిగిన సైనిక దళం, దానికి ఒక ఏకైక నాయకత్వం, వెనుక రిజర్వు దళాలు, సైన్యం నుంచి దేశద్రోహులను తొలగించుట, ట్రాట్స్కీ అనుచరులతో గూడిన దళాలను భగ్నం చేయుట, ఆయుధ



సంసారం విడచి ప్రచారకులను పరుగిడుచున్న స్పానిష్ యువతి

నిర్మాణ పరిశ్రమను వృద్ధిచేయుట, రైతులకు సహాయం, సమిష్టి వ్యవసాయ పద్ధతి బలవంతంగా ప్రవేశ పెట్టబడకుండా చూడ్డం; రైతుల భూముల్ని లాగుకొనే వారిని శిక్షించడం, కార్మిక వర్గాని కంతటికీ ఒకే ఒక రాజకీయ పార్టీ, ఐక్య సంఘటన విధానం. — యివి అత్యవసరమని నిరూపిస్తూ జోస్ డయజ్ శాసన సభలోనూ, బయటా తీవ్రమైన ప్రచారం సాగించాడు. ఈ ఆశయాలు నెరవేరేలాగున పట్టుదలతో పనిచేశాడు.

నవంబరు 1937.

మళ్ళీ నవంబరు మాసం వచ్చింది. మాడ్రిడ్ నగరంతో ముట్టడుకాని ఆ నరం బతు రోజులు గడచి ఒక సంవత్సరం అయింది. ఈ సంవత్సరములో కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యుద్ధరంగంలోను, బయట చేసిన పని ప్రశంస శక్యంకాదు. నిత్యమూ జరిపిన ఈ పోరాటంలో పార్టీ యొక్క బలం అనేక రెట్లు వృద్ధి చెందింది. శిక్షణతో గూడిన అనేక కొత్త శాఖలు స్థాపించబడ్డాయి. జోస్ డయజ్ యొక్క యెడతెగని తీవ్ర కృషియే దీనికి కారణం అని చెప్పవచ్చు.

నవంబరు మొదటి రోజుల్లో ఫేసిస్టు ప్రతికూల శక్తులను శత్రువులు కొంతవరకు బలహీన పరచ గలిగారు. దీనికి కారణం యేమనగా, ప్రజా సామాన్యంలోను, కార్మిక వర్గంలోను ఎక్కువ విశ్వాసం లేని కొంతమంది దుర్బలమైన ఫేసిస్టు ప్రతికూల శక్తులలో కొందరు గందరగోళాన్ని కలిగించారు. శత్రువుతో రాజీ పడుటకు ప్రయత్నాలు జరుగుతూన్నవని చాలాచోట్ల గాలివార్తలు పుట్టించారు. కమ్యూనిస్టు పార్టీ సెంట్రలు కమిటీ సమావేశంలో ఇట్టి యెత్తుగడలను ఖండిస్తూ జోస్ డయజ్ ఈ విధంగా ఉపన్యసించాడు.

"మనము చాలా జాగరూకతతో, మెలకువగా ప్రవర్తించాలి. అనేక కఠిన ప్రయత్నాలను నేడు మనం యెదుర్కోవలసి యున్నది. మన పార్టీ యొక్క స్థానం, అనగా స్పెయిన్ దేశపు ప్రజలందరి యొక్క స్థానం, స్పష్టంగా ప్రకటించవలసి వున్నది. మన దేశంలో దోపిడీగాండ్ర సైనికుడు ఒక్కడున్నప్పటికీ శాంతి అనేది వుండదు. దేశ ద్రోహులైన సైన్యాధికారులతో గాని రాజీ అసంభవం. విదేశ సైన్యాలను పారద్రోలడం, ఫ్రాంకోను ఓడించడం ఫేసిజాన్ని నాశనం చేయడం, ఇవే మన సంధి షరతులు.

"దేశంలో నేడు ట్రాట్స్కీవాదులు చేస్తూన్న పని యేమో చూద్దాం. ఫేసిస్టు ప్రతికూల ఐక్యతను ధ్వంసం చేయడం, కార్మికులలో అధైర్యం పుట్టించడం, శత్రువులకు గూఢచారులుగా వుపయోగ పడ్డం. — ఇది వీరు చేస్తూన్న పని. ఫ్రాంకోతో ట్రాట్స్కీవాదులకు గల సంబంధం, P. O. U. M. సంఘం వారు స్పెయిన్ ప్రజలను తెప్పగొట్టే ప్రయత్నాలు, ఇవి నిరూపించడానికి పోలీసులు కనుగొన్న కాగితాలు మొదలైనవి చాలును. ...వారు నివసించే స్థలాలలోను వారి నాయకుల వద్దను పోలీసులు పట్టుకొన్న కాగితాలలో సాంకేతిక భాష వివిధ దేశాల చిత్రాలు, ప్రత్యుత్తరాలు చూస్తే; పాప్యులర్ ఫ్రంటు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి వీరు చేసే ప్రయత్నాలు స్పష్ట మవుతాయి. యీ ద్రోహుల యెడల దయ చూపకూడదు..... వీరందరూ కలసి పని చేస్తూంటే మనమందరం కలిసి వీరిని పడగొట్టాలి. ఇందుకై మనం అవలంబించ వలసిన విధానం ఒక్కటే, అదే శిక్షణతో కూడిన, ఎడతెగని, ఐక్య సంఘటన విధానం. దీని ప్రకారం మనం చేయవలసిన పనులు రెండు: 1. పీడిత ప్రజా సామాన్యం యొక్క కష్టాలను తొలగించడానికి తీవ్రంగా పార్టీ మెంబర్లు కృషిచేస్తూ ఫేసిజాన్ని యుద్ధరంగంలో జరుపుతూన్న పోరాటాన్ని నడిపించడం. 2. ఫేసిస్టు వ్యతిరేక శక్తుల ఐక్యతకు భంగం కలిగించే యేపనినీ చేయకుండా వుండడం."

ఈ నవంబరు సమావేశం జరిగిన తరువాత పార్టీ మెంబర్లు పై విధానాన్ని శ్రద్ధతో ఆచరణలో పెట్టారు. దీనికి ఫలితంగా రాజీవార్తలు, యితర గాలికబుర్లు మాయమయ్యాయి. ప్రజల దృఢనిశ్చయం ముందు అవి కూలిపోక తప్పింది కాదు. ఫేసిస్టు ప్రతికూల శక్తులకు నాయకత్వం వహించి, మార్గదర్శిగా పనిచేసిన కమ్యూనిస్టు పార్టీ యొక్క, దాని కార్యదర్శి జోస్ డయజ్ యొక్క నిరంతర కృషివల్లనే యిది జరిగింది.

నేడు స్పెయిన్‌లో ఐక్య సంఘటన విధానం యెన్నోరెట్లు వృద్ధి చెందింది. స్పెయిన్ దేశపు వివిధ కార్మికవర్గ పార్టీలలో, వివిధ కార్మిక సంఘాలలో, వివిధ పాప్యులర్ ఫ్రంటు సంస్థలలో నేడు ఐక్యత పూర్వంకంటె యెక్కువైంది. ప్రజా ప్రభుత్వంకోరే ప్రతీ స్పెయిన్ వాడుడు పూర్వం కంటె నేడు యెక్కువ ఆత్మవిశ్వాసంతోను, దృఢ నమ్మకంతోను శత్రు సైన్యాలతో యుద్ధం చేస్తున్నాడు. ఈ పోరాటానికి నాయకులు కమ్యూనిస్టు పార్టీ, జోస్ డయజ్.

సంస్థానాలలో

కాంగ్రెసు వారి కొంపలు తగుల బెట్టుచున్నారు!

తిరువాన్కూర్

"....కాలే, విపరీత బుద్ధిః" అన్నట్లుగా తయారైంది తిరువాన్కూరు ప్రభుత్వపు ప్రవర్తన. ప్రజా ఉద్యమం ఎక్కువౌతున్న కొద్దీ, ప్రజల కోర్కెలను గమనించడం పోయి అమానుష చర్యలకు గడంగుతూంది ప్రభుత్వం. కాంగ్రెసు నాయకులను పట్టుకొనలేక వారి కొంపలు తగులబెట్టుస్తున్నారు.

కడకాల్‌లో మిలిటరీ క్యాంపుపెట్టి అది సెంటర్‌గా పెట్టుకొని ప్రజలను హింసలగొట్టడం, ప్రజా నాయకుల కోసం వెదకడం ప్రారంభించారు. ఈ పోలీసుల అనుమతి లేనిదే పాలు పెరుగు బజారులో సరకులు కొనకూడదని శాసనం. రాఘవన్ అనే ఆయన వీరికి దొరకలేదట. అందుకని ఆయన కొంపకు నిప్పంటించారు.

కోయిలోన్ సబ్ జైలులో రెండు చిన్న గదులలో 125 మందిని పెట్టారు. ఊపిరి ఆడక ముగ్గురు మరణించారు.

మలయాళ సంఘాధ్యక్షుడు, ఇదివరలో తూర్పు ఆఫ్రికా సోషల్ లీగ్ కార్యదర్శియైన డా॥ యస్.యస్. పిళ్లై అను ఆయనను అరెస్టు చేసి లాకప్‌లో పెట్టారు. లాకప్ చేసేవరకు ఆయన దుక్కలా వున్నాడు. కాని, మర్నాడు తెల్లవారేసరికి సరిగ్గా ఊపిరి పీల్చలేని స్థితికి వచ్చాడు. డాక్టరు పరీక్ష ఫలితంగా రొమ్ము ఎముక విరిగిందని తేలింది. ఈ "చీకటికొట్టు" రహస్యం "అనన్య ప్రభు"వైన ఆ తిరువాన్కూరు మహారాజుకే తెలియాలి; లేదా దయ్యాల్‌నే మంచివాడనిపిస్తున్నట్లు రాజ్య చక్రం తిప్పుతూన్న ఆ సర్. సి. పి. రామస్వామి అయ్యంగారికే తెలియాలి.

పున్నాకాల్ అనే వాలంటీరును అరెస్టుచేసి కారులో తీసుకు వస్తూండగా సి. ఐ. డి. పోలీసు బూటుకాలితో ముఖం మీద తన్నాడు. అతని ముఖం చితికిపోయింది. పోలీసు లారీ అంతా రక్తమయం అయింది. ఈ విషయాలన్నీ అతడూ, అతని తోడివారూ విచారణ సమయంలో మేజిస్ట్రేటు గారితో విన్నవించుకున్నారు. ధర్మాత్ముడు ఆ జడ్జీ గారు. ఆ కాసేపు చెవిటి వ్రతం పట్టాడు.

అలెప్పీలో ఒక వాలంటీరును లాకప్‌లో పెట్టి బాదకొట్టారు. స్పృహ తప్పి పడిపోతే రెండు రోజులు ఒక గదిలో పెట్టి తిండి తిప్పలు లేకుండా చేసి మూడో రోజున వదలిపెట్టారు.

గోనికి తోడు ఈ విషయాలన్నీ తెలియపరుస్తూ సంస్థాన కాంగ్రెసు నాయకులు గాంధి గారికి టెలిగ్రాం యిస్తే, ప్రభుత్వం దానిని సెన్సారు చేసి అందులో, ఈ దురంతాలకు సంబంధించిన విషయాలన్నీ తీసిపారవేసి మిగతా మాటలు మాత్రమే గాంధి గారికి అందజేశారు. ఇంత జేస్తున్న సంస్థానాధీశులకు "హృదయ పరివర్తన"మో అంటాడు వెర్రి మహాత్ముడు. వీరికి హృదయమంటూ ఉంటేగా పరివర్తన చెందడానికి!

ఇంతే కాదు.

మధురనుండి వచ్చిన శివరాజ పండ్యన్ అనే వాలంటీరును అరెస్టు చేసి, విచారణ కోసం క్విలన్‌కు తీసుకు వెళ్లారు. అక్కడ లాకప్‌లో అతడు మరణించాడు. గుండె ఆగిపోవడంవల్ల మరణించాడని గవర్నమెంటు డాక్టరు ప్రకటించారు. అంతవరకూ దృఢంగా పని చేస్తూన్న గుండె ఈ లాకప్‌లోనే ఎందుకు ఆగిపోవలసి వచ్చింది? దీని విషయమై విచారణ చేయడాని కూడా నిరాకరించింది ప్రభుత్వం.

ప్రజల నింత బాగా పరిపాలిస్తున్నందుకు కాబోలు తిరువాన్కూరు ప్రభువు జన్మ దినోత్సవాన్ని వైభవంతో జరప నిశ్చయించింది ప్రభుత్వం. జన్మ దినోత్సవం నాటికి సంస్థాన కాంగ్రెసు 8 వ అధ్యక్షురాలైన శ్రీమతి పి. రామనాధ పిళ్లైగారొక కార్యక్రమాన్ని సూచించారు ఆనాడు ప్రజలందరూ తమ కష్టాలను ప్రభువుకు చెప్పుకోవాలనీ, అవసరమైతే ఇంకా గొప్ప సత్యాగ్రహానికి తయారు కావాలనీ, పన్నుల నిరాకరణకు కూడ, సిద్ధపడాలని ఆమె హెచ్చరించింది. ఆమెను, ఆమె వెంట వచ్చిన 9 మంది వాలంటీర్లను కూడా అరెస్టు చేశారు. ఆమెకు 18 నెలలు శిక్ష విధించారు.

నగర కోయిల్‌లో 7 గురు వకీళ్ళను అరెస్టు చేసి ఆరేసి నెలలు శైదు, రు 700లా॥ జరిమానా విధించారు.

త్రివేంద్రం సైన్సు కాలేజి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జి విషయం విచారణ జరపడానికి కూడా సంస్థాన ప్రభుత్వం నిరాకరించింది.

మద్రాసు నుండి వెలువడే "ఇండియన్ ఎక్స్ప్రెస్" అనే ఆంగ్ల దైనిక పత్రిక తమ సంస్థానంలోనికి రాకూడదంటూ నిషేధించింది. ఈపత్రిక చేసిన మహాపరాధం అల్లా, సంస్థానాల్లోని పోరాటాలను ఎప్పటి కప్పుడు, ఉన్నది ఉన్నట్లు ప్రకటిస్తూండడమే!

ఇన్నీ చేస్తూ దివాన్‌గారు వల్లభాయి పటేల్ గారిని కలుసుకొని ఏమో మాట్లాడారు. గాంధి గారిని కూడా కలుసు కుంటాడట. వీరిద్దరిని బుట్టలో వేసుకుంటే తన యిష్టం వచ్చిన ఆటలన్నీ ఆడవచ్చునని ఈమంత్రి శేఖరుని యెత్తు!

తిరువాన్కూరు దురంతాలను గురించి ప్రకటన గావిస్తూ సుభా‌ష్‌బోసు తిరువాన్కూరు ప్రజల కార్యదక్షతను, ధైర్యాన్ని కొనియాడారు. బాధ్యతాయుత ప్రభుత్వాల కొరకు బయలు దేరిన న్యాయమైన ఉద్యమాల యెడల సంస్థాన ప్రభుత్వాల క్రూర నిర్బంధ విధానాలను ఖండించారు సంస్థాన ప్రజల ఉద్యమానికి కాంగ్రెసు తప్పక సహాయం చేస్తుందని ప్రకటించారు

ఢెంకనాల్

పులిని చూచి నక్క వాత బెట్టుకొన్నట్లు తిరువాన్కూరును చూచి ఢెంకనాల్ ప్రభుత్వం కూడ తన నిర్బంధ విధానాన్ని నానాటికి ఎక్కువచేస్తోంది. ప్రచండపురమనే గ్రామంలో పోలీసు దౌర్జన్య ఫలితంగా నలుగురు గ్రామస్తులు మరణించారు. పదిమందికి తీవ్రమైన గాయాలు తగిలాయి. యిదంతా ఎందుకు వచ్చిందంటే, ఆ మర్నాడు ప్రక్కవూళ్ళో జరుగబోయే మీటింగుకు ప్రజలను వెళ్ళకుండా భయపెట్టడానికి!

కార్పూర్‌ఘాట్ అనేచోట పోలీసుల కాల్పుల ఫలితంగా 7 గురు మరణించారు. ప్రజ లీ దురంతాలను సహించలేక తండోపతండాలుగా పోయి పోలీసుస్టేషన్‌ను ముట్టడించారు. కాని పోలీసులు వారిని చెదరగొట్టేశారు.

మిత్రపర్‌ఘాట్‌లో సంస్థాన పోలీసులు మరల ప్రజాసమూహముపై తుపాకులు కాల్చారు, 5 గురు వెంటనే మరణించారు.

మొన్న 14 వ తేదీని ఢెంకనాల్‌కు బ్రిటిష్ సిపాయీల స్పెషల్ ట్రెయిన్ ఒకటి వెళ్ళింది. ఎందుకు పోయిందో ఇంకా తెలియలేదు. కాని, బ్రిటిష్ ప్రదేశాలలో నున్న ప్రజామండలి కార్యాలయాలన్నీ సంస్థానంలోకి మార్చవలసినదని మాత్రం స్టేట్ కాంగ్రెస్ కార్యదర్శి సలహా యిచ్చారు. ఈ సంస్థానంలోని పరిస్థితులు మహాత్ముని కూడ కలవరపరిచాయి.

రాజకోట

ఈ సంస్థానంలో జరుగుతూన్న దురంతాలకు జవాబుగా పత్రికలందరు సమావేశమై సంస్థానపు మిల్లులలో తయారయ్యే బట్టలు కొనకూడదని తీర్మానించుకున్నారు. సంస్థానంలోని జైళ్ళన్నీ నిండిపోయాయి. తమ ఆశయమైన "బాధ్యతాయుత ప్రభుత్వం వచ్చేవరకు స్త్రీలు, పురుషులు, పిల్లలు పోరాడడానికి దృఢ నిశ్చయులై యున్నా"రని రాజకోట సత్యాగ్రహ నాయకుడు ప్రకటించారు. ఆదే సభకు అధ్యక్షత వహించిన వల్లభభాయి పటేల్ గారు కూడ, "సంస్థానాధికారులు ఎంత అణచివేయ ప్రయత్నించుచున్నను ప్రజలు విజయం పొందక తప్ప"దని ఉద్ఘాటించారు.

అతఘర్

కాంగ్రెసు సంఘం ఏర్పాటుచేసిన మీటింగుకు వెళ్ళి తిరిగి వస్తుండగా 300 మంది ప్రజలపై సంస్థానపోలీసులు తుపాకులు కాల్చారు. సంస్థానంగుండా నడవడానికి ప్రయత్నించారని వంక!

దీనికి కొద్ది రోజుల క్రితమే 1908, 1932 లలోని క్రిమినల్ లా అక్టును ఇప్పుడు అమలులో పెట్టి ప్రజామండలి కార్యవర్గ ఆస్తిని ప్రభుత్వం స్వాధీనంచేసుకుంది.

మానసిక వికాసానికి ఏర్పడ్డ విద్యాలయాలు దాసత్వానికి నిలయాలైనవి!

శ్రీ సి. యల్. నారాయణ

ఇంకొక నెలలోగా ఆంధ్ర విద్యార్థి మహాసభ బెజవాడ యందు జరుగబోవు చున్నది. అప్పుడే సభను జయప్రదంగా నడపటానికై విరివిగా ప్రయత్నాలు జరుగుచున్నాయి. క్రిందటి సంవత్సరం మహాసభకున్నూ అంతకు ముందు జరిగిన మహాసభలకున్నూ కావలసినంత వ్యత్యాసముంది. ఈ వ్యత్యాసము ఆ మహాసభల యందు తీర్మానింపబడిన విషయాల ననుసరించి కనుగొనవచ్చును. విద్యార్థులలో రాజకీయ చైతన్యం ఎక్కువ అవటం దీనికి ప్రధాన కారణం. క్రిందటి సంవత్సరం కంటె ఈ సంవత్సరం అభివృద్ధి ఉండాలి కాని వెనుకకు పోరాదు. అక్కడే నిలువకూడదు. ఏయేటి విద్యార్థి కష్టాలన్నిటిని తీర్మానాల రూపములో లిఖిత పూర్వకంగా వివరింతారు కాని ఆ కష్టనివారణకై తీవ్ర ప్రయత్నాలు ఆంధ్ర దేశమంతట జరుగలేదు. కొద్ది చోట్ల కొన్ని విషయాలమీద జరిగినను శాశ్వత ఫలితం ఏమిరాలేదు. కనుక ఈ కాన్ఫరెన్సు యొక్క ముఖ్యోద్దేశం ఆ తీర్మానాల నన్నిటిని అనుభవంలోనికి తీసికొని రావటానికి మార్గాలు వివరించటం. ప్రస్తుతం ఇది చాల అవసరం. కాన్ఫరెన్సు దృష్టిఅంతా దీనిమీదనే కేంద్రీకరింపజేయాల్సి ఉంటుంది. నిర్మాణ కార్యక్రమం ఆలోచించటానికి ముందు సభాసమావేశము ఎట్టి పరిస్థితులలో జరుగబోవు చున్నదో వివారింతము.

ఏయే పరిస్థితులలో సభా సమావేశం జరుగబోవు తూంది.

(a) ఇంతకు ముందు, విద్యార్థులు రాజకీయాలలో పాల్గొనరాదని గవర్నమెంటు రూలు. కాని దాన్ని కాంగ్రెసు గవర్నమెంటు తీవ్రమైన రాజకీయాల్లో పాల్గొనరాదని సవరణ చేసారు. చాలా కష్టపడ్డారు పాపం! అవతల ఇంకొక ప్రక్కన చూండే, యునైటెడ్ ప్రావిన్సు గవర్నమెంట్లు ఇటువంటి భేదము చేయకుండా, 16 సంవత్సరముల వయస్సు దాటిన విద్యార్థి రాజకీయాల్లో పాల్గొనవచ్చునని చట్టనిర్మాణంచేస్తే, ఇక్కడ మద్రాసు గవర్నమెంటు విద్యార్థుల విషయంలో అన్యాయంగా ప్రవర్తిస్తుంది: రాజకీయాల్లో "మందము"ఏమిటో "తీవ్రము" ఏమిటో తెలియకున్నది. అందులో పరాధీన భారతదేశములోని విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనకుండా ఉండటమనేది అసంభవము. దేశ స్వాతంత్ర్యానికై పాటుపడుచున్న కాంగ్రెసు నాయకులలో కొంత మంది స్వాతంత్ర్య సంపాదన శక్తులలో నొకటియైన విద్యార్థిశక్తిని ఇంత చులకనగా చూడటం విచారకరమైన విషయం.

(b) కాలేజీలలో జీతాలు ఎక్కువయిన (బి. యే. తరగతికి సంవత్సరం రు 12/- లు, యఫ్. ఏ. కు రు 6/- లు) క్రొత్తగా ఈ సంవత్సరమే వచ్చిన రూలు. విద్యార్థి లోకానికి, ఆర్థికంగా మానసికంగా కూడ తీరని నష్టాన్ని ఆపాదిస్తూ ఉంది. దీని ముఖ్యోద్దేశం, కళాశాల విద్యను నిరుత్సాహ పరచటం. ఉన్నతవిద్యల నభ్యసించువారు 10% కంటె తక్కువ ఉన్న మన దేశములో, ఈ ఉద్దేశ్యము, అభివృద్ధి నిరోధకంగా ఉంటుంది. ఇంకా ఇది పేదవారైన తల్లిదండ్రులపై అధికభారం మోపుతూ ఉంది. ప్రస్తుత విద్యల నభ్యసించు వారికి, నవీన శాస్త్రీయాభివృద్ధి చేసికొని, సిద్ధాంతాలను, ఆచరణలో కలిపి, **(To link practice with theory)** ప్రోత్సాహ మీయటానికి బదులు, సంఘాభివృద్ధికి అడ్డు వచ్చు వార్ధా విద్యా విధానాన్ని, — పరిశ్రమలు, యంత్రాభివృద్ధి ద్వారా జరుగుచున్న రోజులలో చేనేత పరిశ్రమల చేత కాబోయేది పొయల వికసింపనున్న మేధస్సును అరికట్టటానికి ఉపయోగపడు వార్ధా విద్యా విధానాన్ని - ప్రవేశ పెట్టటానికి గాను కాంగ్రెసు గవర్నమెంటు చేయుచున్న ప్రయత్నాలలో నిది మొదటిగా నున్నది.

(c) మూడవ తెలివిమాలిన పని విద్యార్థి బృందము, బోధకులు మధ్య అనవసరంగా కక్ష ఏర్పడటానికి దారిచ్చినట్టి ఇంకొక రూలు. ఇది స్కూళ్ళు ఉన్నతోద్యోగుల చేతుల్లో ఇదివరకున్న పవర్ని కంటె ఇంకా గొప్ప పవర్ని పెట్టుతుంది. దీన్ని ఆధారం చేసికొని వారు స్టూడెంటు యొక్క విద్యాలయపు బయట నడతను, పరిశీలించి తమ ఇష్టము వచ్చిన శిక్షను పాత్రులను చేయుటకు ప్రయత్నాలు తప్పక చేస్తారు. జరుగుచున్నవి కూడా. అప్పుడే సంవత్సర ప్రారంభమున మచిలీ నుండి కొంతమంది విద్యార్థులకు **T. C.** లు ఇచ్చి పంపించి అనేక ఇబ్బందులకు వారిని లోనగునట్లు చేయటం, మరి కొంతమందిని తప్పింపటం జరిగినవి. హైస్కూళ్ళలో ఇంతకంటె మరీ నిర్బంధమైన వాతావరణం ప్రబలుతుంది. పెంపొందుతుంది.

మన యూనివర్సిటీ మెడికలు డిగ్రీలు గుర్తింపక పోటం అందరకు తెలిసిన విషయమే. కాంగ్రెసు గవర్నమెంటు వచ్చింది, తాము కొంతవరకైన స్వాతంత్ర్య వాయువులు పీల్చ గలుగుదుమని ఆశించు విద్యార్థుల యాశలు అడియాసలయినాయి.

(d) యూనివర్సిటీ అధికారులు విద్యార్థులనుభవించు కష్టాలు తెలిసియు ఉదాసీనతను వూనియున్నారు. హిందూదేశం ఉష్ణానికి నిలయం. అట్టి దేశంలో పరీక్షలు మండు వేసంగిలో పెట్టటం చాలా విచారకరమైన విషయము. అన్ని యూనివర్సిటీలలో రోజుకొక పరీక్ష ఉంటూంటే, ఇక్కడ మధ్య మధ్య సెలవన్నా లేకుండా, దినానికి రెండు పరీక్షలు పెడుతున్నారు. ఇది విద్యార్థుల మానసిక మాంద్యానికి తోడ్పడటానికిన్నీ, దాని ఫలితంగా అనారోగ్యానికి ఆహుతుల్ని చేయుటానికి ఉపయోగిస్తూ ఉంది. పరీక్ష ఫలితాలంటే అంతకంటే అధ్వాన్నంగా ఉన్నవి. నూటికి 30 మంది ప్యాస్ కనాకష్టం. ప్రతి సంవత్సరం విద్యార్థులంతా కలిసి, రోజుకొక్క పరీక్ష పెట్టండి బాబూ, అని అన్నివిధాల ప్రార్థేయ పడుతూ ఉంటే ఇంత వరకు గతిలేదు పతిలేదు. సెనేటు మెంబర్లంతా ఈ విషయమై మూకీభావం వహించారు. వీరి స్వభావం, విద్యార్థులను, శారీరకంగా మానసికంగా దుర్బలులను చేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి మరింత తోడ్పడుతుంది. ఎంతకాలం విద్యార్థులు ఈ తాపాన్ని లోన అణచుకొని ఉండటం?

పరీక్ష ఫీజు తీసికొనే విషయంలో ఇంతకంటే దారుణం ఇంకొకటి లేదు. అంత డబ్బు తీసికొని అథారిటీలు, పేపర్లు ఇచ్చిన వాళ్ళకి, దిద్దిన వాళ్ళకి వెదజల్లి వేయుట కొరకు ఉపయోగిస్తారు కాని, దేశ ఆర్థిక పరిస్థితులు కొంచెమైన కనుకొని వాని కనుకూలంగా ఏ మాత్రం నడవటానికి పూనుకొనరు-ఇవన్నీ పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణ సంకటం మాదిరిగా ఉన్నాయి.

ఈ కష్టాలన్నీ, ఆంధ్రదేశములోని విద్యార్థి బృందానికి సామాన్యంగా ఉన్నాయి. వీటికితోడు ప్రతి స్కూలుకు ప్రతి కాలేజీకి వానివాని అధికారుల ననుసరించి ప్రత్యేక కష్టాలెన్నో ఉన్నవి. హైస్కూళ్ళలో బెత్తంతో పాలన జరుగుతూ ఉంది. కొన్నిట్లో కదిలితే జరిమానా, మెదిలితే జరిమానా, సెలవు చీటి పంపకుండా బడికిరాకుంటే, అది రెండు రోజులు బడికి రానిదానికి సమానం: మరికొన్ని స్కూళ్ళలో విద్యార్థి సంఘాలు పెట్టుకోకుండా అడ్డం రావటం, ఎవరైన కొంతమంది సంఘ నిర్మాణానికి ప్రయత్నిస్తే వారిమీద డిసిప్లినరీ చర్య తీసికొనటం. ఈ విధంగా మేధా బుద్ధుల వికాసానికని ఉద్దేశింపబడిన విద్యాలయాలు దాసత్వానికి ధామానికి నిలయమై పోయినవి. క్రిందటి సంవత్సరమే విద్యార్థి సంఘాలు వారి వారి కష్టాలు తెలియ పరచటానికి ప్రారంభించినవి. దీనికి ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషను యొక్క ప్రత్యేకత, దేశ పరిస్థితుల మార్పు కొంత కారణం. ఇతర రాష్ట్ర విద్యార్థుల అనుభవం కొంత కారణం. దీ పెద్దల ప్రశ్న నాధారం చేసికొని విద్యార్థి సమ్మెలు జరిగినవి. కొన్నిచోట్ల కష్టాలన్నీ తీరుస్తామని వాగ్దానాలు అధికారులు చేసారు. ఆ సంవత్సరం అయిపోయింది వాగ్దానాల్లో ఒక ముక్కైన నెరవేర్చటానికి ఏమి ప్రయత్నాలు జరుగలేదు. పైపన సంవత్సరం మొదట నుండి అధికారులు జాగ్రత్త పడుతున్నారు. విద్యార్థి సంఘ నిర్మాణానికి అడ్డంకులు కలుగ చేస్తున్నారు. క్రొత్తగా తమ చేతిలోనికి వచ్చిన **Powers** ను వృథాగా పోనియకుండా సాయశక్తులా పని చేస్తున్నారు. దీని ఫలితంగా చాలా హైస్కూళ్ళలో యూనియన్లులేవు. ఉన్న యూనియనులలో కొన్ని చురుకుగా పని చేయుటలేదు. ఇట్టి పరిస్థితులు విద్యార్థి లోకాన్ని ఆవరించి ఉన్నవి. విద్యార్థి కాన్ఫరెన్సు జరుగబోతూంది. ఈ పరిస్థితు లన్నిటిని ఎక్కువెటు పంటానికి మార్గాలు వివారించాలి. కాన్ఫరెన్సు జరుగవలసిన విద్యార్థి సంఘాలందు కొన్ని ప్రత్యేక బాధ్యతలున్నవి. అవి కొన్ని యిక్కడ సూచించుటకు ప్రయత్నిస్తాను.

విద్యార్థి కష్టాలు ఎక్కువ అగుచున్న ఈ రోజుల్లో కష్టాలన్నీ మాపు మాపటానికిగాను. సంఘాలు బలవంతమైనవి, ఐక్యవంతమైనవి విరివిగా అభివృద్ధి చెందాలి. సభ జరుగునాటికి ప్రతి సంఘం నుండి ప్రతినిధులు వచ్చి ఎట్లాగో ఒకలాగు సభ జరిపేమంటే జరిపేము కాదు కావలసింది. కాన్ఫరెన్సు చేతిలో విద్యార్థు లనుభవించే కష్టనష్టాల వివరాలు పూర్తిగా నుంటేనేగాని సభ ముఖ్యోద్దేశం పూర్తిగా నెరవేరదు. దానికి ప్రతినిధులే తోడ్పడాలి. కొంచెము చురుకుగానున్న మిత్రులు సంఘ నిర్మాణం బలంగా లేకున్న, ఆలోటును వెంటనే తొలగించటానికి ఉపక్రమించాలి.

ఇంతవరకు చాల హైస్కూళ్ళలో విద్యార్థి సంఘాలు లేవు. క్రిందటి సంవత్సరం సమ్మె జరిగినచోట్ల కూడ విద్యార్థి సంఘాలు ఇంత వరకు లేవు. కనుక ఇప్పుడు చేయవలసిన పని ఒక్కొక్క జిల్లాకు ఆర్గనైజింగు కమిటీని నియమించటం, ఆ కమిటీ ప్రతి స్కూలుకు పోవటం, సంఘాలు లేకుంటే సంఘాలు ఏర్పరచటం, వారికున్న కష్టాలను విచారించి ఆకష్టాలను లిఖిత మూలకంగా అధికారులకు విన్నవించటం, సభ జరుగబోయే రోజు, సభయొక్క ముఖ్యోద్దేశాలు, ఇంకా విద్యార్థి సభకు సంబంధించిన విషయాలు వారి యందు ప్రచారము చేయటం, సామాన్యంగా ఆంధ్ర విద్యార్థి లోకాన్నంతా ఆవరించి యున్న కష్టాలు వాళ్ళకు చెప్పటం, ఆకష్ట నివారణోపాయము ఎప్పుడు చెప్పట ఏవిధంగా పాటుబడింది, ఎంతవరకు జయం పొందింది, తెలియజేయటం వెంటనే జరగాలి. సంఘ నిర్మాణానికి పూర్వము గ్రామములో ఉన్న పెద్దమనుష్యులతోగాని, కాంగ్రెసు కమిటీ, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యులతో గాని సంప్రదించి, వారికి విద్యార్థి కష్టాలందు, ఉద్యమము నందు సానుభూతి కలుగునట్లుచేసి వారి సహాయంతో సంఘా లేర్పరచటంవల్ల ఎంతో ఉపయోగముంది. ఉపాధ్యాయు లందు కూడా సానుభూతిపరు లుంటారు; విద్యార్థి ఉద్యమం, ఉపాధ్యాయుల కష్టాలను కూడ పోగొట్టటానికి ఎట్లు ఉపయోగ పడుతుందో తెలియజేయవలసి ఉంటుంది. స్థలాన్ని, పరిస్థితులను అనుసరించి మనము చేయవలసిన పనులు కూడా మారాలి.


సభ జరుగులోగా ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషనులో విద్యార్థులను సభ్యులనుగా చేర్పించటం, క్రొత్తగా నిర్మింపబడిన సంఘాలకు కొంత కష్ట సాధ్యమైన పని. కనుక అట్టి సంఘాలు కూడా, సభయందు పాల్గొనాలంటే, ఆయా సంఘాలు ఎన్నుకొన్న ప్రతినిధిని కనీసము ఒక్కనినైనా సభకు ఆహ్వానించ వలసి యుంటుంది.

(మిగతా 16 వ పేజీలో)

హెచ్చరిక

రేటు మా తండ్రి గారగు వారేపల్లి లక్ష్మీనరసింహంగారు రచియించిన పుస్తకములను గురించి, నాకున్నూ, మా తల్లిగారికిన్నీ జరిగిన వ్యాజ్యములో గుంటూరు జిల్లా కోర్టువారు O.S 5/37 నులో ది 1-10-38 న, యిచ్చియున్న రాజీనామా తీర్పు ప్రకారం పై వంతు భాగమును అమ్ముకొనుటకు హక్కు కలిగి యున్నాను. కనుక సదరు పుస్తకములు కావలసినవారు నా పేర కూడ వ్రాసి తెప్పించుకొననగును.

అడ్రసు:—
బాలేమూర్తి నాగభూషణరావు.
అరండల్ పేట, గుంటూరు.



నవశక్తి
రష్యా సంచిక
లో
ప్రకటన చేయండి.

ADVERTISE
IN
Soviet Number
OF
NAVASAKTI

అందమైన చిత్రాలతో! అమూల్యమైన వ్యాసాలతో!!

రష్యా సంచిక



నవంబరు 7వ తేదీ
సోవియట్ యూనియన్ 21వ వార్షికోత్సవం నాటికి
వెలువడుతుంది.

సోవియట్ క్రాంతి సందేశం
సమిష్టి వ్యవసాయం
[illegible]
సోవియట్ విధానం
పారిశ్రామికాభివృద్ధి
ఉత్పత్తి విధాన
భీమా సౌకర్యాలు
యువజనోద్యమం
[illegible]

సాహిత్యం — కళలు — విజ్ఞానం — ఇంకా ఎన్నో!
సమస్యలపై వ్యాసాలు ఉంటాయి.

100 పుటలు, 20 పూర్తి పేజీ బ్లాకులు.

గత 21 సంవత్సరాలలో సోవియట్ యూనియన్ పొందిన వికాసాన్ని, వెల్లడించే అమూల్యమైన సంచిక
విడి ప్రతి: నాలుగు అణాలు. ఏజంట్లు కాపీలకు ముందే వ్రాయండి.

— మేనేజరు. 'నవశక్తి'

END OF ISSUE